
'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 253

SUNDAY Special

ఆదివారం 28-5-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నేడే ప్రజాస్వామ్య సౌధం ప్రారంభం

పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ప్రజాస్వామ్య సౌధాన్ని ఆదివారం ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించనున్నారు. షెడ్యూల్ ప్రకారం తెల్లవారుజాము నుంచే యాగం, పూజలు, ప్రార్థనలతో ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టనున్నారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు, వివిధ పార్టీల నేతలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారు. ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించుకోవడానికి దేశ ప్రజలంతా ఒక్కటై, చేతులు కలిపిన తీరు అసలు సిసలైన 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి. - వివరాలు 6లో



అమెరికాలో దీపావళి సెలవు!

'దీపావళి డే' బిల్లు ఆమోదం పొంది.. బైడెన్ సంతకం చేస్తే అమెరికాలో దీపావళి రోజున సెలవు దినంగా పాటిస్తారు.

వివరాలు 6లో ▸



అసిస్టివ్ టెక్నాలజీ వ్యాన్ రెడీ

మారుమూల గ్రామాల ప్రజలకు వైద్య సేవల కోసం విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో రూపొందించిన వ్యాన్‌ను కేంద్ర మంత్రి గడ్కరీ ప్రారంభించారు.

వివరాలు 3లో ▸



నెహ్రూ వారసత్వం.. దీపస్తంభం

ప్రథమ ప్రధాని నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్‌తో పాటు ప్రధాని మోదీ తదితరులు నివాళులర్పించారు.

వివరాలు 6లో ▸



కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన మంత్రివర్గాన్ని విస్తరించారు. మరో 24 మందిని కేబినెట్‌లో చేర్చుకున్నారు.

వివరాలు 6లో ▸



కథానాయకుని వ్యథ..!

దీ పొలిటికల్ ట్రాజెడీ ఆఫ్ ఎన్టీఆర్

- ఇదీ కుట్ర జరిగిన తీరు..
- అవమానాలకు ఆగిన గుండె
- గోబెల్స్‌నే తలదన్నిన రామోజీ
- మామను ముంచిన అల్లుడు

- వివరాలు 4లో

ప్రధాని నరేంద్ర మోదీ, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్‌బేరిలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు



మౌలిక సదుపాయాలే కీలకం

అప్పడే ఆర్థిక వ్యవస్థ త్వరితగతిన అభివృద్ధి..

ఆరోగ్యకరమైన పెట్టుబడుల ద్వారానే అది సాధ్యం

నీతి ఆయోగ్ భేటీలో సీఎం జగన్ స్పష్టీకరణ

- జీడీపీలో సేవలు, తయారీ రంగం వాటా 85% దాటాలి
- ఇందుకు వ్యవసాయం, పెట్టుబడులపై ప్రధానంగా దృష్టి సారించాలి.. ఉత్పాదకతకు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలి
- పరిశ్రమలు, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారతపై ఏపీ శ్రద్ధ.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్లుగా రాష్ట్రం నంబర్‌వన్
- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌తో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు.. విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో ప్రజలకు చేరువైన వైద్యం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఆరోగ్యకరమైన పెట్టుబడుల ద్వారా మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తేనే ఆర్థిక వ్యవస్థలను శీఘ్రగతిన పురోగమిస్తుందని ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. దేశ జీడీపీలో తయారీ, సేవల రంగం వాటా 85 శాతం దాటినప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం నెరవేరుతుందని స్పష్టం చేశారు. రెండు రంగాల ప్రపంచ సగటు వాటా 91.5 శాతంగా ఉందని, ఈ లక్ష్యాన్ని సాధించడానికి వ్యవసాయం, పెట్టుబడులు.. రెండింటికీ సంబంధించిన అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆహార రంగంలో స్వయం సమృద్ధిని సాధించడంతోపాటు, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికి

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి 6లో

- నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ప్రధాని మోదీ

అవినాశ్‌ను అరెస్టు చేయొద్దు

సీబీఐని ఆదేశించిన తెలంగాణ హైకోర్టు

- బలవంతపు చర్యలు వద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు
- 31న తుది తీర్పు ఇస్తామని వెల్లడి
- తల్లితో ఆస్పత్రిలో ఉండేందుకు అవినాశ్‌కు అనుమతి
- హైకోర్టు అడిగిన పలు ప్రశ్నలకు నీళ్లు నమిలిన సీబీఐ
- 'లేదు.. తెలియదు..' దాదాపు అన్ని ప్రశ్నలకు ఇదే రీతిలో సమాధానం



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని తెలంగాణ హైకోర్టు సీబీఐని ఆదేశించింది. ఈ నెల 31న తుది తీర్పు ఇచ్చే వరకు ఆయనపై

మిగతా 2వ పేజీలో ▶

శాంతిభద్రతలు భేష్

బ్రాండ్ ఏపీ

14లో

- భయం వీడిన రాష్ట్ర ప్రజలు.. ప్రశాంత జీవనం
- పోలీసు శాఖ వ్యవస్థాగతంగా బలోపేతం.. నేరాల కట్టడికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం
- విజయవంతమైన ఆపరేషన్ పరివర్తన్
- గంజాయి దందాకు చరమగీతం
- సారా దందాలపై ఉక్కుపాదం.. సైబర్ నేరాలకు కళ్లెం
- రాష్ట్రంలో తగ్గిన నేరాలు–పెరిగిన భద్రత
- జాతీయ స్థాయిలో ఏపీ పోలీసు శాఖకు గుర్తింపు


ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ ఎనిమిదో పాలక మండలి సమావేశ దృశ్యం


నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


కేంద్రమంత్రి షెకావత్‌తో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మౌలిక సదుపాయాలే కీలకం

▶ మొదటి పేజీ తరువాయి

కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రాష్ట్రాలూ ఒక జట్టుగా పని చేయాలని, ప్రతి రాష్ట్రం శ్రేయస్సు మొత్తం దేశంతో ముడి పడి ఉంటుందని చెప్పారు. శనివారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ ఎనిమిదవ పాలక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి ఆయోగ్ చర్చించే వివిధ అంశాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరిస్తూ ఒక నోట్ సమర్పించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

పోర్టు ఆధారిత అభివృద్ధికి ఏపీ ప్రాధాన్యం

- దేశంలో లాజిస్టిక్స్ కోసం పెడుతున్న ఖర్చు జీడీపీలో 14 శాతంగా ఉంది. భారతీయ ఉత్పత్తులు ప్రపంచ స్థాయిలో పోటీ పడేందుకు ఇది ప్రతిబంధకంగా మారింది. అమెరికాలో లాజిస్టిక్స్ ఖర్చు కేవలం 7.5 శాతానికే పరిమితమైంది. గత తొమ్మిదేళ్లలో సరకు రవాణా కారిడార్లు, జాతీయ రహదారులపై ప్రభుత్వం ప్రశంసనీయ రీతిలో వ్యయం చేస్తోంది. ఆశించిన ఫలితాలను సాధించడానికి దీన్ని కొనసాగించడం చాలా అవసరం.
- ఇందులో భాగంగానే ఏపీ ప్రభుత్వం పోర్టు ఆధారిత అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రంలో కొత్తగా 4 కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులోని ఓర్వకల్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసింది. విశాఖపట్నంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పీపీపీ పద్ధతిలో నిర్మిస్తోంది.

రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు.. 6 లక్షల మందికి ఉపాధి

- తయారీ, సేవల రంగాల వాటా పెరుగుదలను సాధించడానికి పెట్టుబడులు చాలా అవసరం. దీనికి అనుకూలమైన వ్యాపార వాతావరణం తప్పనిసరి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ గత మూడేళ్లుగా వరుసగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది.
- ప్రభుత్వం వ్యాపారస్తులకు అత్యంత అనుకూలంగా అనుమతులు సహా తదితర విధానాలను సరళీకృతం చేసింది. వాడుకలో లేని చట్టపరమైన నిబంధనలను సవరించడంతో పాటు కొన్నింటిని రద్దు చేసింది.
- విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు అద్భుత స్పందన లభించింది. రూ.13 లక్షల కోట్ల భారీ పెట్టుబడులతో వివిధ సంస్థలు, కంపెనీలు ముందుకు వచ్చాయి. దీని వల్ల దాదాపు 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ప్రజారోగ్యం బలోపేతం

- ప్రజారోగ్యం, పౌష్టికాహారం కూడా చాలా ముఖ్యమైన అంశాలు. పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, పెరుగుతున్న సంక్రమించని దీర్ఘకాలిక వ్యాధులైన హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం వంటి అనారోగ్యాలకు సమయానికి చికిత్స అందించకపోతే తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. టెరిటరీ హెల్త్‌కేర్ పేరిట అతిపెద్ద భారానికి దారితీస్తుంది. అందుకనే దీనిపై ఎక్కువగా శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, పౌష్టికాహారంపై అత్యంత దృష్టి పెట్టాలి.
- ఏపీ ప్రభుత్వం 10,592 గ్రామ, వార్డు క్లినిక్‌లను ఏర్పాటు చేసి, ఇందులో ఒక మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, ఒక ఏఎన్ఎం, ఆశావర్కర్లను అందుబాటులో ఉంచింది. ప్రతి విలేజ్, వార్డు క్లినిక్‌లో 105 రకాల అవసరమైన మందులు, 14 రకాల డయాగ్నస్టిక్స్ అందుబాటులో ఉన్నాయి.
- రెండున్నరేళ్లలో రాష్ట్రంలో 48,639 మంది వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని నియమించింది. విలేజ్ క్లినిక్‌ల నుండి బోధనాస్పత్రుల వరకు అవసరమైన సంఖ్యలో వైద్యులు, నర్సులు, పారామెడిక్స్ ఉన్నారు.
- విలేజ్ క్లినిక్ కాన్సెప్ట్‌ను పూర్తి సామర్థ్యంతో అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇందులో పీహెచ్‌సీల నుండి వైద్యులు కనీసం నెలకు రెండుసార్లు వారికి నిర్దేశించిన గ్రామాన్ని సందర్శిస్తారు. విలేజ్, వార్డు క్లినిక్‌ల సౌకర్యాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవడానికి ముందుగా పేర్కొన్న తేదీల్లో వైద్యులు ఆయా గ్రామాలను సందర్శిస్తారు.
- జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా వచ్చే వ్యాధుల సమస్యలను సమర్థవంతంగా స్క్రీనింగ్ చేయడం, గుర్తించడం, నిర్ధారించడం, ట్రాక్ చేయడం, చికిత్స చేయడం ద్వారా విజయవంతంగా వాటిని నివారించవచ్చని ప్రగాఢంగా నమ్ముతున్నాం.

మహిళలకు చేయూత

- సమ్మిళిత వృద్ధి లక్ష్యాన్ని సాధించడానికి మహిళా సాధికారత చాలా కీలకం. మహిళలకు ఆర్థిక వనరులు, అవకాశాలను పెంపొందించడానికి, ఏపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేయూత, ఆసరా వంటి అనేక పథకాలను అమలు చేస్తోంది. దీని కింద వెనుకబడిన, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు నాలుగేళ్లుగా స్థిరంగా ఆర్థిక సహాయం అందిస్తున్నాం.
- మహిళా స్వయం సహాయక సంఘాలపై అధిక అప్పుల భారం.. ఆదాయాన్ని సమకూర్చే కార్యక్రమాల్లో వారి పెట్టుబడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని ప్రభుత్వం గుర్తించింది. ఈ పోటీ ప్రపంచంలో వారు నిలదొక్కుకోవడం చాలా కష్టమవుతున్నందున, సున్నా వడ్డీ కార్యక్రమం ద్వారా, సకాలంలో తిరిగి చెల్లించే షరతుపై ఎస్‌హెచ్‌జీలు పొందే రుణాలపై వడ్డీ రాయితీని ప్రభుత్వం గణనీయంగా అందిస్తోంది.
- కేవలం నిధులను మహిళల చేతుల్లో పెట్టడంతోనే ప్రభుత్వాల పాత్ర ముగిసిపోకూడదు. పెట్టుబడి పెట్టడానికి, తీవ్రమైన పోటీని తట్టుకునేలా ఆయా కార్యక్రమాల్లో కొనసాగడానికి మహిళలకు పరిమిత సామర్థ్యం ఉందని ప్రభుత్వాలు గుర్తించాలి. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అనుసంధానాలను పొందడంలో మహిళలకు చేయూతనిచ్చి నడిపించే ప్రగతిశీల విధానాన్ని ప్రభుత్వాలు అవలంబించాలి.

డైనమిక్‌గా పాఠ్య ప్రణాళిక

- నైపుణ్యాభివృద్ధి అన్నది మరో కీలక అంశం. జర్మనీ వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఈ అంశంలో క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. తగ్గుతున్న జననాల రేటు కారణంగా, ఆ దేశాలు చివరకు శ్రామికశక్తి కొరతను ఎదుర్కొంటాయి. పని చేసే వయసున్న జనాభా విషయంలో సమస్యను ఎదుర్కొంటున్నాయి.
- అదృష్టవశాత్తు మన దేశ జనాభాలో అధిక భాగం పనిచేసే వయసున్న వారే ఉన్నారు. ఇది దేశానికి అత్యంత ప్రయోజనకరం. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, లార్జ్ లాంగ్వేజీల ప్రవాహం ప్రపంచాన్ని శరవేగంగా మారుస్తోంది. ఈ సృజనాత్మక యుగంలో పాతవాటి విధ్వంసం, కొత్త ఆవిష్కరణలు.. ఇప్పటికే ఉన్న వ్యాపార పద్ధతులు, ప్రక్రియలు, సాంకేతికతలను సమూలంగా మార్చేస్తున్నాయి. దీన్ని ఎదుర్కోవడానికి వీలుగా మనం పాఠ్యాంశాల్లోనే అర్థవంతమైన, డైనమిక్ నైపుణ్యాలను నేర్చుకునేలా కొత్తవాటిని ప్రవేశపెట్టాలి. పాఠ్య ప్రణాళికను డైనమిక్‌గా తీర్చిదిద్దాలి.

కేంద్ర మంత్రి షెకావత్‌తో సీఎం వైఎస్ జగన్ భేటీ

ప్రధానంగా పోలవరం ప్రాజెక్టుపై చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో భాగంగా రెండవ రోజు శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేంద్ర జల శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో భేటీ అయ్యారు. ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ 8వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సీఎం.. సాయంత్రం 6.30 గంటలకు షెకావత్‌తో 40 నిమిషాల పాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టుపై ప్రధానంగా చర్చించారు. ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తయ్యేలా సహకారం అందించాలని, సవరించిన అంచనాల వ్యయం నిధులు విడుదల చేయాలని కోరారని తెలిసింది.

నిమ్స్‌లో వైఎస్ భాస్కర్‌రెడ్డికి వైద్య పరీక్షలు

హైదరాబాద్(లక్డీకపూల్): అస్వస్థతకు గురైన వైఎస్ భాస్కర్‌రెడ్డికి హైదరాబాద్ నిమ్స్‌లో శనివారం గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. దీనికి సంబంధించిన నివేదిక సోమవారానికి వస్తుందని నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. వివేకా హత్య కేసు దర్యాప్తులో భాగంగా చంచల్‌గూడ జైల్లో ఉన్న భాస్కర్‌రెడ్డి శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. దీంతో జైలు అధికారులు ఆయనకు వైద్య పరీక్షలు చేయించి.. బీపీ లెవల్స్ తగ్గడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. యాంజియోగ్రామ్ తదితర పరీక్షల నిమిత్తం ఆయన్ని శనివారం నిమ్స్‌కు తీసుకువచ్చారు. అనంతరం తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు.



14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు..

ఎంత సంపద సృష్టించావు బాబూ?

పేర్ని నాని ఫైర్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తాను అధికారంలోకి వస్తే సంపద సృష్టించి.. పంచడం ద్వారా పేదలను కోటీశ్వరులను చేస్తానంటూ మహానాడు వేదికగా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నక్కజిత్తులు ప్రదర్శించారని మాజీమంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని ధ్వజమెత్తారు. 1995 నుంచి 2004, 2014 నుంచి 2019 మధ్య 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన ప్పుడు రాష్ట్రంలో ఎంత సంపద సృష్టించావు? ఎంతమంది పేదలను కోటీశ్వరులను చేశావు. ఆ జాబితా ఇస్తావా? అంటూ చంద్రబాబును ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ మహానాడులో చంద్రబాబు వ్యవహారశైలిని ఏకిపారేశారు. ఎన్నికల సమయంలో పేదలను కోటీశ్వరులను చేస్తానంటూ మాయమాటలు చెప్పడం.. ఆ తర్వాత వారివైపు కన్నెత్తి చూడని ఏకైక రాజకీయ నేత చంద్రబాబేనంటూ మండిపడ్డారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఎన్నికల మేనిఫెస్టో ఫేజ్–1ను ఇప్పుడు విడుదల చేస్తానంటున్నావు.. మరి 2014 ఎన్నికల మేనిఫెస్టోను ఎందుకు మాయం చేశావు? అంటే నువ్వు విడుదల చేసేది ప్రజలను దగాచేసే మేనిఫెస్టోనే కదా. ఇలా వంచించినందుకే 2019 ఎన్నికల్లో ప్రజలు నీకు రాజకీయంగా సమాధి పేర్చారు. ఇప్పుడే కాదు ఎప్పటికీ (నౌ ఆర్ నెవర్) రాష్ట్ర ప్రజలు నిన్ను అధికారంలోకి రానివ్వరు.. రాసిపెట్టుకో. ఇక రాజమండ్రిలో మహానాడు వేదికగా చంద్రబాబు ప్రసంగం అంతా ఆత్మస్తుతి, పరనిందే. తన గొప్పలు చెప్పుకోవడానికి, సీఎం జగన్‌ను దూషించటానికి.. మరోసారి ఓట్ల కోసం చంద్రబాబు నక్కవేషం కట్టాడు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన చేతులతోనే.. సిగ్గులేకుండా ఎన్టీఆర్ చిత్రపటానికి దండవేసి దండం పెట్టడం చంద్రబాబుకే చెల్లింది. ధనిక సీఎం వైఎస్ జగన్ అంటూ చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెబుతున్నాడు. జగన్ ప్రకటించిన మేరకు ఆయన కుటుంబ ఆస్తి రూ.510 కోట్లు. చంద్రబాబు ప్రకటించిన మేరకు ఆయన కుటుంబ ఆస్తి రూ.వెయ్యి కోట్లు. చంద్రబాబు ఎన్నికల డిక్లరేషన్, ఆయన కుటుంబ సభ్యుల ఐటీ రిటర్న్‌ల ఆధారంగానే చెబుతున్నాం. చంద్రబాబూ.. నీ తల్లితండ్రులు నీకిచ్చిన ఆస్తి రెండెకరాలే కదా.. ఆ ఆస్తితో బయల్దేరి ఈరోజు రూ.1,000 కోట్ల దాకా ఎలా ఎదిగావు? ఏర్పాటు సమయంలో ముందుకు సాగని హెరిటేజ్ కంపెనీ.. నువ్వు సీఎం అయ్యాకనే ఎందుకు పరిగెత్తింది?

పేదల ఖాతాల్లోకి రూ.2.10 లక్షల కోట్లు.. ఇక అవినీతికి తావెక్కడ?

రాష్ట్రంలో రూ.2 లక్షల కోట్లు అవినీతి జరిగిందని చెప్పడానికి నోరెలా వచ్చింది చంద్రబాబూ? రాష్ట్ర బడ్జెట్ రూ.2 లక్షల కోట్లు. ఇందులో ఏటా ఉద్యోగుల జీతభత్యాల కింద రూ.70 వేల కోట్లు.. రుణాలు, వడ్డీల చెల్లింపులకు రూ.50 వేల కోట్లు చెల్లించాలి. నవరత్నాల కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ కింద పైసా లంచం లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి రూ.2.10 లక్షల కోట్లను సీఎం వైఎస్ జగన్ జమచేశారు. ఇంక ఎక్కడ అవినీతి జరిగిందో నిరూపించే దమ్ముందా? ఓట్లు అవసరం రాగానే జనం దగ్గర వేషాలేసే సంస్కృతి ఒక్క చంద్రబాబుదే. ఎన్టీఆర్ దగ్గర ఆషాఢభూతి వేషం.. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నయవంచకుడి వేషం.. ఎన్టీఆర్ కుటుంబంలో చిచ్చుపెట్టి శకుని వేషం.. రాజకీయాల్లో అందర్నీ వాడుకుని వదిలేసే తప్పుడు రాజకీయనేత వేషం కూడా చంద్రబాబుదే. ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ప్రజల ముందు నక్కవినయాలు ప్రదర్శించే గుంటనక్క చంద్రబాబు. 2014–2019 వరకు రాష్ట్ర ఆర్థిక పరిమితికి మించి రూ.26వేల కోట్లు మీ తప్పుడు లెక్కలతో అప్పులు చేసిన మాట వాస్తవం కాదా? వైఎస్ జగన్ సీఎం కాగానే.. ప్రభుత్వ ఖజానాలో కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఉన్నాయని.. జీతాలిచ్చే పరిస్థితి కూడా లేదంటూ అప్పట్లో మీ రామోజీరావు ఈనాడులో రాసినది నిజం కాదా? ఇదేనా నీ తప్పుడు సంపద చంద్రబాబూ? చంద్రబాబు 2019లో అధికారంలో నుంచి దిగేటప్పటికీ వేల కోట్లు బకాయిపడ్డారు.

తప్పుదోవలో సీబీఐ విచారణ

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐలో పని చేస్తున్న కీలకమైన అధికారులు కొందరు రహస్య వ్యక్తుల ద్వారా ప్రేరేపించబడి ఉద్దేశపూర్వకంగా తప్పుదోవలో విచారణ చేస్తున్నారని మేం ముందునుంచీ చెబుతున్నాం. ఇవాళ హైకోర్టు న్యాయమూర్తి కూడా ఇవే అంశాలను సీబీఐని ప్రశ్నించారు. సీబీఐ ఏవిధంగా తప్పుడు దర్యాప్తు చేస్తోందో.. ఉద్దేశపూర్వకంగా ఎంపీ అవినాశ్‌రెడ్డిని, సీఎం వైఎస్ జగన్‌ను లక్ష్యంగా చేసుకుని బురద జల్లుతున్న వైనాన్ని సమాజానికి అర్థమయ్యేటట్లు ఈరోజు హైకోర్టు చెప్పింది.

ఇవి ఎమర్జెన్సీ నాటి చీకటి రోజులు

- కేంద్రం అరాచకాలు, ఆగడాలు పరాకాష్టకు చేరాయి: కేసీఆర్
- కేసీఆర్‌తో ఢిల్లీ, పంజాబ్ సీఎంల భేటీ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ అరాచకాలు, ఆగడాలు మితిమీరి పరాకాష్టకు చేరుకుంటున్నాయని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ మండిపడ్డారు. చివరకు సుప్రీంకోర్టు తీర్పుకు కూడా అతీగతీ లేకుండా పోయిందని, ఎమర్జెన్సీ రోజులు గుర్తుకొస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ వచ్చిన ఢిల్లీ, పంజాబ్ సీఎంలు అర్వింద్ కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్‌లతో కూడిన బృందం సీఎం కేసీఆర్‌తో భేటీ అయింది. కేంద్ర ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా మద్దతు ఇవ్వాలని కోరింది. అనంతరం మీడియాతో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రజల చేత ఎన్నుకోబడిన ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోనే అధికారులంతా పనిచేయాలని.. వారి బదిలీలు, ఇతర అంశాలు రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉండాలని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. కానీ కేంద్రం ఆ తీర్పును కాలరాసేలా ఆర్డినెన్స్ తీసుకురావడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఆర్డినెన్స్ ఉపసంహరించుకోవాలని ప్రధాని మోదీని డిమాండ్ చేస్తున్నామని, లేదంటే కేజ్రీవాల్ పక్షాన నిలబడి.. లోక్‌సభ, రాజ్యసభలలో తమ శక్తినంతా ప్రయోగించి ఆర్డినెన్స్‌ను ఓడిస్తామని కేసీఆర్ హెచ్చరించారు.

సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకుంటే ఎలా?: కేజ్రీవాల్

ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ.. '2015 ఫిబ్రవరిలో మా ప్రభుత్వం తొలిసారిగా అధికారంలో వస్తే.. మే 23న నోటిఫికేషన్ ద్వారా కేంద్రం మా అధికారాలను లాక్కుంది. మాకంటే ముందు పాలించిన సీఎం షీలాదీక్షిత్ నియంత్రణలోనే ఢిల్లీలో అన్ని పాలన వ్యవస్థలు పనిచేశాయి. ఢిల్లీ సీఎంగా వైద్య, విద్య శాఖల కార్యదర్శులను బదిలీ చేసే అధికారం నాకు లేదు. దీనిపై ఎనిమిదేళ్లుగా హైకోర్టు, సుప్రీంకోర్టులో పోరాడాం. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ నెల 11న ఢిల్లీ ప్రజల పక్షాన తీర్పు ఇచ్చింది. కానీ.. కేంద్రం ఈ నెల 19న సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేస్తూ ఆర్డినెన్స్ తెచ్చింది. ఈ ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధం. ప్రధానమంత్రి సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించనంటే దేశం ఎలా నడుస్తుంది?' అని ప్రశ్నించారు. రాజ్‌భవన్‌లు బీజేపీ కార్యాలయాలుగా, గవర్నర్లు బీజేపీ స్టార్ క్యాంపెయినర్లుగా వ్యవహరిస్తున్నారని పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్ మాన్ విమర్శించారు. తెలంగాణ, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్ గవర్నర్లు బిల్లులను ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచారని చెప్పారు.

'పార్లమెంట్ ప్రారంభోత్సవానికి మేం దూరమే'

నూతన పార్లమెంట్ భవన ప్రారంభ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు కాంగ్రెస్, ఆప్ సహా 19 పార్టీలు చేసిన సంయుక్త ప్రకటనపై తాము సంతకం చేయకున్నా.. కార్యక్రమానికి తాము కూడా దూరంగా ఉంటామని బీఆర్ఎస్ పేర్కొంది.

నిలకడగా ఎంపీ అవినాశ్ తల్లి ఆరోగ్యం

సాక్షి, హైదరాబాద్: అనారోగ్యంతో శుక్రవారం హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఎంపీ అవినాశ్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మ(60)కి యాంజియోగ్రామ్ పరీక్షల ద్వారా గుండె సంబంధిత సమస్యలున్నట్టు వైద్యులు గుర్తించారు. ఆమెకు కట్టింగ్ బెలూన్ ఆంజియో ప్లాస్టితో పాటు స్టెంట్ కూడా వేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, ఐసీయూలో చికిత్స అందిస్తున్నామని తెలిపారు. తొలుత కర్నూలు ఆస్పత్రిలో చేరిన ఆమెను అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించడం తెలిసిందే.

205 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి

- 93 మంది ఈవోపీఆర్‌డీలు, 112 మంది ఏవోలకు ప్రమోషన్
- ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీరాజ్ శాఖ కమిషనర్

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ శాఖలో విస్తరణాధికారులు(ఈవోపీఆర్‌డీ)గా, మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ అధికారులు (ఏవో)గా పనిచేస్తున్న 205 మందికి ప్రభుత్వం ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సూర్యకుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 93 మంది ఈవోపీఆర్‌డీలు, 112 మంది మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ఏవోలుగా పనిచేస్తున్న వారికి పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారి నుంచే మూడు ఆప్షన్లు తీసుకుని జిల్లాలు కేటాయించినట్లు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు తెలిపారు.

అవినాశ్‌ను అరెస్టు చేయొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో అవినాశ్‌రెడ్డి తల్లికి శస్త్రచికిత్స జరుగుతున్న నేపథ్యంలో ఆమె వెంట ఉండేందుకు ఆయనకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు శనివారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే అవినాశ్ తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి అరెస్టయ్యారని.. ఈ నేపథ్యంలో తల్లిని దగ్గరుండి చూసుకోవాల్సిన బాధ్యత కుమారుడిగా అవినాశ్‌పై ఉందన్న ఆయన తరఫు న్యాయవాది వాదనలను పరిగణనలోకి తీసుకుంటున్నామని న్యాయస్థానం తెలిపింది. సీబీఐ సీల్డ్ కవర్‌లో ఇస్తామన్న వాంగ్మూలాలన్నీ కూడా పరిశీలించాల్సి ఉందని వెల్లడించింది. అవినాశ్‌రెడ్డి, సీబీఐ, సునీత తరఫున న్యాయవాదుల వాదనలు విన్నామని, వాటిపై లోతైన పరిశీలన జరిపి తుది తీర్పు వెలువరించాల్సి ఉందని పేర్కొంది. వివేకా హత్య కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ అవినాశ్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. శనివారం కూడా ప్రత్యేకంగా ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ ధర్మాసనం ముందు.. సీబీఐ తరఫున న్యాయవాదులు అనిల్ తన్వర్, అనిల్ కొంపెల్లి, అవినాశ్‌రెడ్డి తరఫున న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపించారు.

సాక్షుల వివరాలు సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామన్న సీబీఐ

ఈ సందర్భంగా న్యాయమూర్తి అడిగిన పలు ప్రశ్నలకు సీబీఐ నీళ్లు నమిలింది. సమాధానాలు చెప్పలేక 'లేదు.. తెలియదు' అంటూ వాటిని దాటవేసింది. 'అవినాశ్‌ను కస్టడీకి తీసుకుని విచారించాల్సి ఉంది. ఆయన సీబీఐ విచారణకు సహకరించడం లేదు. నోటీసులిచ్చినా విచారణకు డుమ్మా కొడుతున్నారు. కేసు దర్యాప్తుకు ఆటంకాలు సృష్టిస్తున్నారు. వివేకా హత్యకు నెల రోజుల ముందే రాజకీయ కోణంలోనే కుట్ర జరిగింది. వివేకాతో అవినాశ్ కుటుంబానికి రాజకీయ విభేదాలు ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను ఓడించేందుకు కుట్ర జరిగింది. మరికొందరు సాక్షుల వివరాలు సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పిస్తాం. అవినాశ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు' అని సీబీఐ న్యాయవాది వాదించారు.

హత్య విషయాన్ని అవినాశ్‌కు చెప్పింది వివేకా అల్లుడే..

'సీబీఐ చెబుతున్నట్లు ఆధారాలు ధ్వంసం కాలేదు. హత్య జరిగిన విషయం తెలిసి వివేకా ఇంటికి అవినాశ్ చేరుకునేలోపే అక్కడికి వచ్చిన వారు తమ సెల్‌ఫోన్లలో ఫొటోలను, వీడియోలను తీశారు. అవి పరిశీలిస్తే.. ముందు హత్య ప్రదేశం ఎలా ఉందో తెలుస్తుంది. గంగిరెడ్డి తనకు చెప్పాడని దస్తగిరి చెప్పడం, వివేకా హత్య తన కుమారుడికి ముందే తెలుసు అని ఉదయ్‌కుమార్ తల్లి.. ఆమె ఇంటి పక్క మహిళకు చెప్పడం 'ఇయర్ సే ఎవిడెన్స్' కిందకు వస్తుంది. ఇది చట్టప్రకారం చెల్లదు. వివేకా హత్య విషయాన్ని ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డే ఫోన్ చేసి అవినాశ్‌కు చెప్పారు. ఆ విషయాన్ని రాజశేఖరరెడ్డి కూడా ఒప్పుకున్నారు. అసలు ఏవైతే భూపత్రాల కోసం హత్య జరిగిందో.. ఆ డాక్యుమెంట్లను ఇప్పటివరకు సీబీఐ స్వాధీనం చేసుకోలేకపోయింది. హత్యకు వినియోగించిన ఆయుధం కూడా లేదు. అవినాశ్ తల్లి ఆస్పత్రిలో ఉంది. ఆయన తండ్రి ఇదే కేసులో అరెస్టయి ఆస్పత్రిలో చేరారు. తల్లిని చూసుకోవాల్సిన బాధ్యత అవినాశ్‌కు ఉంది. శస్త్రచికిత్స పూర్తయి ఆమె క్షేమంగా ఉండే వరకు సీబీఐ చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలి' అని అవినాశ్ న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసన.. అవినాశ్‌కు ఊరట కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

హైకోర్టు ప్రశ్నలు.. సీబీఐ సమాధానాలు..

1. అవినాశ్‌కు ఎంపీ సీటు అనధికారికంగా ముందే ఖరారైందని, హత్య జరిగిన రోజు కూడా ఆయన ప్రచారానికి వెళ్తున్నట్లు చెప్పారు కదా? అవినాశ్ బలమైన నేత అయినప్పుడు వివేకాను హత్య చేయాల్సిన అవసరం ఏంటి?
సీబీఐ: సమాధానం లేదు

2. విచారణలో ఇంత జాప్యం ఎందుకు జరుగుతోంది.. సామాన్యుల విషయంలో అయితే ఇలాగే వ్యవహరిస్తారా?
సీబీఐ: కోర్టులో పిటిషన్లు వేసి అడ్డుకుంటున్నారు.

3. 'హియర్ సే ఎవిడెన్స్' (ఎవరో చెప్పింది విని చెప్పడం) సాక్ష్యంగా పేర్కొంటున్నారు.. చట్టప్రకారం చెల్లదు కదా?
సీబీఐ: అవును.

4. అవినాశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు గుండెపోటుతో వివేకా మరణించారని ఎఫ్ఐఆర్ నమోదు చేశారా?
సీబీఐ: కాదు.. వివేకా అల్లుడి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

5. వివేకా మృతదేహాన్ని అంత త్వరగా పోస్టుమార్టంకు ఎందుకు తరలించారు.. అవినాశ్ చెప్పారా?
సీబీఐ: లేదు. వివేకా అల్లుడి సూచన మేరకే.

6. అవినాశ్ వాట్సాప్ తెల్లవారుజామున 4 గంటల నుంచే ఆన్‌లోనే ఉంది అన్నారు.. కాల్స్ ఎవరికి చేశారో తెలుసా?
సీబీఐ: తెలియదు.

7. మూడేళ్ల క్రితమే విషయం తెలిసినప్పుడు అవినాశ్ సెల్‌ఫోన్‌ను ఎందుకు స్వాధీనం చేసుకోలేదు?
సీబీఐ: సమాధానం దాటవేత

8. అందరికీ తెలియాల్సిన వివరాలను సీల్డ్ కవర్‌లో ఎలా సమర్పిస్తారు? ఆ వివరాలు పిటిషనర్‌కు కూడా ఇస్తారా?
సీబీఐ: ఈ దశలో ఇవ్వలేం.

9. సాక్షుల వాంగ్మూలాలను అవినాశ్ వాదనలు వినకుండా ఎలా పరిగణనలోకి తీసుకోగలం? ఇరువైపులా వాదనలు వినకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం కాదా?
సీబీఐ: కాదు. సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి.

10. ఏదైనా ఒక తీర్పు వెల్లడించండి.
సీబీఐ: ఇప్పుడు వివరాలు లేవు.. చెప్పలేం.

11. అవినాశ్.. సాక్షులను బెదిరిస్తున్నారు అన్నారు కదా. ఎవరైనా మీకు ఫిర్యాదు చేశారా? సంప్రదించారా?
సీబీఐ: లేదు.. ఎవరూ ఫిర్యాదు చేయలేదు

12. సీఐ శంకరయ్య విచారణకు రాకపోవడానికి అవినాశ్ కారణమా?
సీబీఐ: తెలియదు.

13. భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేశారు కదా.. కస్టడీలో వారి నుంచి ఏం తెలుసుకున్నారు?
సీబీఐ: తెలుసుకోలేదు. వారు విచారణకు సహకరించడం లేదు.

14. వివేకా మృతదేహాన్ని చూడగానే గాయాలు కనిపించాయా?
సీబీఐ: వివేకా మృతదేహం చూసిన ఎవరైనా సరే అది హత్య అనే అంటారు.

15. అలాంటప్పుడు రక్తపు మరకలు తుడవడం ఎవిడెన్స్ ట్యాంపర్ ఎలా అవుతుంది?
సీబీఐ: మృతదేహాన్ని చూస్తే హత్య అని తెలుస్తుంది.. రక్తపు మరకలతో అవసరం లేదు.

16. హత్య జరిగిన రోజు అవినాశ్ జమ్మలమడుగు వెళ్లలేదు.. ఆ టైమ్‌లో ఇంట్లోనే ఉన్నారని ఎలా చెబుతారు? అవినాశ్‌కు ముందే తెలుసు అనడానికి ఏవైనా ఆధారాలున్నాయా?
సీబీఐ: లేవు.

క్లుప్తంగా...

మెడ్‌టెక్ జోన్‌లో అసిస్టివ్ టెక్నాలజీ వ్యాన్ రెడీ

- మారుమూల గ్రామాల ప్రజలకు వైద్యసేవల కోసం తయారీ


అసిస్టివ్ టెక్నాలజీ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

సాక్షి, విశాఖపట్నం: ఏపీ మెడ్‌టెక్ జోన్ మరో అద్భుతాన్ని సృష్టించింది. మారుమూల గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అసిస్టివ్ టెక్నాలజీ వ్యాన్‌ను రూపొందించింది. విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్‌లో ఈ వాహనాన్ని సిద్ధం చేశారు. ఇందులో వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలను పొందుపరిచారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసేలా అసిస్టివ్ టెక్నాలజీ వ్యాన్‌ను రూపొందించినట్లు మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు తెలిపారు. ఈ అసిస్టివ్ టెక్నాలజీ వ్యాన్‌ను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శనివారం ఢిల్లీలో ప్రారంభించారు.

అవి ప్రణాళికాబద్ధంగా నిర్మించే ఊళ్లు

సకల సౌకర్యాలతో రానున్న పేదల కాలనీలు

- మురికి వాడలంటూ టీడీపీ దుష్ప్రచారం
- లే అవుట్‌లో 38 శాతమే ఇళ్ల స్థలాలు
- మిగిలినదంతా మౌలిక సదుపాయాలకే
- 40, 30 అడుగుల రోడ్లు.. ప్రతి కాలనీలో అంగన్‌వాడీ, హెల్త్ క్లినిక్
- పెద్ద లే అవుట్‌లో స్కూళ్లు, పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలందరికీ చోటు
- ఇది ముమ్మాటికీ సామాజిక అమరావతే


పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాజధాని ప్రాంతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు సంబంధించి తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎల్లో మీడియా, అమరావతి రైతుల ముసుగులో దుష్ప్రచారం చేస్తున్నారు. అక్కడ వచ్చేది కాలనీలు కావని.. ప్రపంచంలోనే అతి పెద్ద మురికివాడలు వస్తాయని తప్పుడు ప్రచారం చేస్తూ లబ్ధిదారుల్లో అయోమయం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సీఆర్‌డీఏ పరిధిలో 50,793 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. పేదలకు ఇళ్ల స్థలాలివ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఏకంగా సుప్రీంకోర్టు దాకా వెళ్లి అడ్డుకోవడం చూశాం. పేదలకు ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇస్తే సామాజిక సమతుల్యం దెబ్బతింటుందని చంద్రబాబు అండ్ కో వాదించారు. చంద్రబాబునాయుడు మరో అడుగు ముందుకేసి.. ఒక సెంట్ స్థలం సమాధులకు సరిపోతుందని వ్యాఖ్యానించడం.. దానిపై పేదలు, సామాజికవేత్తలు భగ్గుమనడంతో ఇప్పుడు తాజాగా ఆయన వర్గం మురికివాడలు అంటూ ప్రచారం ప్రారంభించింది.

పక్కా ప్లానింగ్‌తో నిర్మాణం

ప్రభుత్వం 25 లే అవుట్‌లలో 50,793 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చింది. ప్రతి లే అవుట్‌ను కూడా సీఆర్‌డీఏ, టౌన్ ప్లానింగ్ నిబంధనలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. లే అవుట్‌లో 38 శాతం మాత్రమే ప్లాట్ల కోసం, మిగిలిన స్థలాన్ని మౌలిక సదుపాయాల కోసం కేటాయించారు. ఉదాహరణకు కృష్ణాయపాలెం లే అవుట్ 58.15 ఎకరాల్లో వేశారు. ఇందులో 2,234 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. ప్రతి ప్లాట్ ఆరు మీటర్ల వెడల్పు, 6.80 మీటర్ల పొడవు ఉండేలా ఏర్పాటు చేశారు. మొత్తం స్థలంలో 38.72 శాతం మాత్రమే ఇళ్ల స్థలాలకు కేటాయించారు. 36.52 శాతం రోడ్లకు, 10.28 శాతం భూమిని ఓపెన్ స్పేస్‌గా, ఇతర అవసరాల కోసం 8.79 శాతం, పార్కింగ్ కోసం 5.69 శాతం కేటాయించారు. ప్రతి లేఅవుట్‌లో ప్రధాన రహదారులు 40 అడుగులు, అంతర్గత రహదారులు 30 అడుగులు ఉండేలా ఏర్పాటు చేశారు. ప్రతి కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పార్కులు ఏర్పాటు చేయనున్నారు. పెద్ద లేఅవుట్లలో ప్రైమరీ స్కూల్ కూడా మంజూరు చేస్తారు. నవులూరు, కృష్ణాయపాలెంలో ఉన్న చెరువులను అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇన్ని మౌలిక సదుపాయాలతో వచ్చే కాలనీలు మురికివాడలు ఎలా అవుతాయో తెలుగుదేశం నాయకులే చెప్పాలని ప్రజలు నిలదీస్తున్నారు.

ఆధిపత్యం తగ్గిపోతుందని టీడీపీ భయం

పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులో కూడా సామాజిక న్యాయం చేకూర్చడం ఈ ప్రభుత్వానికే చెల్లింది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు సంబంధించి 50,793 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తే అందులో సగానికి పైగా బీసీలకు దక్కాయి. రెండు జిల్లాల్లో 26,869 మంది బీసీలకు, 8,495 మంది ఎస్సీలకు, 1579 మంది ఎస్టీలకు, మిగిలిన 13,850 మంది ఇతరులకు ఇళ్ల స్థలాలు వచ్చాయి. వీరందరూ వస్తే తమ ఆధిపత్యం తగ్గిపోతుందనే భయం తెలుగుదేశం పార్టీని వెంటాడుతోంది.

మొత్తం ఇళ్ల స్థలాలు 50,793	
ఎన్‌టీఆర్ జిల్లా (విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలు)	
ఇళ్ల పట్టాల సంఖ్య	27,031
బీసీ(ఏ)	3,254
బీసీ(బీ)	2,885
బీసీ(సీ)	140
బీసీ(డీ)	5,709
బీసీ(ఈ)	2,742
ఓసీ	9,558
ఎస్సీ	2,334
ఎస్టీ	409
గుంటూరు జిల్లా (తాడికొండ, మంగళగిరి, పొన్నూరు)	
ఇళ్ల పట్టాల సంఖ్య :	23,762
బీసీ	12,139
ఓసీ	4,292
ఎస్సీ	6,161
ఎస్టీ	1,170

రాష్ట్రం కోసం ప్రధాని పదవిని తిరస్కరించా

- మహానాడులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు
- అధికారంలోకి వస్తే ప్రజలు మెచ్చేలా అదిరిపోయే సంక్షేమం
- ఈ నాలుగేళ్లలో సీఎం రూ.2.27 లక్షల కోట్ల దోపిడీ
- వివేకా హత్య కేసులో అసలు దోషి జగనే



రాజమండ్రి నుంచి సాక్షి ప్రతినిధి: రాష్ట్రం కోసం గతంలో తాను ప్రధాన మంత్రి పదవిని తిరస్కరించానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చెప్పారు. 1996లో తనను ప్రధానిగా ఉండమని కోరినా, తెలుగువారి ప్రయోజనాల కోసం, రాష్ట్రం కోసం అప్పట్లో సున్నితంగా ఆ పదవిని తిరస్కరించానని తెలిపారు. రాజమండ్రిలో జరుగుతున్న మహానాడులో తొలిరోజు శనివారం ఆయన ప్రారంభ, ముగింపు ఉపన్యాసాలతోపాటు ప్రతి తీర్మానం సందర్భంగా మాట్లాడారు. అధికారంలోకి వస్తే ప్రజలు మెచ్చేలా అదిరిపోయే సంక్షేమాన్ని అమలు చేస్తామన్నారు. సంపదను సృష్టించి పేదలకు పంచుతామని, పేదలను ధనికులుగా మారుస్తామని చెప్పారు. ఆదివారం తొలి దశ మేనిఫెస్టోను ప్రకటిస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధమని చెప్పారు. పార్టీ అధిష్టానానికి, క్యాడర్‌కు ఉన్న గ్యాప్ పోయిందన్నారు. భవిష్యత్తులో ప్రతి కార్యకర్తను ఆదుకునే బాధ్యత తనదని, అందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వచ్చేది కురుక్షేత్రమని, ఆ యుద్ధంలో వైఎస్సార్‌సీపీ కౌరవ సేనను ఓడించి శాసన సభను గౌరవ సభ చేసి అసెంబ్లీకి వెళతామని చెప్పారు. ఎవరైనా అడ్డం వస్తే తొక్కుకుంటూ ముందుకు పోతామన్నారు. రాష్ట్రంలో క్లాస్ వార్ జరగం లేదని, క్యాష్ వార్ జరుగుతోందని చెప్పారు. 2014 తర్వాత వందల సంఖ్యలో పథకాలు అమలు చేశామన్నారు. రాష్ట్రంలో సీఐడీ ప్రభుత్వం ఉందని, కరప్షన్, ఇన్ ఎఫిషియంట్, డిస్ట్రక్షన్ ప్రభుత్వమని ఆరోపించారు. రివర్స్ టెండర్లని, పరిపాలనను రివర్స్ చేశారన్నారు.

రాజధాని లేని రాష్ట్రం ఏపీ

అమరావతిని నాశనం చేసి, ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా చేశారని చంద్రబాబు విమర్శించారు. రైతుల ఆత్మహత్యల్లో ఏపీ మూడవ స్థానంలో ఉందని, రాష్ట్రం అప్పులు రూ.10 లక్షల కోట్లకు పైగా ఉన్నాయన్నారు. దేశంలోనే ధనిక సీఎంగా జగన్ ఉన్నారని, అందరి సీఎంల ఆస్తి రూ.508 కోట్లు ఉంటే, జగన్ ఒక్కడి ఆస్తి రూ.510 కోట్లు ఉందన్నారు. సీఎం జగన్ నాలుగేళ్లలో రూ. 2.27 లక్షల కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. వివేకా హత్య కేసులో అసలు దోషి జగనే అని సీబీఐ అఫిడవిట్‌తో తేలిందన్నారు.

రూ.500 నోట్లు రద్దు చేయాలని తీర్మానం

మహానాడులో రాష్ట్రానికి సంబంధించి 17 తీర్మానాలు చేశారు. చివరలో 18వ తీర్మానంగా యనమల రామకృష్ణుడు రూ.2 వేల నోట్లతోపాటు రూ.500 నోట్లు కూడా రద్దు చేయాలని రాజకీయ తీర్మానాన్ని ప్రతిపాదించగా సభలో ఆమోదించారు. టీడీపీ అధ్యక్షుడిగా చంద్రబాబు 28వసారి ఎన్నికయ్యారని ఎన్నికల కమిటీ తరఫున కాల్వ శ్రీనివాసులు ప్రకటించారు. మిగిలిన కమిటీలన్నింటినీ నియమించే బాధ్యతను చంద్రబాబుకు అప్పగిస్తూ మహానాడు తీర్మానించింది.

మహానాడులో జగన్నామస్మరణ

- అడుగడుగునా సీఎంపై ఆక్రోశం.. ప్రభుత్వంపై అక్కసు
- తీర్మానాలన్నీ సీఎంకు వ్యతిరేకంగానే.. ఎజెండా మొత్తం జగనే
- ఆద్యంతం ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల పాత్ర నిల్


మధ్యాహ్నం సభలో చంద్రబాబు ప్రసంగిస్తుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

రాజమహేంద్రవరం నుంచి సాక్షి ప్రతినిధి/సాక్షి, రాజమహేంద్రవరం: తెలుగుదేశం పార్టీ మహానాడు ఆసాంతం జగన్నామస్మరణతో మార్మోగిపోయింది. ఉదయం సమావేశం ప్రారంభమైంది మొదలు రాత్రి ముగిసే వరకు ప్రతి నిమిషం సీఎం పేరు తలుచుకోకుండా ఏ నాయకుడూ తన ప్రసంగాన్ని ముగించలేదు. తిట్లు, శాపనార్థాలు, ఆక్రోశాలు, ఆగ్రహావేశాలు, విమర్శలు, ఆరోపణలతో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు సహా నేతలంతా ఇదే ఒరవడి కొనసాగించారు. అసలు మహానాడు నిర్వహిస్తోంది సీఎం జగన్‌ను తిట్టడానికే అన్నట్లు వ్యవహరించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నివేదిక పేరుతో వర్ల రామయ్య పార్టీ కార్యక్రమాల గురించి చెప్పడం కంటే జగన్‌ను తిట్టడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. రెండు తీర్మానాలు మినహా మిగిలిన ఏపీకి చెందిన తీర్మానాలన్నీ సీఎం జగన్‌ను లక్ష్యంగా చేసుకుని పెట్టినవే కావడం గమనార్హం.

ఎన్టీఆర్ కుటుంబానికి అవమానం

మరోవైపు ఎన్టీఆర్ శత జయంతి వేడుకల పేరుతో నిర్వహిస్తున్న మహానాడులో ఆయన కుటుంబీకుల ఎవరికీ ప్రాధాన్యం లేకుండా పోయింది. చంద్రబాబు, లోకేశ్‌లకే అత్యంత ప్రాధాన్యం ఉండేలా కార్యక్రమాలు రూపొందించారు. ప్రధాన బ్యానర్‌లో నందమూరి బాలకృష్ణ ఫొటో ముద్రించక పోవడంపై పలువురు నేతలు చర్చించుకున్నారు. ప్రకటనలు, కరపత్రాలు.. అన్నింటా చంద్రబాబు, లోకేశ్‌కే ప్రాధాన్యం కనిపించింది. తద్వారా టీడీపీలో ఎన్టీఆర్ కుటుంబ సభ్యులకు ప్రాధాన్యం ఉండదనే రీతిలో మహానాడు నిర్వహించారు. కాగా, మహానాడుకు జన స్పందన కరువైంది. ఆశించిన మేరకు జనం రాకపోవడంతో సభ వెలవెలబోయింది. చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో గ్యాలరీల్లో జనం లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

'పార్టీ లేదు.. బొక్కా లేదు..' ప్రస్తావన

మహానాడు ప్రాంగణంలో ఆ పార్టీకి చెందిన నాయకుడు ఆకుల వెంకటేశ్వరరావు కలకలం సృష్టించారు. గతంలో తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా ఒక హోటల్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, వెంకటేశ్వరరావు మధ్య జరిగిన సంభాషణలో 'పార్టీ లేదు.. బొక్కా లేద'ని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించిన విషయాన్ని పలువురు గుర్తు చేసుకున్నారు. అదే వెంకటేశ్వరరావు.. మహానాడుకు హాజరైన కార్యకర్తల మధ్య నుంచి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను పిలిచి తిట్టడం చర్చనీయాంశమైంది. కొందరు కార్యకర్తలు ఆయన్ను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. 'నా జీవితం నాశనమైంది. మీవి కూడా అలా కాకుండా చూసుకోండి' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. తన 400 గజాల భూమిని కేఎల్ నారాయణ అనే వ్యక్తి ఆక్రమించాడని, న్యాయం చేయమని అడిగితే లోకేశ్ పట్టించుకోలేదన్నాడు.

ఎన్టీఆర్‌ను చంపిన దుర్మార్గుడు చంద్రబాబు

- నేడు ఎన్టీఆర్ విజ్ఞాన ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి
- ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు చైర్మన్ లక్ష్మీపార్వతి


మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి, పక్కన దేవినేని అవినాశ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్‌ను చంపిన దుర్మార్గుడు చంద్రబాబు అని, ఆయన పేరు ఎత్తేందుకు కూడా ఆయనకు అర్హత లేదని ఎన్టీఆర్ విజ్ఞాన్ ట్రస్టు చైర్మన్ నందమూరి లక్ష్మీ పార్వతి అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు తమ ట్రస్టు, దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్టుల ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వేడుకలు నిర్వహించనున్న వేదికను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్‌తో కలిసి పరిశీలించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ ఎనిమిది గంటల్లో మరణిస్తారనగా, దేవినేని నెహ్రూతో తన ఆవేదనను పంచుకున్నారని లక్ష్మీపార్వతి గుర్తు చేశారు. చంద్రబాబు ఎంతగా బాధ పెట్టాడో నెహ్రూకి చెప్పారన్నారు. ఆస్తులు పంచుకున్న కొడుకులు, పార్టీని లాక్కున్న చంద్రబాబు.. ఎన్టీఆర్‌కు వారసులు కాదని, ఆయన పేరు ఎత్తడానికి వారికి అర్హత లేదన్నారు. ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను చంద్రబాబు చేస్తే ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తుందన్నారు. ఎన్టీఆర్ పేరును జిల్లాకు పెట్టిన మనసున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. రెండున్నర దశాబ్దాలుగా ఒక్కదాన్నే పోరాడుతున్నానని, తనకు ఈ రోజు అవినాశ్ అండగా నిలిచినట్టు తెలిపారు.

ప్రమాదంలో జీవవైవిధ్యం

క్షీణిస్తున్న దశలో 48 శాతం జాతులు గుర్తింపు

- భౌగోళిక, జీవావరణ వ్యవస్థల్లో మార్పులు
- ప్రపంచవ్యాప్తంగా వేగంగా క్షీణిస్తున్న కొన్ని జీవ జాతులు
- ఆరు వర్గాలకు చెందిన 70 వేల జాతులపై శాస్త్రవేత్తల పరిశోధన
- చేపలు, సరీసృపాల్లోనే స్థిరమైన మనుగడ



సాక్షి, అమరావతి: ప్రపంచంలో జీవవైవిధ్యం ప్రమాదంలో పడుతోంది. భౌగోళిక, జీవావరణ వ్యవస్థల్లో మార్పులతో అనేక జీవజాతులు క్షీణించే దశకు చేరుకుంటున్నాయి. అభివృద్ధి పేరుతో మానవాళి సాగిస్తున్న ప్రకృతి విధ్వంసక చర్యలతో ఏటా వేల జాతులు అంతరించిపోతున్నాయి. తాజాగా శాస్త్రవేత్తలు ఆరు వర్గాలకు చెందిన 70 వేల జాతులపై పరిశోధనలు చేయగా దాదాపు సగం జాతులు జనాభా క్షీణతను ఎదుర్కొంటున్నట్టు గుర్తించారు. గతంలో ఊహించిన దానికంటే నష్టం ఎక్కువగా ఉండటంతో భూగోళం సామూహిక విపత్తు దిశగా వెళ్తోందని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లోని క్వీన్ యూనివర్సిటీ జీవశాస్త్రవేత్తలు అధ్యయనం చేశారు. క్షీరదాలు, పక్షులు, ఉభయచరాలు, సరీసృపాలు, చేపలు, కీటకాలు వంటి ఆరు వర్గాలపై పరిశోధన నిర్వహించారు. వీటిల్లో చేపలు, సరీసృపాల మనుగడ స్థిరంగా ఉండటం విశేషం.

మూడు జాతుల్లోనే వృద్ధి

శాస్త్రవేత్తలు 70 వేల జాతులపై పరిశోధనలు చేస్తే ఏకంగా 48 శాతం క్షీణ దశలో ఉన్నట్టు తేల్చారు. ఇందులో ఉభయచరాలు ఎక్కువగా ప్రమాదంలో ఉండగా.. చిరుతపులి వంటి మచ్చలను పోలి ఉండే కప్ప అత్యంత వేగంగా అంతరించిపోతోందని నిర్ధారించారు. అతి స్వల్పంగా కేవలం మూడు జాతులు మాత్రమే వృద్ధి చెందుతున్నట్టు పేర్కొన్నారు. 33 శాతం జాతులు ప్రమాదపు అంచున లేనప్పటికీ క్షీణతలోనే ఉన్నాయని వివరించారు. ఇలాంటి వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. కాగా 2019లో ఐక్యరాజ్య సమితి వచ్చే దశాబ్దాల్లో అర మిలియన్ జాతులు అంతరించిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్న నివేదికకు ప్రస్తుత శాస్త్రవేత్తల పరిశోధన బలం చేకూరుస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా జీవజాతుల్లో క్షీణత (శాతాల్లో) ఇలా..

వర్గం	క్షీణత	స్థిరమైన మనుగడ	పెరుగుదల	తెలియనివి
పక్షులు	48	38	6	8
ఉభయచరాలు	43	25	0.4	32
చేపలు	41	57	1.7	0.3
క్షీరదాలు	32	24	1.4	43
కీటకాలు	13	11	0.4	75
సరీసృపాలు	14	36	0.6	49

రాజమహేంద్రవరంలో 'మహా'డ్రామా

ఎన్టీఆర్‌పై నాడు చెప్పులు విసిరి ఇప్పుడు పాదపూజలు చేస్తున్న దుర్మార్గుడు చంద్రబాబు

- ఆయన హయాంలో కాలర్ ఎగరేసుకుని చెప్పుకునే పథకం ఒక్కటైనా ఉందా?
- మహానాడు చంద్రబాబు గోడులా ఉంది
- ఎన్టీఆర్‌ను క్షమాపణ కోరుతూ టీడీపీ తీర్మానం చేయాలి
- మహానాడులో ప్రజాప్రయోజనం లేదు
- మంత్రులు బొత్స, కొట్టు సత్యనారాయణ, ఆర్కే రోజా, చెల్లుబోయిన, జోగి ఫైర్

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/తాడేపల్లిగూడెం అర్బన్/అమలాపురం టౌన్: రాజమహేంద్రవరంలో మహానాడు పేరిట మహా'డ్రామా' జరుగుతోందని పలువురు మంత్రులు విమర్శించారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి సీఎం పదవితో పాటు పార్టీనీ లాక్కొని.. ఆయన చావుకు కారణమైన చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఆయన విగ్రహానికి పూలదండలు వేసి ప్రేమున్నట్లు నటిస్తున్నారని మండిపడ్డారు. నాడు వైశ్రాయ్ హోటల్ వద్ద ఎన్టీఆర్‌పై చెప్పులు విసిరి.. నేడు ఆయనకు పాదపూజలు చేస్తున్న దుర్మార్గుడు చంద్రబాబు అని అన్నారు. రాజమహేంద్రవరంలో జరుగుతున్న మహానాడులో టీడీపీ అధినేత తీరును మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆర్కే రోజా, కొట్టు సత్యనారాయణ, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేశ్ శనివారం వేర్వేరుచోట్ల మీడియా సమావేశాల్లో ఏకిపారేశారు. వారు ఏమన్నారంటే...

ఎన్టీఆర్ పేరుతో దిగజారుడు రాజకీయాలు : జోగి



దివంగత ఎన్టీఆర్ మరణించి 28 ఏళ్లయినా చంద్రబాబు ఆయన ఆత్మను నేటికీ చిత్రవధ చేస్తూ చంపుతూనే ఉన్నాడు. ఎన్టీఆర్ చావుకు కారకులైన వారంతా ఓట్ల కోసం ఎన్టీఆర్ పేరు చెప్పుకుంటూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. 2014కు ముందు 600 పైచిలుకు హామీలతో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ఒక్కటంటే ఒక్క హామీనైనా అమలుచేసి మాట నిలబెట్టుకున్నాడా? ఇప్పుడు రాజమండ్రిలో నడుస్తున్న మహానాడులో ప్రజాప్రయోజనం లేదు. మహానాడు తీర్మానాలు అంటూ 153 పేజీల ముసాయిదా తీర్మానాల పుస్తకంలో మా పరిపాలనలో ఈ మంచి చేశాం అని అస్సలు లేదు. చంద్రబాబు పేరు చెబితే, ఈ పథకం గుర్తుకు వస్తుందని ఒక్క వాక్యం కూడా లేదు. పైగా చేయని పనులు చేసినట్లు రాశారు. ఐదేళ్ల చంద్రబాబు పాలనలో సగటును ఏడాదికి 300 మండలాల్ని కరువు మండలాలుగా ప్రకటించారు. నేడు బీసీలంతా సంఘటితమై వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుయ్యారు. పేదింటి పునాదుల్లోనే బాబుకు సమాధి కట్టడం ఖాయం. అచ్చెన్నాయుడు పడుకోవడానికి సెంటు కాదు.. ఊరు కూడా సరిపోదు.

ఆ తీర్మానాలు కుతంత్రాలకు నిదర్శనాలు : చెల్లుబోయిన



రాజమహేంద్రవరంలో టీడీపీ నిర్వహిస్తున్నది మహానాడు కాదు.. అదో మోళీ (మాయ)నాడు. మహానాడులో చంద్రబాబు ఆధ్వర్యంలో చేసిన పలు తీర్మానాలు ఆయన కుతంత్రాలకు, కుయుక్తులకు మరోసారి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. మహానాడు ద్వారా చంద్రబాబు మరో మోళీకి తెరతీశారు. మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు.. నేడు మహానాడులో ఆయన దైవస్వరూపుడని, యుగపురుషుడని మాట్లాడటం.. ఆయన కపట బుద్ధిని మరోసారి బయటపెట్టింది. ఎన్టీఆర్ సంక్షేమ పథకాలను చంద్రబాబు తుంగలో తొక్కారు. 2015 గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమహేంద్రవరంలో కేవలం చంద్రబాబువల్లే 29 మంది మృత్యువాత పడితే.. ఇప్పుడు ఆ కుటుంబాలు క్షమించాలంటూ మహానాడులో ఏ ముఖం పెట్టుకుని తీర్మానం చేయించారు? సీఎం వైఎస్ జగన్ ప్రజారంజక పాలన, సంక్షేమ పథకాలతో దూసుకుపోతూంటే.. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని అక్కసు కక్కుతావా?

ఏనాడైనా పేదల గురించి ఆలోచించారా?: బొత్స



14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఏనాడైనా పేదల కోసం ఆలోచించారా? విద్య, వైద్యం, వ్యవసాయాన్ని పట్టించుకున్నారా? మీ హయాంలో పేదలకు ఇది చేశాను అని కాలర్ ఎగరేసి చెప్పుకునే సంక్షేమ పథకం ఒక్కటైనా ఉందా? నీ హయాంలో రైతులు ఆత్మహత్యలు చేసుకోలేదా? వ్యవసాయం దండగని చెప్పింది.. దళితుల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని అన్నది నువ్వు కాదా.. ఇవన్నీ ప్రజలు మరిచిపోలేదు. వారు నిశబ్దంగా పరిశీలిస్తారు. చెప్పాల్సిన సమయంలో ఓటు రూపంలో తీర్పునిస్తారు. జిల్లాకొక మెడికల్ కాలేజీ నిర్మించాలనే ఆలోచన మీకు ఎందుకు రాలేదు? టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరిట రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు. కానీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వర్షాలు పుష్కలంగా పడుతున్నాయి.. నదులు, జలాశయాలు నిండుగా ఉన్నాయి.. పంటలు బాగా పండుతున్నాయి. ప్రకృతి కూడా జగన్ పాలనకు సహకరిస్తోంది. ఇక చంద్రబాబు ఎన్ని పేజీల మ్యానిఫెస్టో పెట్టినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.

నాడు చెప్పులు విసిరి.. నేడు పాదపూజలా?: కొట్టు



ఆనాడు వెన్నుపోటు పొడిచి మామ చనిపోవడానికి కారకుడు చంద్రబాబే. నాడు వైశ్రాయ్ హోటల్ వద్ద ఎన్టీఆర్‌పై చెప్పులు విసిరి.. నేడు పాదపూజలు చేస్తున్న దుర్మార్గుడు ఆయన. శక పురుషుడి జయంతి పేరుతో టీడీపీ మహానాడును నిర్వహించడం కాదు.. ఎన్టీఆర్ హంతక దినంగా పాటించాలి. రాజమండ్రిలో జరుగుతున్న మహానాడుకు వెళ్తే ఎన్టీఆర్ ఆత్మ దుఃఖిస్తుంది. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పాలన చూసిన రాష్ట్ర ప్రజలు విసుగు చెంది 2019లో టీడీపీకి సమాధి కట్టారు. ఇక మహానాడుకు రూ.2 వేలు ఇస్తామన్నా జనం రాకపోవడంతో నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఇదేం ఖర్మరా బాబూ అని తలలు పట్టుకుంటున్నారు. చంద్రబాబు తన మనుషులతో రైలు తగులబెట్టించి.. కాపుల మీద తప్పుడు కేసులు పెట్టించి కాపులను జైల్లో పెట్టించిన దుర్మార్గుడు. కానీ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ కేసులు ఎత్తివేసి కాపు సామాజికవర్గంపై కరుణ చూపించారు. కాపు సామాజికవర్గం అంతా అప్రమత్తంగా ఉండాలి. మహానాడులో చంద్రబాబుకు హంతకరత్న, వెన్నుపోటు పితామహుడు అని బిరుదులిస్తే సముచితంగా ఉంటుంది.

అది మహానాడు కాదు.. మాయనాడు: ఆర్కే రోజా




రాజమండ్రిలో టీడీపీ నిర్వహిస్తున్నది మహానాడు కాదు.. అది ఒక మాయనాడు. చంద్రబాబు తన గొప్పలు చెప్పుకోవడానికి, సీఎం వైఎస్ జగన్‌ను దూషిస్తున్నారు. సుత్తికబుర్లతో ఆయన మహానాడులో వీరంగం చేస్తున్నారు. మహానాడు చంద్రబాబు గోడులా ఉంది. ముందుగా ఈ మహానాడులోనైనా ఎన్టీఆర్‌పై సస్పెన్షన్ని ఎత్తేస్తూ, ఆయనపై చెప్పులేసినందుకు క్షమాపణ కోరుతూ టీడీపీ తీర్మానం చెయ్యాలి. మహానాడు ప్రకటనలో రెండుసార్లు ఓడిన లోకేశ్ ఫొటోవేసి.. రెండుసార్లు గెలిచిన బాలకృష్ణ ఫొటో ఏది? చంద్రబాబు మేనిఫెస్టోలు ఎన్ని ప్రకటించినా ప్రజలు నమ్మరు. గత మేనిఫెస్టోలో ఎన్ని హామీలు అమలుచేశారో ముందు చెప్పండి. మేం పేదలకు ఇళ్లిస్తున్నాం కానీ అచ్చెన్నాయుడు లాంటి ఆంబోతులకు కాదు. ఇక అచ్చెన్నాయుడు 160 సీట్లు అంటూ ఆయన బరువు గురించి చెప్తున్నారు. అన్ని సీట్లు వస్తాయన్న నమ్మకం ఉంటే 175 సీట్లలో ఎందుకు పోటీచేయడంలేదు. బాబు పథకాల్లో ఏ ఒక్కటైనా జనానికి గుర్తుందా? బాబు హయాంలో మహిళలకు, రైతులు, పేదలకు అప్పులు దక్కాయి. ఇది చంద్రబాబు మార్క్ పాలన.



'బాబు నాకన్నా పెద్ద నటుడు...'
'నా బొమ్మతో గెలిచి నన్నే ముంచారు...'
'అసలు ముఖ్యమంత్రి రామోజీరావు...'
'బాబును చరిత్ర క్షమించదు...'
– ఎన్టీఆర్

కథానాయకుని వ్యథ! ... ది పొలిటికల్ ట్రాజెడీ ఆఫ్ ఎన్టీఆర్



ఎన్టీఆర్ శతజయంతి ప్రత్యేకం

ఎన్టీఆర్...
తెలుగు సినిమా శిఖరం

ఎన్టీఆర్...
తెలుగు రాజకీయ విప్లవం

ఎన్టీఆర్...
తెలుగు ఆత్మగౌరవ పతాకం

ఆయన శతజయంతి ఒక సంబరం. ఆత్మావలోకన సందర్భం.

తెలుగువారు గుండెల్లో గుడి కట్టుకున్న అలాంటి రామన్నకు దారుణంగా వెన్నుపోటు పొడిచినవారే... ఇవాళ శతజయంతిని అడ్డం పెట్టుకొని కపట ప్రేమ ఒలకబోస్తూ, కీర్తిస్తున్నారు. ఆ శకపురుషుడి ఆత్మకు మళ్ళీ మళ్ళీ ద్రోహం చేస్తున్నారు. కల్లబొల్లి మాటల చంద్రబాబు, కాలకూట రాతల 'ఈనాడు' రామోజీల నిజస్వరూపాన్ని ఎన్టీఆర్ ఆనాడే ఆవేదనతో పంచుకున్నారు. భౌతికంగా, రాజకీయంగా, అన్న ఆశయాలకు వ్యతిరేకంగా ఆనాడు జరిగిన ది రియల్ ట్రాజిక్ స్టోరీ ఏంటి? ఆ అంతఃపుర కుట్ర సూత్రధారులు, పాత్రధారులపై ప్రత్యక్ష సాక్షుల కథనాల ప్రత్యేకం... నూరు వసంతాల రామన్నకు 'సాక్షి' నివాళి.



సందర్భం — ఇదీ కుట్ర జరిగిన తీరు...



కొమ్మినేని శ్రీనివాసరావు

తెలుగుదేశం వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావును ఆయన సొంతవారే ఎలా కూలదోశారు? అన్నది ఆసక్తికరమైన అంశం. ఆనాడు చకచకా జరిగిపోయిన ఘటనలలో ఎన్టీఆర్ నిస్సహాయుడిగా మిగిలిపోయిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. 1994 శాసనసభ ఎన్నికలలో తన భార్య లక్ష్మీపార్వతితో కలిసి ప్రచారం చేసి అసాధారణమైన రీతిలో మిత్రపక్షాలతో కలిసి సుమారు 250కి పైగా సీట్లు గెలుచుకున్న ఎన్టీఆర్ చెప్పులు వేయించుకోవడమా? తెలుగువారికి ఆత్మగౌరవ నినాదంతో పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ తన చరమాంకంలో కుటుంబ సభ్యుల చేతిలో ఆత్మాభిమానం కోల్పోయిన తీరు అత్యంత విషాదకరం.

1995 ఆగస్టులో 'ప్రజల వద్దకు ప్రభుత్వం' పేరుతో శ్రీకాకుళం జిల్లాలో ఎన్టీఆర్ ఆధ్వర్యంలో ఒక కార్యక్రమం జరిగింది. అప్పటి ఆర్థిక, రెవెన్యూ శాఖల మంత్రి, ఎన్టీఆర్ అల్లుడు అయిన చంద్రబాబుతో సహా పలువురు మంత్రులు తరలివెళ్లారు. అది జరుగుతున్నప్పుడే చంద్రబాబు తన సొంత గ్రూప్‌తో విశాఖ డాల్ఫిన్ హోటల్‌లో ఒక సమావేశం నిర్వహించారు. తదుపరి సచివాలయంలో ఆయన తన ఛాంబర్‌లో ఉండగా, కొందరు ఎమ్మెల్యేలు కలిసిన తీరు సంచలనం అయింది. ఎన్టీఆర్ దీనిని సీరియస్‌గా తీసుకోలేదు. చంద్రబాబుకు సన్నిహితంగా ఉండే ఎమ్మెల్యేలు, మంత్రులు వైస్రాయ్ హోటల్లో క్యాంప్ పెట్టాలని అనుకున్నారు. వాళ్లు ఆయా జిల్లాలకు ఫోన్లు చేసి ఎమ్మెల్యేలను వైస్రాయికి రావాలని కోరారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే అయితే తాను అసలు ఎందుకు వైస్రాయ్ హోటల్‌కు వెళ్లానో తెలియదనీ, జిల్లాకు చెందిన ఒక మంత్రి పిలవడంతో వెళ్లాననీ, ఆ తర్వాత కాని విషయం బోధపడలేదనీ అప్పట్లో నాకు చెప్పారు. ఆ రోజుల్లో సోషల్ మీడియా లేకపోవడం కూడా చంద్రబాబు వర్గానికి కలిసి వచ్చింది. వైస్రాయ్ హోటల్‌లో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారన్న దానిపై రకరకాల ప్రచారాలు జరిగిపోయాయి.

లక్ష్మీపార్వతిని ముఖ్యమంత్రిగా చేసే అవకాశం ఉందనీ, లేదా ఉప ముఖ్యమంత్రిగా అయినా నియమిస్తారనీ అనుకూల మీడియాలో ప్రచారం జరిగింది. ఢిల్లీలో ఉన్న ఎన్టీఆర్ మరో అల్లుడు, అప్పట్లో ఎంపీగా ఉన్న దగ్గుబాటి వెంకటేశ్వరరావును హైదరాబాద్ రప్పించారు. ఉప ముఖ్యమంత్రి చేస్తామని నమ్మబలికారు. ఎన్టీఆర్ కుమారుడు హరికృష్ణకు పార్టీ అధ్యక్ష పదవి ఇస్తామని అన్నారు. తామేమీ తప్పు చేయలేదన్న పిక్చర్ ఇవ్వడానికి ముగ్గురు నేతలు అశోక్ గజపతిరాజు, ఎస్వీ సుబ్బారెడ్డి, దేవేందర్ గౌడ్‌లను ఎన్టీఆర్ వద్దకు సంప్రతింపుల పేరుతో పంపించారు. అప్పట్లో స్పీకర్‌గా ఉన్న యనమల రామకృష్ణుడును తుని నుంచి హెలికాప్టర్‌లో రప్పించారు. ఎమ్మెల్యేలతో ఆయన అభిప్రాయ సేకరణ జరిపించినట్లు గవర్నర్‌కు ఒక నివేదిక ఇప్పించారు. ఈ తరుణంలోనే ఎన్టీఆర్‌కు ఒక ప్రముఖ న్యాయవాది అసెంబ్లీని రద్దు చేద్దామన్న సలహా ఇచ్చారు. నిజానికి అది కూడా కుట్రలో భాగమేనని ఆ తర్వాత వెల్లడైంది. అసెంబ్లీని రద్దు చేస్తారని చెబితే ఎమ్మెల్యేలంతా తమ పదవులు పోతాయన్న భయంతో తమ వద్దకు వచ్చేస్తారని చంద్రబాబు ప్లాన్ చేశారు. అది బాగా వర్కవుట్ అయింది.

మొత్తం పరిస్థితి చేయిదాటిపోతున్న తరుణంలో లక్ష్మీపార్వతితో కలిసి ఎన్టీఆర్ వైస్రాయ్ హోటల్‌కు బయల్దేరారు. పరిటాల రవి, దేవినేని నెహ్రూ తదితరులు ఆయనతో పాటు ఉన్నారు. ఆయన మైకు తీసుకుని 'తమ్ముళ్లూ వచ్చేయండ'ని ఉపన్యాసం ఇస్తున్న సందర్భంలో హోటల్ గేటు లోపల నుంచి చెప్పులు పడ్డాయి. అది చూసినవారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. మరుసటి రోజు చంద్రబాబు వర్గం ఎమ్మెల్యేలు ఒక సినిమా థియేటర్‌లో సమావేశమై ఎన్టీఆర్‌ను పార్టీ పదవి నుంచి, ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించినట్లు, చంద్రబాబును ఎన్నుకున్నట్లు ప్రకటించారు.



ఇదిలా ఉండగా, ఎన్టీఆర్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరారు. ఆయనను పరామర్శించడానికి వెళ్లిన గవర్నర్ కృష్ణకాంత్ అక్కడే రాజీనామా పత్రం తీసుకున్నారు. చంద్రబాబుతో సహా ఐదుగురు నేతలను మంత్రి పదవుల నుంచి తొలగించడమే కాకుండా, పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఎన్టీఆర్ ప్రకటించినా, ఆ కాపీని గవర్నర్‌కు పంపించినా, ఆయన దానిని విస్మరించి చంద్రబాబుకు పట్టం కట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో 1995 సెప్టెంబర్ 1న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలో విశ్వాస పరీక్షలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని ఎన్టీఆర్ వేడుకున్నా స్పీకర్ యనమల రామకృష్ణుడు అంగీకరించలేదు. చంద్రబాబుకు సహకరించిన దగ్గుబాటికి ఉప ముఖ్యమంత్రి పదవి హుళక్కి అయితే, హరికృష్ణను ఆరు నెలల మంత్రిగా మార్చి పరువు తీశారు. ఈ క్రమంలో న్యాయ వ్యవస్థ ద్వారా చంద్రబాబు టీడీపీ గుర్తు సైకిల్‌ను సొంతం చేసుకోవడమే కాకుండా, బ్యాంక్‌లో ఉన్న నిధులను కూడా కైవసం చేసుకున్నారు. ఫలితంగా గుండెపోటుతో ఎన్టీఆర్ కాలం చేశారు. ఆ తర్వాత రోజులలో ఎన్టీఆర్‌ను పొగుడుతూ చంద్రబాబు ఉపన్యాసాలు ఇవ్వడం ఆరంభించారు. ఎన్టీఆర్ పేరు చెబితేనే ఓట్లు పడతాయని భావిస్తున్న చంద్రబాబు వర్గం అదే వ్యూహం అమలు చేస్తోంది. పాపం... ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తూనే ఉంది!

వ్యాసకర్త ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్

సందర్భం — అవమానాలకు ఆగిన గుండె!



నందమూరి లక్ష్మీపార్వతి

చంద్రబాబు 1995 సెప్టెంబర్ 1న ఎన్టీఆర్ నుండి లాక్కున్న ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఎన్టీఆర్ ఆ అవమానాల్ని తట్టుకోలేకపోయారు. 1993 జూన్‌లో ఆయనకు పెరాలసిస్ వచ్చినప్పుడు నిమ్స్ డాక్టర్లు ఆయనకు బ్రెయిన్‌లో క్లాట్ ఏర్పడిందనీ ఏమాత్రం ఒత్తిడి ఉన్నా అది ఆయన మరణానికి దారి తీస్తుందనీ కుటుంబ సభ్యులందరినీ హెచ్చరించారు. అయినా వాళ్ళెవ్వరూ ఆ మాటలను పట్టించుకున్నట్లే లేరు. మాటిమాటికీ అవమానాలతో వేధించారు. అయినా ఆయన వెనక్కు తగ్గదలుచుకోలేదు. చంద్రబాబు మీద పోరాడాలనే నిర్ణయం తీసుకున్నారు. చంద్రబాబు దుర్మార్గాన్ని ప్రజలకు చెప్పాలనే ఉద్దేశ్యంతో మహారథి, వేల్చూరి వెంకట్రావులచే 'జామాత దశమ గ్రహః' అనే క్యాసెట్‌కు స్వయంగా తన పర్యవేక్షణలో రచన చేయించి డి.రామానాయుడు స్టూడియోలో తనే మాట్లాడుతూ ఆడియో రికార్డ్ చేయించారు. 'తమ్ముళ్లూ ఇదిగో మీ అన్నను మాట్లాడుతున్నాను' అని ప్రారంభించి రాష్ట్ర రాజకీయాల్లో జరిగిన చంద్రబాబు కుట్రనూ మోసాన్నీ బయటపెట్టారు. ఈ క్యాసెట్‌ను విజయవాడలో ఫిబ్రవరిలో జరగబోయే 'సింహగర్జన' సదస్సులో విడుదల చేయాలని సంకల్పించారు.

నేషనల్ ఫ్రంట్ నాయకులు ఎన్టీఆర్ లేకపోతే రాబోయే ఎన్నికలు ఎదుర్కోవడం కష్టమని భావించారు. సంధి ప్రయత్నంలో వీపీ సింగ్, బొమ్మై, దేవెగౌడ, పాశ్వాన్, శరద్ యాదవ్‌లు ఎన్టీఆర్ దగ్గరకు వచ్చి చంద్రబాబుతో కలిసిపొమ్మని నచ్చచెప్పటానికి ప్రయత్నం చేశారు. ఈ కలహం వలన నేషనల్ ఫ్రంట్‌కు నష్టం వస్తుందనీ, కొంచెం పెద్ద మనస్సుతో ఈ సంధికి అంగీకరించమనీ పార్టీకి అధ్యక్షులుగా కొనసాగి చంద్రబాబు నాయుడి ప్రభుత్వానికి సలహాలివ్వమనీ సూచించారు. ఆయన ఏమాత్రం అంగీకరించలేదు.

చంద్రబాబు మీద పోరాటాన్ని కొనసాగించటానికి ఆయన కోర్టులను కూడా ఆశ్రయించారు. అదే సమయంలో ఆయనకు ఇంకో విషయం తెలిసింది. వైస్రాయ్ ప్రభాకర్ రెడ్డి బంధువులు, మరికొంతమంది లిక్కర్ లాబీ వాళ్ళు కోట్లాది రూపాయలు చంద్రబాబుకు అందించారనీ, ఆ డబ్బుతో ఆయన మీడియాతో పాటు న్యాయవ్యవస్థను కూడా మేనేజ్ చేసుకుని ఎన్టీఆర్‌ను పదవి నుండి దించేశాడనీ!

ఇక్కడ జరిగిందంతా గందరగోళమే. ప్రజలకు వాస్తవాలేంటో తెలియనీకుండా, తెలుసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఇదే పచ్చ మీడియా ఆనాడు నిర్వహించిన పాత్ర కడు శోచనీయమైనది. ఇదంతా లక్ష్మీ పార్వతి వల్లనే జరుగుతోందని చెప్పటం ద్వారా ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చినా అది ప్రజల్లో వ్యతిరేకత కలిగించదనేది వారి వ్యూహం. ఆ పెద్ద కుట్రలో ప్రధాన పాత్ర వారిదే! ఆయన ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తూ వస్తున్నది. ఒక కన్ను పని చేయటం లేదు. రానురాను మానసికంగానూ, శారీరకంగానూ బలహీనపడుతున్నారు.

1996 ఫిబ్రవరిలో జరగబోయే 'సింహ గర్జన' సదస్సు గురించి చర్చించడానికి దేవినేని నెహ్రూ విజయవాడ నుండి వచ్చారు. చాలాసేపు మాట్లాడుకున్నాక ఆ సదస్సుకు 30 లక్షల రూపాయల ఖర్చవుతుందని అంచనా వేశారు. అందుకోసం బ్యాంక్ ఆఫ్ బరోడాలో తన పేరుతో ఉన్న పార్టీ ఎకౌంట్ నుండి డబ్బు తీసుకురమ్మని చెక్ రాసి తన పీఏను పంపించారు ఎన్టీఆర్. వెంటనే బ్యాంక్ వాళ్ళు చంద్రబాబుకు మెసేజ్ ఇచ్చారు. చంద్రబాబు మానవత్వాన్ని మర్చిపోయి ఆ డబ్బు కోసం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ప్రస్తుతం తనే గనుక సొమ్ము తనకే చెందాలని హైకోర్టులో ఎమర్జెన్సీ పిటిషన్ వేయించాడు. ఇది జనవరి 17వ తారీఖు జరిగిన సంఘటన. అప్పటికప్పుడే సీజే ప్రభాకర శంకర మిశ్రా ఆదేశం మేరకు హైకోర్టు జస్టిస్ బి. మోతీలాల్ నాయక్ స్టే ఆర్డర్ ఇచ్చేశారు. అంత ఎమర్జెన్సీగా వారు స్పందించారు!

సాయంత్రం 5 గంటలకు లాయర్లు వచ్చి విషయం చెప్పగానే ఎన్టీఆర్ ఆగ్రహంతో ఊగిపోయారు. ఆయన శరీరం అదుపు తప్పింది. కుర్చీలోంచి లేచి నిలబడబోయి కిందపడబోయారు. అక్కడున్న వాళ్ళు పట్టుకుని ఆపారు. ముఖం, కాళ్లు ఎర్రగా అయిపోయాయి. పెద్దగా కేకలు వేశారు. నెహ్రూ సర్దిచెప్పినా ఆయన పట్టించుకోలేదు. డబ్బు లేకుండా పార్టీ భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన పడ్డారు. ఇదంతా అయ్యేసరికి రాత్రి 7 గంటలయ్యింది. 10 గంటలకు రామానాయుడు 'జామాత దశమగ్రహః' క్యాసెట్ ఇచ్చి వెళ్లారు. అయితే సింహ గర్జన సదస్సులో ఈ క్యాసెట్ రిలీజ్ చేసి ప్రజలకు చంద్రబాబు నాయుడు చేసిన దుర్మార్గాల్ని గురించి చెప్పాలనుకున్న ఆయన నోరు శాశ్వతంగా మూగబోయింది. పార్టీ డబ్బు సీజ్ చేసిన 8 గంటల లోపే ఈ అవమానాలు తట్టుకోలేని ఆ గుండె ఆగిపోయింది.

ప్రత్యర్థులను మట్టి కలపాలనుకునే సమయంలో విధి ఆయనను వెక్కిరించింది. కలల్నీ, కలతల్నీ తనలో కలుపుకొంటూ మృత్యువు ఆయనకు శాశ్వత విశ్రాంతి కల్పించింది. ఇప్పుడు చెప్పండి... దుర్మార్గుడైన చంద్రబాబు నాయుడి అధికార దాహం వలనే కదా ఆయనకీ అకాల మృత్యువు ప్రాప్తించింది. తెలుగు ప్రజలందరూ ఎన్టీఆర్ ఆవేదనను అర్థం చేసుకోవాలని మనవి చేస్తూ... అశ్రునయనాలతో సెలవు.

వ్యాసకర్త ఎన్టీఆర్ సతీమణి, ఏపీ తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్

గోబెల్స్‌నే తలదన్నిన రామోజీ


('ఈనాడు' అధిపతి రామోజీరావుపై దివంగత ఎన్టీఆర్ వ్యాఖ్యలివి. 1995 'బాబు వెన్నుపోటు' ఉదంతంపై ఎన్టీఆర్ తన మరణానికి కొద్ది రోజుల ముందు ఇచ్చిన ఇంటర్వ్యూ లోని మాటలు ఇవి.)

"ఒక పత్రికాధిపతి గురించి ప్రత్యేకంగా పేర్కొనాలి. ఆ పత్రిక పేరు, దాని అధిపతి పేరు ఉచ్చరించదలచుకోలేదు. తిమ్మిని బమ్మి చేశారు. సత్యాలకు స్వస్తి చెప్పారు. వాస్తవాలకు వికృత వ్యాఖ్యలు కల్పించి ప్రచారం చేయడం ద్వారా గోబెల్స్ గుండెల్లో గుబులెక్కించారు. ఆ విద్యల్లో ఆయన కంటే కూడా మించిపోయారు.

నా రాజకీయ ప్రవేశంతో రామోజీకి సంబంధమే లేదు. నేను రాజకీయాల్లోకి ప్రవేశించే నాటికి నాకు ఆయనతో పరిచయం కూడా లేదు. ప్రత్యక్షంగా నేను రాజకీయాల్లోకి ప్రవేశించే నాటికి కొన్ని దశాబ్దాల క్రితమే నన్ను రాజకీయాల్లోకి రమ్మని పూజ్యులు నీలం సంజీవరెడ్డి గారు ఆహ్వానించారు. కాసు బ్రహ్మానందరెడ్డి గారు 'ఎంపీ టికెటిస్తాను ఎన్టీఆర్! మా పార్టీలో చేరు' అని కోరారు. ఈ పత్రికాధిపతిని నేను తెలుగుదేశం పార్టీని స్థాపించాక కొందరు మిత్రులు పరిచయం చేశారు. ఆయన నా మీదే పెత్తనం చలాయించాలనుకున్నాడు. నన్ను తన చెప్పుచేతల్లో పెట్టుకోవాలనుకొన్నాడు. ఆయనకు తాబేదారుగా ఉండటానికి, ఆయనకు మద్దెల కొట్టడానికి, భజన చేయడానికి నేను అంగీకరించలేదు. ఎన్టీఆర్ చండశాసనుడని ఆయన తెలుసుకున్నాడు. తమ పత్రికలో మాకు వ్యతిరేకంగా వార్తలు ప్రచురించసాగారు. నీతిమాలిన నికృష్టపు రాతలతో వ్యక్తుల జీవితాలపై కూడా బురద జల్లడానికి సమకట్టారు. ఆ రాతల పట్ల మేము అభ్యంతరం చెప్పాం. అయినా ఆపలేదు. రాజ్యాంగం పత్రికా స్వేచ్ఛను ప్రసాదించింది దుర్వినియోగం చేయడానికేనని వారు భావించినప్పుడు, అందుకు అనుగుణంగానే వ్యవహరించడానికి నిర్ణయించుకున్నప్పుడు ప్రజలే గుణపాఠం చెబుతారని వారికి చెప్పాం. 'మీరు రాసేది రాయండి, నేను చేసేది చేస్తా'నని చెప్పాను. ఆనాటినుంచి ఆయన మా మీద పగ పెంచుకున్నాడు. తన పత్రికను అబద్ధాల పుట్టగా, చెత్తకాగితాల బుట్టగా మార్చేస్తున్నాడు. పిచ్చి కార్టూన్లు, పిచ్చి రాతలు. నా కుటుంబ సభ్యులు చాలామందితో మాపై వ్యతిరేకత కల్పించడానికి, పెంచడానికి ప్రయత్నించారు.

తాత్కాలికంగా చరిత్రను తమ గుప్పిట్లోకి తెచ్చుకొన్నామని, కాలానికి కళ్లెం వేశామని భావించి అటువంటి దుర్మదాంధులు, స్వార్థపరులు చివరికి చరిత్ర విసిరేసిన పెంటకుప్పల్లో మాత్రమే ఉండిపోతారు."

ఎన్టీఆర్‌పై 'ఈనాడు' వికృత రాతలు - గీతలు



మామను ముంచిన అల్లుడు

మామ స్వర్గీయ ఎన్టీఆర్‌పై ఇవాళ ఎక్కడలేని ప్రేమ మాటల్లో ఒలకబోస్తున్న అల్లుడు చంద్రబాబు నిజానికి పూర్వాశ్రమంలో కాంగ్రెస్‌లో మంత్రిగా పనిచేస్తున్నప్పుడు కొత్తగా తెలుగుదేశం పార్టీ పెట్టిన 'ఎన్టీఆర్ గాలి ఎక్కడా లేదు' అని వ్యాఖ్యానించారు. 'ఎన్టీఆర్‌పై పోటీకి సిద్ధం' అంటూ బీరాలు పలికారు. 1983లో కాంగ్రెస్ ఓటమితో, నిస్సిగ్గుగా టీడీపీలోకి వలస వచ్చేశారు. మామను నమ్మించి, వంచించి పార్టీనీ, ప్రభుత్వాన్నీ హస్తగతం చేసుకున్నారు. ఆ 1995 వెన్నుపోటు వేళ కానీ, ఆ తర్వాత కానీ ఆ మహానాయకుడు స్థాపించిన పార్టీలోనే ఆయన ఆనవాళ్ళు లేకుండా చేయడానికి సమస్త ప్రయత్నాలూ చేశారు. వైస్రాయ్ హోటల్ వద్ద రోడ్డుపై చైతన్య రథంపై నిలిచి ఉన్న ఎన్టీఆర్‌పై బాబు తన వర్గంతో చెప్పుల దాడి చేయించారు. అప్పట్లో 'దక్కన్ క్రానికల్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మాకు ఎన్టీఆర్‌తో అవసరం లేదు' అని నిర్లజ్జగా చెప్పారు. ఒక దశలో ఆయన 'ఇండియా టుడే'తో మాట్లాడుతూ, 'ఎన్టీఆర్‌లో నైతిక విలువలు శూన్యం' అంటూ అనరాని మాటలు అన్నారు. రాజగురువు అండతో రాజకీయం నడిపారు. మామను ముంచిన అల్లుడు చంద్రబాబు 'జామాతా దశమ గ్రహః' అని ఎన్టీఆర్ గ్రహించి, ఆగ్రహించే సరికే అంతా ఆలస్యమైపోయింది. మనోవేదనతో ఎన్టీఆర్ మరణానికి బాధ్యుల్లో బాబు అండ్ కో పాత్ర చరిత్రలో చెరిగిపోని చేదు నిజం. అవసరమైనప్పుడూ, అత్యవసర సందర్భాల్లో మాత్రమే ఎన్టీఆర్‌పై మనసులో లేకున్నా మొక్కుబడి ప్రేమ చూపడం బాబు నైచ్యం, నైజం.



పేరు చెప్పేందుకూ అనర్హుడే!

(వెన్నుపోటుకు పాల్పడిన చంద్రబాబు నాయుడు మీద ఎన్టీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇవి)

"నా అల్లుడనబడుతున్నవాడే నా గుండెల్లో చిచ్చుపెట్టాడు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించడానికి ముందు అతనేమిటో మీ అందరికీ తెలుసు. కాంగ్రెస్‌లో ఉంటూ, మంత్రులపై కూడా పోటీ చేస్తానంటూ ప్రగల్భాలు పలికి, చివరకు తెలుగుదేశం మహా ప్రభంజనంలో కొట్టుకుపోయిన ఓ చిన్నమిడత. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక, అతను పార్టీలో చేరతానని వస్తే, చేర్చుకోవద్దని కొందరు హితవు చెప్పారు. అయినప్పటికీ పశ్చాత్తాపాన్ని ప్రకటించాడు కదా అని ఔదార్యంతో చేర్చుకున్నాను. అతడు కడుతున్న ముఠాల గురించీ, చేరదీస్తున్న గ్రూపుల గురించీ పట్టించుకోలేదు. అధికారం కోసం ఆ పెద్దమనిషి ఇంతటి అల్పమైన నీచమైన దారుణమైన వెన్నుపోటుకు కూడా సిద్ధపడతాడనీ నేనూహించలేకపోయాను. నామీద ఒక అభియోగం సృష్టించాడు. కార్యకర్తలకేదో అన్యాయం జరిగిందట. ప్రజల విశ్వాసం చూరగొన్న ఏ నా కార్యకర్తలకూ ఏ నా తెలుగు తమ్ముళ్లకూ అన్యాయం జరగలేదు. ఒకవేళ ఏదైనా లోటు జరిగితే అది అవకాశవాదులకు మాత్రమే జరిగింది! చంద్రబాబు... ఆ పెద్దమనిషి.... ఆ మేకవన్నె పులి... ఆ తేనెపూసిన కత్తి తయారుచేసిన కుట్రదారులకే జరిగింది! అతడి పక్కన చేరి, కుహనా కార్యకర్తలుగా చలామణై, దళారీలుగా ఉన్న వారికే జరిగింది!



పేరు చెప్పేందుకూ అనర్హుడే!

ఇవాళ నేను మాట్లాడుతున్న వ్యక్తి ఓడిపోయి తెలుగుదేశంలోకి వచ్చాడు. నా విధానాలకు పూర్తిగా అంకితమవుతానని మాటిచ్చాడు. కానీ అతని మనసులో ఉన్న దురాశ మాత్రం పోలేదు. తనకంటూ ఓ గుంపును తయారు చేసుకున్నాడు. అందరికీ డబ్బిచ్చాడు ఈయన. ఆయన పేరు చెప్పడం కూడా నాకిష్టం లేదు. పేరు చెప్పేందుకు కూడా ఆయన అర్హుడు కాదు. అందరికీ 5 లక్షలు, 10 లక్షలు డబ్బులిచ్చి 'ఇదిగో ఎన్నికల కోసం మీ అందరికీ డబ్బిస్తున్నాను. మీరంతా నా మనుషులుగా ఉండాలి' అంటూ ఏర్పాటు చేసుకున్నాడు. ఇట్స్ ఏ ప్లాన్డ్ ట్రెచెరీ!

తెలుగు జాతి దురదృష్టం

చరిత్రను చూస్తే... తండ్రిని జైల్లో పెట్టిన సమ్రాట్లున్నారు. రాజ్యాధికారం కోసం అన్నల్ని చంపిన సోదరుడున్నాడు... ఔరంగజేబు. అలాంటి దురదృష్టకరమైన విధానం మళ్లీ ఇన్ని వందల ఏళ్ల తర్వాత తెలుగు జాతి చరిత్రలో మన రాష్ట్రంలో ఈనాడు తిరిగి జరిగింది. అది మన దురదృష్టం. (1995 ఆగస్టు 23 నాటి వెన్నుపోటుకు కొద్ది రోజుల ముందు) నేను శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం వెళ్లినప్పుడు అక్కడ కూడా ఈ మహానుభావుడే, ఎవరైతే ఈనాడు జాతికే చిన్నతనం తెచ్చారో... అవమానకరంగా వ్యవహరించారో... తెలుగుజాతిని కించపరిచారో... ఆ మహానుభావుడే, 'రామారావు గారు లేకపోతే మా పార్టీ (తెలుగుదేశం) లేదు. ఆయన వల్లే పార్టీ నడుస్తోంది. మేమాయన వెనకాల ఉంటున్నాం. ఈ ఖ్యాతి, గౌరవం అంతా ఆయనదే. రామారావే మా నాయకుడు' అన్నాడు. అలా చెప్పినవాడే ఎందుకు మారారంటారు?

ఆదర్శాలకు వెన్నుపోటు

ఈ వెన్నుపోటు జరిగింది నాకొక్కడికి మాత్రమే కాదు. ప్రజలకు, మీకు, మీరు వేసిన ఓటుకు. మీరు నమ్మిన ప్రజాస్వామ్యానికి, మీరు విశ్వసించిన ఆశయాలకు, ఆదర్శాలకు ఇది వెన్నుపోటు! ఇంత నీచానికి ఒడిగట్టిన చంద్రబాబు... ఎన్టీఆర్ లాగే ఆయన విధానాలే కొనసాగిస్తామని చెబుతుంటే ఎలా ఉందో తెలుసా? చేతులు జోడించి, నమస్కారం చేసి, తుపాకీ పేల్చి గాంధీ మహాత్ముణ్ణి పొట్టనబెట్టుకున్న గాడ్సేనే మించిపోయాడనిపిస్తోంది. ఇది సిగ్గుచేటు. క్షమించరాని నేరం. దేవుడు సహా ఎవరూ క్షమించలేని ఘాతుకానికి బాబు ఒడిగట్టాడు. దీన్ని జాతి, చరిత్ర ఎప్పటికీ క్షమించదు!"

గ్రహం అనుగ్రహం శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి శు.అష్టమి ఉ.7.09 వరకు, తదుపరి నవమి, నక్షత్రం పుబ్బ రా.11.54 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం ఉ.6.21 నుండి 8.04 వరకు; **దుర్ముహూర్తం** సా.4.40 నుండి 5.54 వరకు; **అమృత ఘడియలు:** సా.4.53 నుండి 6.38 వరకు; **రాహుకాలం:** సా.4.30 నుండి 6.00 వరకు; **యమగండం:** ప.12.00 నుండి 1.30 వరకు; **సూర్యోదయం** 5.29; **సూర్యాస్తమయం:** 6.25

ఆర్గానిక్ బ్రాండ్‌తో అరకు కాఫీకి..

అంతర్జాతీయ క్రేజ్

అరకు కాఫీ, మిరియాలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్

ఈ మేరకు అపెడా ఆమోదం

- ఇప్పటికే అంతర్జాతీయ విపణిలో ఆర్గానిక్ ఉత్పత్తులకు డిమాండ్
- దీంతో గిరిజన కాఫీకి మరింత మంచి ధరలు.. రైతులకు మేలు

సాక్షి, అమరావతి : అంతర్జాతీయ మార్కెట్లో అత్యంత డిమాండ్ ఉన్న అరకు వ్యాలీ కాఫీకి ఆర్గానిక్ బ్రాండ్ మరింత క్రేజ్ తేనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు పండించే అరకు వ్యాలీ కాఫీ, మిరియాలకు సేంద్రియ ధ్రువపత్రం(ఆర్గానిక్ సర్టిఫికేషన్) లభించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని వ్యవసాయ, ఆహారోత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ(అపెడా) ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీంతో ఏపీ గిరిజన సహకార సంస్థ(జీసీసీ) నాలుగేళ్లుగా చేస్తున్న కృషి ఫలించింది. దీనివల్ల గిరిజన రైతులు పండించిన కాఫీ, మిరియాలకు అంతర్జాతీయ మార్కెట్లో మరింత మంచి ధరలు దక్కనున్నాయి.

ఫలించిన నాలుగేళ్ల కృషి

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి డివిజన్ పరిధిలోని గొందిపాకలు, లంబసింగి, కప్పాలు క్లస్టర్లలో 1,300 మంది గిరిజన రైతులు 2184.76 ఎకరాల్లో పండిస్తున్న కాఫీ, మిరియాలకు సేంద్రియ ధ్రువపత్రం సాధించడం కోసం నాలుగేళ్లుగా కృషి జరిగింది. తొలుత గొందిపాకలు గ్రామానికి చెందిన రైతులు సేంద్రియ సాగులో ముందున్నారు. గ్రామంలోని రైతులంతా కలసి గిరిజన గ్రామ స్వరాజ్య సంఘంగా ఏర్పడి సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టారు. ఎరువులు వేయకుండా సేంద్రియ పద్ధతుల్లోనే కాఫీ, అంతర పంటగా మిరియాలను పండిస్తున్నారు. గొందిపాకలుతో పాటు లంబసింగి, కప్పలు గ్రామాల్లో రైతులతోనూ సమావేశాలు నిర్వహించిన జీసీసీ సేంద్రియ సాగును ప్రోత్సహించింది. దీంతో మూడేళ్లుగా క్రమం తప్పకుండా స్కోప్ సర్టిఫికెట్ వచ్చేలా జీసీసీ కృషి చేసింది. మూడేళ్లపాటు దీనిపై సునిశిత అధ్యయనం పూర్తికావడంతో నాల్గో ఏడాది సేంద్రియ సాగు ధ్రువపత్రం జారీకి అపెడా ఆమోదం తెలిపింది. దీంతో తొలి విడతలో చింతపల్లి మండలంలోని 2,184.76 ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్న దాదాపు 1,300 మంది గిరిజన రైతులకు సేంద్రియ ధ్రువపత్రాలు అందించనున్నారు. ఇదే తరహాలో జీకే వీధి, పెదవలస, యెర్రచెరువులు క్లస్టర్లలో మరో 1,300 మంది రైతులు సుమారు 3,393.78 ఎకరాల్లో పండిస్తున్న కాఫీ, మిరియాలు పంటలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చే ఏడాది జనవరి నాటికి వాటికీ సేంద్రియ ధ్రువపత్రాల జారీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. కాగా, ఒక పంటకు సేంద్రియ ధ్రువపత్రం సాధించడం అంత తేలిక కాదు. ఇందుకు పెద్ద కసరత్తే ఉంటుంది. థర్డ్ పార్టీ వెరిఫికేషన్, ప్రతి విషయం ఆన్‌లైన్ వెరిఫికేషన్, ఆన్‌లైన్ అఫ్రేషన్, ప్రతి రైతు వ్యవసాయ క్షేత్రం జియో ట్యాగింగ్, వాటన్నింటినీ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం వంటివి ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా నిర్వహించాలి. వీటన్నిటినీ జీసీసీ అధికారులు సకాలంలో విజయవంతంగా పూర్తిచేశారు.



మరో మైలురాయి



సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో జీసీసీ సమర్థంగా సేవలందిస్తోంది. ఇప్పటికే సేంద్రియ బ్రాండింగ్‌తో నాణ్యమైన పసుపు, తేనెను టీటీడీకి సరఫరాచేస్తున్నా. తాజాగా నాలుగేళ్ల కృషి ఫలించడంతో కాఫీ, మిరియాల సాగుకు సేంద్రియ సాగు ధ్రువపత్రం దక్కడం జీసీసీ చరిత్రలో మరో మైలురాయి. ఇది సాధించినందుకు గర్వంగా ఉంది.

– శోభ స్వాతిరాణి, చైర్‌పర్సన్, గిరిజన సహకార సంస్థ

పవన్‌ను సీఎం అభ్యర్థిగా బాబు ప్రకటించాలి

కాపు ఐక్య వేదిక డిమాండ్

సాక్షి, అమరావతి: ఈసారి ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించి చంద్రబాబు పదవీ త్యాగానికి సిద్ధం కావాలని కాపు ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. 2014 ఎన్నికల్లో జనసేన సహకారం, బీజేపీ అండదండలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని పేర్కొంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవడం ద్వారా లాభపడాలని 2019 ఎన్నికల్లో చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా ఆ రెండు పార్టీలకు దూరంగా జరిగారని కాపు ఐక్య వేదిక గుర్తు చేసింది. కానీ చంద్రబాబు వ్యూహం బెడిసికొట్టడంతో ఆయన అంచనాలు తల్లకిందులై ఓటమి చెందారని పేర్కొంది. మళ్లీ అధికారం కోసం బీజేపీ, జనసేనలకు దగ్గరయ్యేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం ప్రతిపక్షాలు ఏకం కావాలని, త్యాగాలకు సిద్ధం కావాలని చంద్రబాబు అనేకసార్లు పిలుపు ఇస్తున్నారని, ఈసారి ఎన్నికల్లో చంద్రబాబు త్యాగానికి సిద్ధపడి హుందాగా ముందుకు సాగాలని కాపు ఐక్య వేదిక కోరింది.

విష వాయువు లీక్.. ముగ్గురికి అస్వస్థత

- ఎన్టీఆర్ జిల్లా ఎస్ఎల్ ఫార్మాస్యూటికల్ కర్మాగారంలో ఘటన
- అనుమతుల్లేకుండానే నిర్వహణ
- యాజమాన్యంపై క్రిమినల్ కేసుల నమోదుకు ఆర్డీవో ఆదేశం

జగ్గయ్యపేట : ఫార్మాస్యూటికల్స్ కర్మాగారంలో డ్రగ్స్ తయారు చేస్తుండగా ఒక్కసారిగా రియాక్టర్ నుంచి విష వాయువులు లీకవడంతో ముగ్గురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణ సమీపంలోని ఆటోనగర్ ఇండస్ట్రియల్ పార్కులో శనివారం ఈ ఘటన జరిగింది. ఎస్ఎల్ ఫార్మాస్యూటికల్ కర్మాగారంలో నాలుగు నెలలుగా బల్క్‌డ్రగ్ మెడిసిన్‌ను(2 అమినో 5 క్లోరా టోలిన్, పైరెడిన్) తయారుచేస్తున్నారు. ఉదయం డ్రగ్‌ను రియాక్టర్ నుంచి పైపుల ద్వారా కార్మికులు డ్రమ్ములోకి పంపుతుండగా ఒక్కసారిగా పైపు లీకై విషవాయువు కర్మాగారంలోని రెండో అంతస్తును కమ్మేసింది. దీంతో అక్కడ పనిచేస్తున్న అసోంకు చెందిన హబీబుర్ రెహమాన్, జయూర్ రెహమాన్‌లతో పాటు జగ్గయ్యపేటకు చెందిన శివప్రసాద్‌లు పనిచేస్తున్న చోటే కుప్పకూలిపోయారు. వెంటనే అక్కడున్న సిబ్బంది రియాక్టర్లను ఆపి 108 ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి.. ప్రథమ చికిత్స అనంతరం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. నందిగామ ఆర్డీవో రవీంద్ర, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ శ్రీనివాసరావు, విజయవాడ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ప్రసాదరావులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కర్మాగారానికి కనీస అనుమతులు కూడా లేవని గుర్తించినట్టు ఆర్డీవో చెప్పారు. రియాక్టర్‌కు గోనె పట్టాలు కట్టటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఐ జానకిరామ్‌ను ఆయన ఆదేశించారు. క్లోరిన్‌ను ఎక్కువ మోతాదులో పీల్చితేనే ఇలాంటి ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ శ్రీనివాస్ 'సాక్షి'తో చెప్పారు. కాగా, ఆస్పత్రిలో కార్మికులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పరామర్శించారు.

కుల గణన అధ్యయన కమిటీపై హర్షం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చొరవ అభినందనీయమని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు కితాబిచ్చారు. రాష్ట్రంలో కుల గణన చేపట్టేలా అధ్యయనానికి ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీ వేయడం హర్షణీయమని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రిటీష్ కాలం నుంచి దేశ వ్యాప్తంగా ఉన్న కుల జన గణన ఆ తర్వాత నిలిపివేశారని తెలిపారు. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ మినహా మిగిలిన కాలమ్‌లు లేకపోవడంతో ప్రధానంగా బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఇదే విషయమై అనేక ఉద్యమాలతో కేంద్రంపై వత్తిడి తెచ్చినా సానుకూల స్పందన లేదని, ఇటువంటి పరిస్థితుల్లో బీసీలకు మేలు చేసేలా సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో కుల గణనకు చర్యలు చేపట్టడం గొప్ప విషయమని తెలిపారు. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కేశన శంకరరావు విజ్ఞప్తి చేశారు.

నాపరాయి లారీ బోల్తా.. ముగ్గురి దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- బాపట్ల జిల్లాలో ఘటన

రేపల్లె రూరల్ : పొట్టకూటి కోసం కూలీ పనులకు వచ్చిన వారి బతుకులు తెల్లారాయి. మరికొద్ది సేపట్లో గమ్య స్థానానికి చేరుకోవాల్సిన వారి జీవితాలను మృత్యువు కబళించింది. నాపరాయి లోడుతో వస్తున్న లారీ బ్యాంకు కెనాల్లో బోల్తాపడటంతో ముగ్గురు కార్మికులు దుర్మరణం పాలవగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బాపట్ల జిల్లా రేపల్లె మండలం రావిఅనంతరం గ్రామ సమీపంలో శనివారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. పల్నాడు జిల్లా మాచర్ల నుంచి రేపల్లెకు నాపరాయిలోడుతో వస్తున్న లారీ రావి అనంతవరం సమీపంలో అదుపు తప్పి బ్యాంకు కెనాల్‌లో బోల్తా కొట్టింది. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఘటనలో లారీ పైభాగంలో ఉన్న ముగ్గురు కార్మికులు రెంటచింతల మండలం పశర్లపాడుకు చెందిన చిన్నపల్లి చెన్నకేశవులు(48), సాంబయ్య(60), వలీ(41)లు ప్రమాద స్థలంలోనే నాపరాయి కిందపడి మృతి చెందారు. లారీ క్యాబిన్లో ఉన్న పశర్లపాడుకు చెందిన చల్లా చినకాశియ్య, గుడిపల్లి చినసుబ్బయ్యతో పాటు డ్రైవర్ గుడిపాటి సైదారావులకు తీవ్ర గాయాలయ్యాయి. రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ, పట్టణ సీఐ విజయచంద్రలు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి రేపల్లె ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి.. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

నావిక్.. ఇక రోదసి నాయక్

- ప్రస్తుతం 7 ఉపగ్రహాలతో స్వదేశీ నావిగేషన్ సేవలు పొందుతున్న భారత్
- ఈ నెల 29న నావిక్–01 ఉపగ్రహ ప్రయోగం
- నావిగేషన్ ఉపగ్రహ ప్రయోగాల్లో సెకండ్ సిరీస్‌కు తెరతీసిన ఇస్రో

సూళ్లూరుపేట: భారతదేశానికి పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ఇస్రో భారత క్షేత్రీయ దిక్సూచి ఉపగ్రహాల వ్యవస్థ (ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం)లోకి 9 ఉపగ్రహాలను పంపించిన ఇస్రో నావిగేషన్ సిస్టంను సొంతంగా అందుబాటులోకి తెచ్చింది. నావిగేషన్ సిస్టంను సొంతంగా తయారు చేసుకోవాలనే లక్ష్యంలో ఇస్రో 7 ఉపగ్రహాల అవసరాన్ని 2006లోనే గుర్తించి 2018 నాటికి వాటి సేవలను అందుబాటులోకి తెచ్చింది. 7 ఉపగ్రహాల సిరీస్‌లో మొదటి ఉపగ్రహం ఐఆర్ఎన్ఎస్ఎస్–1ఏలో సాంకేతిక లోపం ఏర్పడి సేవలు నిలిచిపోగా.. దాని స్థానంలో 2017 ఆగస్టు 31న ఐఆర్ఎన్ఎస్ఎస్–1హెచ్ పేరుతో ఉపగ్రహాన్ని విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి పంపించింది. కానీ.. ఉపగ్రహం హీట్ షీల్డ్ నుంచి బయటకు రాకపోవడంతో సిగ్నల్స్ అందక ఆ ప్రయోగం విఫలమైంది. వెంటనే 2018 ఏప్రిల్ 12న ఐఆర్ఎన్ఎస్ఎస్–1ఐ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించి ఐఆర్ఎన్ఎస్ఎస్–1ఏ ఉపగ్రహానికి రీప్లేస్‌మెంట్ చేసి ఏడు ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. ఐఆర్ఎన్ఎస్ఎస్ ఉపగ్రహాల సిరీస్‌లో 9 ఉపగ్రహాలను ప్రయోగించగా.. రెండు ఉపగ్రహాలు అపజయం పాలై ఏడు ఉపగ్రహాలు కక్ష్యలో ఉండి మనదేశానికి నావిగేషన్ సిస్టంను అందిస్తున్నాయి. కాగా.. 7 ఉపగ్రహాల కాల పరిమితి కూడా దగ్గర పడుతుండటంతో నావిక్–01 పేరుతో రెండో సిరీస్‌లో ఉపగ్రహ ప్రయోగాలకు ఇస్రో తెరతీసింది. నావిగేషన్ వ్యవస్థను మరింతగా బలోపేతం చేయడానికి నావిక్–01 ప్రయోగంతో శాస్త్రవేత్తలు శ్రీకారం చుడుతున్నారు.



పుష్కర కాలం పాటు ఉపగ్రహాల సేవలు

- ఈ ఉపగ్రహ వ్యవస్థలోని ఏడు ఉపగ్రహాల్లో మూడు ఉపగ్రహాలు భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలో 34 డిగ్రీలు, 83 డిగ్రీలు, 130.5 డిగ్రీ తూర్పు రేఖాంశాల వద్ద కక్ష్యలో ఉండి పని చేస్తాయి. మిగతా 4 ఉపగ్రహాలు భూమధ్య రేఖలను ఖండించే భూస్థిర కక్ష్యలోనే 55 డిగ్రీలు, 115 డిగ్రీల తూర్పు భూమధ్య రేఖాతలానికి 31 డిగ్రీల వాలుతో కక్ష్యలో ఉండి పనిచేస్తాయి. ఈ ఏడు ఉపగ్రహాలు 12 ఏళ్లపాటు సేవలందించనున్నాయి.
- భూమి, జల, వాయు మార్గాల స్థితిగతులతో పాటు దిక్కులు తెలియజేయడం, ఆపద సమయాల్లో భూగోళానికి సంబంధించిన సమాచారం, వాహన చోదకులకు దిశానిర్దేశం, ఇంటర్నెట్‌తో అనుసంధానం లాంటి ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా భారత విమానయాన, నౌకాయాన మార్గాలకు, సైనిక అవసరాలకు కూడా ఈ ఉపగ్రహ వ్యవస్థ దోహదపడుతోంది.

1,500 కిలోమీటర్ల పరిధి వరకు విస్తరణ

- భారతదేశం అంచునుంచి సుమారు 1,500 కిలోమీటర్ల పరిధి వరకు నావిగేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అయితే, అత్యంత అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు రెండో విడతగా నావిక్ పేరుతో రెండో సిరీస్ ఉపగ్రహ ప్రయోగాలకు ఇస్రో తెరతీసింది. ఇందులో భాగంగానే.. ఈ నెల 29న ఉదయం 10.42 గంటలకు జీఎస్ఎల్‌వీ ఎఫ్–12 రాకెట్ ద్వారా నావిక్–01 ఉపగ్రహ ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నారు. అంటే.. రానున్న భవిష్యత్‌లో భారత నావిగేషన్ సేవలకు 'నావిక్' నాయకత్వం వహిస్తుందన్న మాట.

రైతుల పొలాల్లో ఉచితంగా బావుల తవ్వకం

ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు మరో ప్రయోజనం

- విధివిధానాలతో సర్క్యులర్ జారీచేసిన గ్రామీణాభివృద్ధి శాఖ
- గరిష్టంగా 53 అడుగుల వరకు తవ్వుకునే అవకాశం

సాక్షి, అమరావతి: భూగర్భ జలాలు అందుబాటులో ఉండే గ్రామాల పరిధిలో సాగునీటి అవసరాల కోసం పేద రైతులకు ఉచితంగా బావులు తవ్వించడానికి ప్రభుత్వం వీలు కల్పించింది. చిన్న, సన్నకారు రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఈ వ్యవసాయ బావులు తవ్వించుకోవచ్చు. ఈ మేరకు పనుల మంజూరులో పూర్తిస్థాయి విధివిధానాలతో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు డ్వామా పీడీలకు ఇటీవల సర్క్యులర్ జారీ చేశారు. దాని ప్రకారం.. వ్యవసాయ బావులను కూలీలతో తవ్వించాల్సి ఉంటుంది. ఈ పనిలో పాల్గొనే కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా వేతనం చెల్లిస్తారు. ఆరు మీటర్ల వ్యాసంతో గరిష్ఠంగా 16 మీటర్ల (దాదాపు 53 అడుగులు) లోతు వరకు ఈ వ్యవసాయ బావులు తవ్వుకోవచ్చని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. రెండు మీటర్ల లోతు వరకు తవ్వాక బావి లోపలి మట్టిని పొక్లెయినర్ ద్వారా బయటకు తీయడానికి అయ్యే ఖర్చులను.. అలాగే, ఒకవేళ రాతి నేలలైతే ఆ రాళ్లను పేల్చేందుకు అయ్యే ఖర్చులను కూడా చెల్లించనున్నారు. బావిలో ఊరే నీరు మోటార్లతో తోడటానికి ఐదు గంటల సమయానికి అయ్యే ఖర్చును కూడా చెల్లిస్తారు. కాగా, సాగునీటి అవసరాల కోసం రైతుల భూముల్లో వ్యవసాయ బావుల తవ్వకానికి ఎలాంటి ఇబ్బందులు లేని గ్రామాల వివరాలు తెలపాలంటూ రాష్ట్ర భూగర్భ జలశాఖ అధికారులను గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 240 మండలాల్లోని 1,770 గ్రామ పంచాయతీలు ఈ కార్యక్రమానికి అనువైనవిగా పేర్కొంటూ భూగర్భ జల శాఖ అధికారులు నివేదిక ఇచ్చారు. ఆ గ్రామాల్లో అత్యధికంగా 12 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. అయితే కొన్ని చోట్ల గరిష్టంగా 20 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్న గ్రామాలు కూడా ఉన్నాయి. ఈ గ్రామాల్లో మాత్రమే బావుల తవ్వకానికి అనుమతి తెలపాలని గ్రామీణాభివృద్ధి శాఖ తమ ఆదేశాల్లో కలెక్టర్లు, డ్వామా పీడీలకు స్పష్టం చేసింది. వ్యవసాయ బావుల తవ్వకానికి ఒక్కొక్క దానికి గరిష్ఠంగా రూ. రెండు లక్షల వరకు ఖర్చవుతుందని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అక్కసుతోనే కులవాదుల దాడులు

972వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధానిలో ఇళ్ల పట్టాలు తీసుకుంటున్న బహుజనులు ప్రభుత్వానికి దగ్గరవుతున్నారనే అక్కసుతోనే కులవాదుల దాడులు చేసి ఉగ్రవాదుల్లా వ్యవహరిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 972వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ తరతరాలుగా జరుగుతున్న వివక్ష కారణంగానే బహుజనులు బాబును వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. అయినా తన తీరు మార్చుకోకుండా బాబు రైతుల ముసుగులో టీడీపీ నాయకులను రెచ్చగొట్టి తమపై దాడులకు ఉసిగొల్పడం సిగ్గుచేటన్నారు. ఎప్పుడో సీఆర్డీఏకు భూములిచ్చి రిటర్నబుల్ ప్లాట్లను తీసుకున్న వీరందరికీ ఆ భూములపై హక్కు ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించారు. చట్టానికి కళ్లుగప్పి 29 కేసుల్లో స్టేలు తెచ్చుకుని బయట తిరుగుతున్న బాబును, తండ్రి అధికారం అడ్డుపెట్టుకుని నిలువుదోపిడీ చేసిన లోకేశ్‌ను అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. దళితుడై ఉండి మాజీ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పేదల ఇళ్ల స్థలాలు మురికివాడలుగా మారతాయనడం సిగ్గుచేటని, గత 14 సంవత్సరాల పాలనలో బాబు పేదలకు ఎన్ని సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు పంపిణీ చేశాడో ఆత్మ పరిశీలన చేసుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. శ్రావణ్‌కుమార్ తన తీరు మార్చుకోకుంటే ఎస్సీ నియోజకవర్గమైన తాడికొండలో బహుజనులంతా ఏకమై చిత్తుచిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. అంబేడ్కర్ సతీమణి రమాబాయి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో అందేలా చూడాలి

- ఈ విషయంలో జర్నలిస్టుల పాత్ర కీలకం
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పేదల కోసం మునుపెన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు, సంస్కరణలను వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఇవన్నీ ఆయా వర్గాలకు అందేలా చూడటంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. సి.రాఘవాచారి మీడియా అకాడమీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సంయుక్తంగా తీసుకువచ్చిన డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సులో భాగంగా శనివారం వర్చువల్‌గా ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'రాష్ట్రాభివృద్ధిలో మీడియా పాత్ర' అనే అంశంపై సజ్జల ప్రసంగించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న మార్పులు, సంస్కరణల ఫలితాలు సమాజంలో అందరి కంటే ముందు జర్నలిస్టులకు కచ్చితంగా తెలుస్తాయన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం నాలుగేళ్లలో అన్ని రంగాల్లోనూ సంస్కరణలు తీసుకువచ్చిందని వివరించారు. వలంటీర్ వ్యవస్థ, గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకేల ద్వారా క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో వచ్చిన ఫలితాలను ప్రజలకు వార్తల ద్వారా వివరించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రజలకు చేరేలా వార్తలు రాసిన జర్నలిస్టులను.. ప్రజలు కూడా కలకాలం గుర్తుంచుకుంటారన్నారు. సీనియర్ జర్నలిస్ట్ గోవిందరాజు చక్రధర్ 'వార్తలు–విలువలు' అనే అంశంపై ప్రసంగించారు. సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ ఎల్వీకే రెడ్డితో పాటు వివిధ జిల్లాల నుంచి వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఇక గజరాజులు 'సేఫ్'!

కౌండిన్య అభయారణ్యంలో సేఫ్ పాసేజ్ నిర్మాణం

- 3,100 మీటర్ల వెడల్పు మేర నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ నిర్ణయం
- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వ కృషి

సాక్షి, అమరావతి: బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే వల్ల చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో గజరాజుల భద్రతకు ముప్పు వాటిల్లకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ఫలించింది. అభయారణ్యం పరిధిలో ఏనుగుల సంచారానికి ఇబ్బంది లేకుండా, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకంగా సేఫ్ పాసేజ్ నిర్మించాలని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ణయించింది. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఏఐ ప్రతిపాదనకు కేంద్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డ్ ఇటీవల ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా మీదుగా బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి మార్గం సుగమమైంది.

ఏనుగుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం పట్టు

బెంగళూరు నుంచి చెన్నై వరకు నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాన్ని ఎన్‌హెచ్‌ఏఐ చేపట్టింది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలను అనుసంధానం చేసే ఈ ప్రాజెక్ట్‌ను రూ.16వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తోంది. మొత్తం 262 కి.మీ. మేర నిర్మించే ఈ హైవే వల్ల బెంగళూరు, చెన్నై మధ్య ప్రయాణ సమయం రెండున్నర గంటలు తగ్గుతుంది. ఈ హైవేను చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అభయారణ్యం మీదుగా 7.10 కి.మీ. మేర నిర్మించాల్సి ఉంది. ఇందుకోసం అభయారణ్యం పరిధిలో 61.73 ఎకరాలను సేకరించాల్సి ఉంది. రాయల్ ఎలిఫెంట్ రిజర్వ్‌గా గుర్తించిన ఈ ప్రాంతాన్ని ఏనుగుల సంరక్షణ కోసం నిర్దేశించారు. ఈ ప్రాంతం మీదుగా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మిస్తే ఏనుగులకు ముప్పు వాటిల్లుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తంచేసింది. హైవేను ఏనుగులు దాటేందుకు ప్రయత్నిస్తే వాహనాలు ఢీకొని మరణించే ప్రమాదం ఉందని చెప్పింది. అభయారణ్యం గుండా హైవే నిర్మించే విషయంలో ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తేనే అభయారణ్య పరిధిలో హైవే నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ చేపడతామని స్పష్టంచేసింది. ఇదే విషయాన్ని జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డుకు కూడా ప్రభుత్వం నివేదించింది.

ప్రభుత్వ ప్రతిపాదనపై ఎన్‌హెచ్‌ఏఐ సానుకూల నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ఎన్‌హెచ్‌ఏఐ... రాయల్ ఎలిఫెంట్ రిజర్వ్ పరిధిలో నిర్మించనున్న 7.1 కి.మీ. ఎక్స్‌ప్రెస్ హైవేకు అండర్ పాసేజ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మొత్తం 3,100 మీటర్ల వెడల్పు మేర అండర్ పాసేజ్ నిర్మిస్తారు. దీనివల్ల ఏనుగులు అభయారణ్యంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సంచరించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. హైవే మీదుగా వాహనాలు వెళుతున్నా సరే... హైవే కింద నిర్మించిన అండర్ పాసేజ్ గుండా ఏనుగులు సంచరిస్తాయి. అదేవిధంగా ఏనుగుల సంరక్షణ చర్యల కోసం రూ.16.98 కోట్లు చెల్లించడంతోపాటు ప్రాజెక్ట్ వ్యయంలో 2శాతం నిధులను కూడా ఏనుగుల పునరావాసం కోసం ఎన్‌హెచ్‌ఏఐ కేటాయిస్తుంది. ఈ ప్రతిపాదనపై జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డు సంతృప్తి వ్యక్తంచేసింది. కౌండిన్య అభయారణ్యం మీదుగా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి ఆమోదం తెలిపింది.

వితంతువులకే మొదటి ప్రాధాన్యత

ఆ తర్వాత అనారోగ్యంతో ఉన్నవారికి.. ● ఆ తదుపరి చెరొక చోట పనిచేస్తున్న భార్యాభర్తలకు..

- చివరి ప్రాధాన్యతగా పరస్పర అంగీకార బదిలీలు
- 25 నాటికి ప్రొబేషన్ పూర్తై ఉండటం తప్పనిసరి
- సచివాలయాల ఉద్యోగుల బదిలీలపై మార్గదర్శకాలు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులెవరినీ వారి సొంత గ్రామ పంచాయతీలకు లేదా వారి సొంత మున్సిపల్ వార్డుల పరిధిలోకి ఎట్టి పరిస్థితిలో బదిలీ చేయబోమని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ లక్ష్మీశ శనివారం పూర్తి మార్గదర్శకాలను విడుదల చేశారు. 2019, 2020 నోటిఫికేషన్ల ద్వా రా ఉద్యోగాలు పొంది.. ఈ ఏడాది మే 25 నాటికి ప్రొబేషన్ ప్రక్రియ పూర్తయిన వారు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇక ఏఎన్ ఎంలకు వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు పరస్పర అంగీకార బదిలీలకు మాత్రమే అవకాశం ఉంటుంద న్నారు. బదిలీలకు దరఖాస్తు చేసుకునే వారిపైన ఎలాంటి శాఖపరమైన క్రమశిక్షణా చర్యలు, ఏసీబీ, విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు.



అర్హులందరికీ బదిలీలకు అవకాశం

బదిలీ కోరుకునే ఏ ఒక్క ఉద్యోగికి అన్యాయం జరగకుండా.. నిర్దేశిత గడువులోగా అర్హులందరికీ ప్రొబేషన్ కూడా పూర్తయ్యేలా కలెక్టర్లతో కలిసి ఆయా శాఖాధిపతులు చర్యలు చేపట్టాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సూచించారు. డైరెక్టర్ లక్ష్మీశతో కలిసి శనివారం ఆయన సచివాలయాల ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు, ఇతర శాఖాధిపతులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఒంటరి మహిళలకే తొలి ప్రాధాన్యం..

- కాగా బదిలీ దరఖాస్తులో సచివాలయాల ఉద్యోగులు ఐదు మండలాలు లేదా ఐదు మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్లను ప్రాధాన్యత క్రమంలో ఎంచుకునే వీలు కల్పించారు. పరస్పర అంగీకార బదిలీలకు కేవలం ఒక మండలం లేదా మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌నే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసేటప్పుడు ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్ల ద్వారా పొందిన నో డ్యూస్ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలి.
- బదిలీలు కోరుకునేవారిలో... వితంతువులు తమ భర్త మరణ ధ్రువీకరణ పత్రాన్ని, వ్యాధిగ్రస్తులు మెడికల్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. చెరొక చోట ఉద్యోగం చేస్తున్న భార్యాభర్తలకు వివాహ ధ్రువీకరణపత్రంతో పాటు భర్త లేదా భార్య ఆధార్ వివరాలు, వారి ఉద్యోగ ఐడీ కార్డు, ఉన్నతాధికారి జారీ చేసిన సర్టిఫికెట్లు ఉండాలి. వాటిని దరఖాస్తుతోపాటు జత చేయాలి.
- ఒక జిల్లా పరిధిలో 15 శాతం నాన్ లోకల్ నిబంధనలకు లోబడి అంతర్ జిల్లాల బదిలీలు ఉంటాయి. ఒక లోకల్ ఉద్యోగి, మరొక నాన్ లోకల్ ఉద్యోగి పరస్పర అంగీకారంతో అంతర్ జిల్లా కేటగిరీలో బదిలీ కోరుకున్నప్పుడు ఈ పరిస్థితి ఉత్పన్నమవుతుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో బదిలీపై వెళ్తున్న ఉద్యోగితో సహా కొత్తగా ఆ జిల్లాకు వచ్చే నాన్ లోకల్ ఉద్యోగి సంఖ్య మొత్తం ఉద్యోగుల్లో 15 శాతం మించి ఉన్నప్పుడు అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం ఉండదని వెల్లడించారు.
- బదిలీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించే సమయంలో మొదట జిల్లా పరిధిలో, ఆ తర్వాత దశలో మాత్రమే అంతర్ జిల్లాల బదిలీలను పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్లతోసహా ఇతర నియామక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పరిధిలో బదిలీల్లో మొదట ఒంటరి మహిళ లేదా వితంతువులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆ తర్వాత వరుస క్రమంలో అనారోగ్య కారణాలు, భార్యాభర్తలు వేర్వేరు చోట్ల పనిచేస్తుండడం వంటివాటిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇక చివరి ప్రాధాన్యతగా పరస్పర అంగీకార బదిలీలకు వీలు కల్పించాలన్నారు.

క్లుప్తంగా

ఉదయనిధి స్టాలిన్ ఫౌండేషన్ ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి నడిపే ఫౌండేషన్‌కు చెందిన రూ.36 కోట్ల ఆస్తుల్ని అటాచ్ చేసినట్లు ఈడీ తెలిపింది. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఫౌండేషన్‌కు చెందిన తమిళనాడులోని రూ.36 కోట్ల విలువైన స్థిరాస్తులను, రూ.34.7 లక్షల బ్యాంక్ డిపాజిట్లను ఈనెల 25న అటాచ్ చేసినట్లు వివరించింది. ఈ కేసు దర్యాప్తులో కల్లాల్ గ్రూప్, యూకే కేంద్రంగా పనిచేసే లైకా గ్రూప్ అనుబంధంగా భారత్‌లోని లైకా ప్రొడక్షన్స్, లైకా హోటల్స్‌లో సోదాలు జరిపినట్లు తెలిపింది.

డిగ్రీ పూర్తి చేయడానికి 54 ఏళ్లు

ఒట్టావా: డిగ్రీ అంటే మూడేళ్లు చదువుతారు. బ్యాక్‌ల్యాగ్స్ ఉంటే మహా అయితే మరో ఏడాది అంతే. కానీ కెనడాకు చెందిన ఆర్థర్ రోజ్ అనే వ్యక్తికి డిగ్రీ పూర్తి చేయడానికి ఏకంగా 54 ఏళ్లు పట్టింది. ప్రపంచంలో నత్తనడకన డిగ్రీ పూర్తి చేసిన వ్యక్తిగా రోజ్ రికార్డు సృష్టించాడు. యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియాలో 1969లో డిగ్రీలో చేరిన రోజ్ ఎట్టకేలకు తన 71 ఏళ్ల వయసులో డిగ్రీ పట్టా తీసుకున్నారు. ఆర్థర్ రోజ్ కెనడాకు చెందిన నటుడు. డిగ్రీలో చేరిన ఏడాది తర్వాత అతనికి నాటకాల పిచ్చి పట్టుకుంది. అందులో పడిపోయి చదువుని పట్టించుకోలేదు. మధ్యలో కొన్నాళ్లు నటనలో కూడా కోర్సులు చేశారు. అలా జీవితమంతా గడిచిపోయి రిటైర్ అయిపోయాక మళ్లీ చదువుపై ఆసక్తి వచ్చింది. 2016లో యూనివర్సిటీ ఆఫ్ కొలంబియాలో మళ్లీ హిస్టరీ స్టూడెంట్‌గా దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేసి గురువారం పట్టా అందుకున్నారు.

ఉ.కొరియాలో 'కరోనా గోడ'

సియోల్: ఉత్తర కొరియాలోకి కరోనా వైరస్ రాకుండా అడ్డుకోవడానికి అక్కడ కిమ్ ప్రభుత్వం రష్యా, చైనా సరిహద్దుల్లో ఏకంగా ఒక గోడ కట్టింది. చైనా, రష్యా సరిహద్దుల నుంచి వైరస్ దేశంలోకి రాకుండా ఉండాలని 2020 నుంచి కొన్ని వేల కిలోమీటర్ల మేర కంచెల్ని వేసుకుంటూ వస్తోంది. సరిహద్దుల్లో కంచెలు, గోడలు, గార్డ్ శిబిరాలు నిర్మిస్తున్నట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. కరోనాకి ముందు వరకు దేశానికి ఉత్తరాన ఉన్న ఈ సరిహద్దు ప్రాంతం నుంచే చాలా మంది కిమ్ ప్రభుత్వం అరాచకాలు భరించలేక పారిపోయేవారు. ఆ సరిహద్దు ప్రాంతాన్ని మూసివేస్తూ ఉండడంతో అలా పారిపోయే వారి సంఖ్య కూడా తగ్గుతూ వస్తోంది. 2019లో అలా దక్షిణ కొరియాకి పారిపోయిన వారి సంఖ్య 1,047 ఉంటే గత ఏడాది వారి సంఖ్య 67కి తగ్గిపోయింది. అయితే ఈ గోడ నిర్మాణంతో చైనాతో వాణిజ్య సంబంధాలపై కూడా ప్రభావం పడింది.

ఇలలో ఇంద్రభవనం



కొత్త పార్లమెంటు ఇంద్రభవనాన్ని తలపిస్తోంది. మిర్జాపూర్ కార్పెట్లు, నాగపూర్ టేక్ వుడ్, త్రిపుర వెదురు ఫ్లోరింగ్, రాజస్తాన్ శిల్పకళాకృతులతో మన దేశ ప్రత్యేకత అయిన భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ధగధగలాడిపోతోంది. ఏక్ భారత్ శ్రేష్ఠభారత్ అన్న ప్రధాని మోదీ నినాదం అడుగడుగునా కనిపించేలా వివిధ రాష్ట్రాల్లో పేరు పొందిన సామగ్రితో భవన నిర్మాణం జరిగింది. కలర్స్ ఆఫ్ ఇండియాను తలపించేలా కలర్ ఫుల్ గా ఉన్న పార్లమెంట్ భవన విశేషాలు..

– సాక్షి, నేషనల్ డెస్క్

- పార్లమెంటు భవన నిర్మాణంలో వినియోగించిన ఎరుపు, తెలుపు శాండ్ స్టోన్‌ను రాజస్థాన్‌లోని సర్‌మథుర నుంచి తెచ్చారు. ఢిల్లీలోని ఎర్రకోట, హుమాయూన్ సమాధి ఈ రాతితో చేసిన నిర్మాణాలే.
- భవన నిర్మాణంలో తలుపులు, కిటికీలకు వాడిన టేకు చెక్కని మహారాష్ట్ర నాగపూర్ నుంచి తెప్పించారు.
- రాజస్తాన్ ఉదయపూర్ నుంచి కెషారియా గ్రీన్ స్టోన్, అజ్మీర్ సమీపంలోని లఖ నుంచి రెడ్ గ్రానైట్, అంబాజీ నుంచి తెల్ల పాలరాయిని వాడారు
- పార్లమెంటులో అమర్చిన కళ్లు చెదిరే ఫర్నిచర్‌ను ముంబైలో చేయించారు.
- లోక్‌సభ, రాజ్యసభ ఫాల్స్ సీలింగ్‌లో వాడిన ఉక్కుని కేంద్ర పాలిత ప్రాంతమైన డామన్, డయ్యూ నుంచి ప్రత్యేకంగా తెప్పించారు.
- భవనంలోకి సహజంగా గాలి వెలుతురు వచ్చేలా ఉత్తరప్రదేశ్ లోని నోయిడా, రాజస్థాన్ రాజ్‌నగర్ నుంచి జాలీల రాయిని తెప్పించి వేయించారు
- లోక్‌సభ, రాజ్యసభ చాంబర్‌లలో అశోక చక్రం డిజైన్ ఆకృతి అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, రాజస్తాన్ జైపూర్ నుంచి ఈ డిజైన్ రూపొందించడానికి కావాల్సిన సామాగ్రిని తీసుకువచ్చారు.
- శిల్ప కళాకృతుల్ని రూపొందించడానికి ఉదయ్‌పూర్ నుంచి వచ్చిన శిల్పులు రేయింబవళ్లు శ్రమించారు.
- అహ్మదాబాద్ ఇత్తడిని వాడారు.
- త్రిపుర రాష్ట్రంలో లభించే అరుదైన వెదురుతో తయారు చేసిన ఫ్లోరింగ్‌పై యూపీలోని మిర్జాపూర్‌లో తయారు చేసిన కార్పెట్లను పరిచారు.
- సనాతన సంప్రదాయాలు ఉట్టిపడేలా, వాస్తు శాస్త్రాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని దేశంలో వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన 5 వేల కళాకృతులైన బొమ్మలు, పెయింటింగ్‌లు, కొన్ని ఫోటోలను ఏర్పాటుచేశారు.

రెండు భవనాలకి ఎంత తేడా..!

1 పాత భవనంలో లోక్‌సభ సభ్యులు 543 మంది రాజ్యసభలో 250 మంది కూర్చొనే సదుపాయం ఉంది. అదే కొత్త భవనంలో సామర్థ్యాన్ని బాగా పెంచారు. లోక్‌సభలో 888 మందికి రాజ్యసభలో 300 మందికి సీట్లు ఏర్పాటు చేశారు.

2 బ్రిటిష్ ఆర్కిటెక్ట్ సర్ ఎడ్విన్ ల్యుటెన్స్, హెర్బర్ట్ బేకర్ పాత భవనం డిజైన్ చేస్తే, కొత్త పార్లమెంటు భవనాన్ని అహ్మదాబాద్‌కు చెందిన హెచ్‌సీపీ డిజైన్ ఆధునికంగా రూపొందించింది. ప్రముఖ ఆర్కిటెక్ట్ బిమల్ పటేల్ పర్యవేక్షణలో డిజైన్ రూపొందించారు.

3 పాత భవనం గుండ్రంగా ఉంటూ 24, 281 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తే, కొత్త భవనాన్ని త్రిభుజాకారంలో 64,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించారు.

4 పాత భవనం నిర్మాణం రెండు అంతస్తుల్లో ఉంటే, కొత్తది 4 అంతస్తుల్లో నిర్మించారు.

5 పాత నిర్మాణానికి ఆరేళ్లు పడితే కొత్త భవనాన్ని రెండున్నర ఏళ్లలో నిర్మించారు.

6 1927లో ప్రారంభోత్సవం జరుపుకున్న పాత భవనానికి అప్పట్లోనే రూ.85 లక్షలైతే , కొత్త భవనానికి వెయ్యి కోట్ల వరకు ఖర్చు అయింది.

7 పాత భవనంలో ఉభయ సభల సంయుక్త సమావేశాల కోసం సెంట్రల్ హాలులో నిర్మిస్తే, కొత్త భవనంలో లోక్‌సభ చాంబర్‌నే ఉభయ సభల సభ్యులు ఒకేసారి కూర్చొనేలా ఎక్కువ సీట్లతో సిద్ధంచేశారు.

8 పార్లమెంటు పాత భవనంలో అగ్ని ప్రమాద నిరోధక వ్యవస్థ అత్యంత ఆందోళనకరంగా ఉండేది. కొత్త భవనంలో అత్యంత ఆధునిక వ్యవస్థలన్నీ ఒక ప్రణాళిక ప్రకారం అమర్చారు. అందుబాటులో ఉన్న డిజిటల్ టెక్నాలజీ ఉపయోగించి సీసీటీవీ, ఆడియో వీడియో వ్యవస్థ, ఓటింగ్‌కు బయోమెట్రిక్ వ్యవస్థ, ట్రాన్స్‌లేషన్ వ్యవస్థలు, ప్రోగ్రామబుల్ మైక్రోఫోన్స్, రీసౌండ్‌లు వినిపించకుండా వర్చువల్ సౌండ్ సిస్టమ్ వంటివన్నీ ఏర్పాటు చేశారు. భూకంపాలు వస్తే తట్టుకునే వ్యవస్థ ఏర్పాటు చేశారు. 150 ఏళ్లు చెక్కు చెదరకుండా ఉండేలా భవన నిర్మాణం సాగింది.

దేశ ఎదుగుదలకు దన్నుగా నిలుస్తుంది

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య దేవాలయమైన నూతన పార్లమెంట్ దేశ ఎదుగుదలకు ఊతంగా నిలబడుతుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. నూతన భవంతి ప్రారంభోత్సవం ఆదివారం జరగనున్న నేపథ్యంలో శనివారం ఆయన పలు ట్వీట్లు చేశారు. 'దేశ పురోగమన పథాన్ని ఈ ప్రజాస్వామ్య ఆలయం మరింత పటిష్టపరుస్తుంది. కోట్లాది ప్రజల సాధికారతకు బాటలుపరుస్తుంది. 'నా పార్లమెంట్ నాకు గౌరవం' హ్యాష్‌ట్యాగ్‌తో మీరు ఉద్వేగంతో వ్యక్తీకరించిన అభిప్రాయాలు.. పౌరుల ఆకాంక్షల సాధన దీక్షను నూతన భవనం మరింత నిష్ఠతో కొనసాగిస్తుందన్న స్ఫూర్తిని చాటుతున్నాయి' అని ట్వీట్‌చేశారు. మైపార్లమెంట్‌మైప్రైడ్ హ్యాష్‌ట్యాగ్‌పై ప్రజలు చేసిన పలు ట్వీట్లను మోదీ రీట్వీట్‌చేశారు. కొత్త భవన విశేషాలను క్లుప్తంగా తెలిపే వీడియోను, తమ అభిప్రాయాలతో ప్రజలంతా షేర్ చేయాలని ఈ సందర్భంగా మోదీ మరోసారి కోరారు. ఈ వీడియోను మోదీ శుక్రవారం షేర్‌చేసిన విషయం విదితమే.

రెండేళ్ల చిన్నారికి జీవిత ఖైదు

- ఉ.కొరియాలో అరాచక పరిస్థితులు
- అమెరికా విదేశాంగ శాఖ నివేదిక



వాషింగ్టన్: ఉత్తర కొరియాలోని కిమ్ జోంగ్ ఉన్ ప్రభుత్వం క్రైస్తవులపై ఉక్కుపాదం మోపుతోందని, వారి హక్కులను కాలరాస్తోందని అమెరికా విదేశాంగ శాఖ ఆరోపించింది. పవిత్ర మతగ్రంథమైన బైబిల్‌తో కనిపించిన క్రైస్తవులు మరణ శిక్షను ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. పిల్లలతో సహా వారి కుటుంబ సభ్యులకు జీవిత ఖైదు విధిస్తున్నారని తెలియజేసింది. బైబిల్‌తో కనిపించినందుకు, మతపరమైన కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు తల్లిదండ్రులతోపాటు వారి రెండేళ్ల బాలుడిని అరెస్టు చేసి, 2009లో జీవిత ఖైదు విధించారని పేర్కొంది. ఈ మేరకు 'అంతర్జాతీయ మత స్వేచ్ఛ–2022' పేరిట తాజాగా ఒక నివేదికను అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసింది. ఇతర మతాలను అనుసరించేవారి పట్ల కిమ్ జోంగ్ ఉన్ ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తోందని ఆరోపించింది. ఇప్పటిదాకా ఇతర మతాలకు చెందిన వారితోపాటు 70,000 మంది క్రైస్తవులను అరెస్ట్ చేసినట్లు నివేదికలో ప్రస్తావించింది. నియంత ప్రభుత్వం ఖైదీలపై మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. 'కొరియా ఫ్యూచర్' అనే స్వచ్ఛంద సంస్థ 2021 డిసెంబర్‌లో ఓ నివేదిక విడుదల చేసింది. ఉత్తర కొరియాలో మత స్వేచ్ఛను కోరుకొనేవారు తీవ్రస్థాయిలో వేధింపులు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది.

సుస్థిర ప్రభుత్వంతో సఫలత సాధ్యం

న్యూఢిల్లీ: ప్రజలు సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం వల్లే వారికిచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నెరవేర్చగలిగిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చి శుక్రవారంతో తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చిన అభినందనపై ఆయన స్పందించారు. ' పౌరులు సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం వల్లే ప్రజలకు మేం ఇచ్చిన కీలకమైన హామీల సాధన సాధ్యమైంది. ఈ ట్వీట్ల ద్వారా మీరు చూపించే ఆదరణ ప్రజల కోసం మరింత శ్రమించేందుకు కావాల్సిన స్థైర్యాన్ని నాకు అందిస్తోంది. గత తొమ్మిదేళ్లలో విస్తృతంగా క్షేత్రస్థాయిలో పనిచేశాం. ఈ అమృతకాలంలో మరింత పటిష్ట, సుసంపన్నమైన భారతావనిని ఆవిష్కరిస్తాం. మీ సాటిలేని మద్దతే మా శక్తిసామర్థ్యాలకు ఆధారం' అని మోదీ ట్వీట్‌చేశారు.

నేడే ప్రజాస్వామ్య సౌధం ప్రారంభం

- తెల్లవారుజామున యాగం, పూజలు, ప్రార్థనలతో శ్రీకారం
- హాజరు కానున్న పలువురు ప్రముఖులు, 25 పార్టీల నేతలు
- ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన 20 విపక్షాలు

న్యూఢిల్లీ: దేశ ప్రజలందరికీ గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా అభివర్ణించిన పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ప్రజాస్వామ్య సౌధాన్ని ఆదివారం ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించనున్నారు. షెడ్యూల్ ప్రకారం తెల్లవారుజాము నుంచే యాగం, పూజలు, ప్రార్థనలతో ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టనున్నారు. కేంద్ర మంత్రులు, ఎంపీలు, వివిధ పార్టీల నేతలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఆహ్వానించనందుకు నిరసనగా పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవాన్ని తాము బహిష్కరిస్తున్నట్లు 20 విపక్ష పార్టీలు ఇప్పటికే ప్రకటించారు. ఇదిలా ఉండగా, 25 పార్టీల నాయకులు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించుకోవడానికి దేశ ప్రజలంతా ఒక్కటై, చేతులు కలిపిన తీరు అసలు సిసలైన 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అధికార వర్గాలు వెల్లడించాయి.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభోత్సవం నేపథ్యంలో లుటెన్స్ ఢిల్లీ ప్రాంతంలో అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పార్లమెంట్ చుట్టుపక్కల ఏరియాలను పోలీసుల తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అదనపు బలగాలను మోహరించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా నిఘా కొనసాగిస్తున్నారు. సెంట్రల్ ఢిల్లీలో ప్రత్యేకంగా పికెట్లు ఏర్పాటు చేశారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్‌తో కొత్త భవనం వద్ద ధర్నా చేస్తామని మహిళా రెజ్లర్లు ప్రకటించగా, అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు.

అధీనం మఠం పెద్దలతో మోదీ భేటీ

ప్రధాని మోదీ శనివారం తన నివాసంలో అధీనం మఠం పెద్దలతో సమావేశమయ్యారు. వారు ఆయనకు ఆశీస్సులు అందించారు. సెంగోల్‌తోపాటు కొన్ని బహుమతులు అందజేశారు. అనంతరం మోదీ వారిని సత్కరించారు. పార్లమెంట్ భవన ప్రారంభోత్సవంలో పాల్గొనడానికి అధీనం మఠం పెద్దలు, ప్రతినిధులు తమిళనాడు నుంచి శనివారం ఉదయమే ఢిల్లీకి చేరుకున్నారు.

ప్రతి శకంలో భారత జాతీయవాదానికి తమిళనాడు కేంద్రంగా నిలిచిందని ప్రధాని మోదీ తెలిపారు. దేశ స్వాతంత్య్ర పోరాటంలో తమిళనాడు ప్రజల భాగస్వామ్యానికి తగిన గుర్తింపు దక్కకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత సెంగోల్‌కు గౌరవం దక్కాల్సి ఉండగా, దాన్నొక 'వాకింగ్ స్టిక్'గా ప్రయాగ్‌రాజ్‌లోని ఆనంద్ భవన్‌లో మూలన పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మన ప్రభుత్వం దాన్ని ఆనంద్ భవన్ నుంచి బయటకు తీసుకువచ్చిందన్నారు. దేశ మహోన్నత సంప్రదాయానికి ప్రతీక అయిన సెంగోల్‌ను పార్లమెంట్ నూతన భవనంలో ప్రతిష్టిస్తుండడం సంతోషకరమని ప్రధాని మోదీ చెప్పారు.

హాజరయ్యే పార్టీలు, ఉభయ సభల్లో వాటి ఎంపీల సంఖ్య

ఎన్డీయే పార్టీలు

1. బీజేపీ (394)
2. శివసేన (15)
3. నేషనలిస్టు పీపుల్స్ పార్టీ – మేఘాలయా(2)
4. నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(1)
5. సిక్కిం క్రాంతికారీ మోర్చా(1)
6. జననాయక్ జనతా పార్టీ
7. ఏఐఏడీఎంకే(5)
8. ఐఎంకేఎంకే
9. ఏజేఎస్‌యూ(1)
10. ఆర్‌పీఐ–అథవాలే(1)
11. మిజో నేషనల్ ఫ్రంట్(2)
12. తమిళ మానిల కాంగ్రెస్(1)
13. ఐటీఎఫ్‌టీ–త్రిపుర
14. బోడో పీపుల్స్ పార్టీ
15. పీఎంకే(1)
16. మహారాష్ట్రవాదీ గోమంతక్ పార్టీ
17. అప్నా దళ్(2)
18. అస్సాం గణపరిషత్ (1)

నాన్‌–ఎన్డీయే పార్టీలు

1. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (31)
2. తెలుగుదేశం పార్టీ(4)
3. లోక్ జనశక్తి పార్టీ– రామ్ విలాస్ పాశ్వాన్(1)
4. బిజూ జనతాదళ్(21)
5. బీఎస్పీ(10)

గైర్హాజరయ్యే పార్టీలు

1. కాంగ్రెస్ (81)
2. డీఎంకే (34)
3. శివసేన–యూబీటీ(7)
4. ఆమ్ ఆద్మీ పార్టీ (11)
5. సమాజ్‌వాదీ పార్టీ (6)
6. సీపీఐ (4)
7. జేఎంఎం (2)
8. కేరళ కాంగ్రెస్–మణి(2)
9. విడుదలై చిరుతైగళ్ కట్చీ(1)
10. రాష్ట్రీయ లోక్‌దళ్ (1)
11. తృణమూల్ కాంగ్రెస్ (35)
12. జేడీ–యూ (21)
13. ఎన్సీపీ (9)
14. సీపీఎం (8)
15. ఆర్జేడీ (6)
16. ఐయూఎంఎల్ (4)
17. నేషనల్ కాన్ఫరెన్స్ (3)
18. ఆర్ఎస్పీ (1)
19. ఎండీఎంకే (1)
20. ఎంఐఎం (2)

రేబిస్‌తో ఉన్మాదిగా మారి చంపి తిన్నాడు!

జైపూర్: రాజస్తాన్‌లో ఒళ్లు జలదరించే ఘటన ఒకటి చోటుచేసుకుంది. ఉన్మాదిగా మారిన ఓ వ్యక్తి వృద్ధురాలిని చంపి, ఆమె మాంసం తిన్నాడు. ముంబైలో ఉండే సురేంద్ర ఠాకూర్(24) ఇటీవలే తన సొంత పాలి జిల్లా సెంద్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని సరధనా గ్రామానికి వచ్చాడు. పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తున్న అతడు శుక్రవారం పొలంలో పశువులు మేపుకుంటూ ఉన్న శాంతిదేవి(65)ని బండరాయితో మోది చంపేశాడు. అనంతరం ఆమె మాంసం తిన్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతడిని అతికష్టమ్మీద పట్టుకుని పోలీసులకు అప్పగించారు. హత్య, నరమాంసభక్షణ నేరం కింద పోలీసులు కేసు పెట్టారు. ఠాకూర్‌ను ఆస్పత్రిలో చేర్పించారు. రేబిస్ వ్యాధి(హైడ్రోఫోబియా) బాధితుల్లో వ్యాధి ముదిరితే చివరి దశలో ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయని వైద్యులు తెలిపారు.

లిక్కర్ స్కాంలో సీబీఐ సప్లిమెంటరీ చార్జిషీట్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో సీబీఐ వేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌పై శనివారం రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ విచారించారు. సీబీఐ అభియోగాలు మోపిన మనీష్ సిసోడియా, ఆడిటర్ బుచ్చిబాబు, అర్జున్ పాండే, అమన్‌దీప్‌లకు సమన్లు జారీ చేస్తూ తదుపరి విచారణను జూన్ 2కు వాయిదా వేశారు. ఈ సప్లిమెంటరీ చార్జిషీట్‌లో సౌత్‌గ్రూప్ ప్రస్తావన వచ్చినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేరు ఎక్కడా ప్రస్తావించలేదు. అయితే మద్యం విధానం రూపకల్పనలో ఆడిటర్ బుచ్చిబాబు కీలక పాత్ర పోషించారని సీబీఐ పేర్కొంది.

'నెహ్రూ వారసత్వం దీపస్తంభం వంటిది'



న్యూఢిల్లీ: మాజీ ప్రధాని నెహ్రూ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఘనంగా నివాళులర్పించారు. నెహ్రూ వారసత్వం దీపస్తంభంలా నిలిచిపోతుందని, భారతదేశ ఆదర్శం, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలను ప్రకాశింప జేస్తుందని రాహుల్ పేర్కొన్నారు. నెహ్రూ దూరదృష్టి, విలువలు ఎల్లప్పుడూ మనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయని ట్వీట్ చేశారు. కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, రాహుల్ తదితరులు శనివారం శాంతివన్‌లోని నెహ్రూ స్మారకాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. 'మన మాజీ ప్రధాని నెహ్రూకు వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నా'అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ

కొత్తగా 24 మంది ప్రమాణ స్వీకారం



బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం తన మంత్రివర్గాన్ని విస్తరించారు. మరో 24 మందిని కేబినెట్‌లో చేర్చుకున్నారు. ముగ్గురు కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు ఉండగా, లక్ష్మీ హెబ్బాల్కర్‌కు మాత్రమే స్థానం కల్పించారు. కాంగ్రెస్ టికెట్‌పై తొలిసారిగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైనవారిలో తొమ్మిది మందికి మంత్రి పదవులు దక్కడం విశేషం. నూతన మంత్రులతో రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గహ్లోత్ రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. 24 మంది ప్రమాణ స్వీకారంతో రాష్ట్రంలోని మొత్తం 34 మంత్రి పదవులు భర్తీ అయ్యాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సహా 10 మంది ఈ నెల 20న మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. 8 మంది లింగాయత్‌లకు, ఐదుగురు ఒక్కళిగలకు, 9 మంది ఎస్సీలకు అవకాశం కల్పించారు.

రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్
- ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి
- నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ: భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలని, ఈ లక్ష్య సాధన కోసం ఒక ఉమ్మడి ప్రణాళిక సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఒక బృందంగా కలిసి పనిచేయాలన్నారు. రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో 'నీతి ఆయోగ్' ఎనిమిదో గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. ఇక ఉమ్మడి దార్శనికత(విజన్) అవసరమని అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రాంతాల అభివృద్ధికి, సామాజిక మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్రాలు 'గతి శక్తి పోర్టల్'ను ఉపయోగించాలని చెప్పారు. 'వికసిత్ భారత్' సాధనకు సుపరిపాలన కీలకమని వివరించారు.

కీలక అంశాలపై చర్చ

దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యంగా ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, అస్సాం, జార్ఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల ముఖ్యమంత్రులతోపాటు కేంద్ర మంత్రులు అమిత్ షా తదితరులు హాజరయ్యారు. నీతి ఆయోగ్ సమావేశానికి తెలంగాణ, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, తమిళనాడు, బిహార్, రాజస్తాన్ తదితర రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకాలేదు. ఈ భేటీకి 19 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 6 కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు హాజరయ్యారని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.

కొందరు సీఎంల తీరు ప్రజా వ్యతిరేకం: బీజేపీ

నీతి ఆయోగ్ సమావేశానికి కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కాకపోవడాన్ని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తప్పుపట్టారు. వారి నిర్ణయం ప్రజా వ్యతిరేకం, బాధ్యతారహితం అని విమర్శించారు. దేశ అభివృద్ధికి రోడ్డు మ్యాప్ రూపొందించడంలో నీతి ఆయోగ్ పాత్ర కీలకమని గుర్తుచేశారు. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరయ్యారని ఆక్షేపించారు. 100 కీలక అంశాలపై చర్చించే గవర్నింగ్ కౌన్సిల్ భేటీకి ముఖ్యమంత్రులు రాకపోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. దీనివల్ల వారు తమ రాష్ట్రాల వాణిని వినిపించే అవకాశం కోల్పోయారని తెలిపారు. ప్రధాని మోదీని ఇంకెంత కాలం ద్వేషిస్తారని రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. మోదీని ద్వేషించడానికి ఇంకా చాలా అవకాశాలు వస్తాయని, మరి ప్రజలకెందుకు అన్యాయం చేస్తున్నారని నిలదీశారు.

అమెరికాలో దీపావళి సెలవు!

వాషింగ్టన్: వెలుగుల పండుగ అయిన దీపావళి రోజున సెలవుదినంగా ప్రకటించాలంటూ చట్టసభ సభ్యురాలు గ్రేస్ మెంగ్ అమెరికా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టారు. ఒకవేళ ఈ 'దీపావళి డే ' బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొంది దేశాధ్యక్షుడు సంతకం చేస్తే దేశంలో దీపావళి రోజున 12వ జాతీయ సెలవుదినంగా పాటించనున్నారు. ' విశ్వవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలకు దీపావళి అనేది ఏడాదిలో అత్యంత ముఖ్యమైన రోజుల్లో ఒకటి. ఈ రోజును సెలవుదినంగా ప్రకటిస్తే వారందరు సంతోషంగా పండగ చేసుకునే అవకాశం దక్కుతుంది. సెలవు ఇవ్వడమనేది దేశంలోని సాంస్కృతిక వైవిధ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు దర్పణం పడుతుంది' అని మెంగ్ అన్నారు. 'దీపావళి జరుపుకునే అమెరికన్లకు చెప్పేదొకటే. అమెరికా ప్రభుత్వం మీ ఆకాంక్షను తీరుస్తుంది' అని న్యూయార్క్ అసెంబ్లీలో సభ్యురాలు జెన్నిఫర్ రాజ్‌కుమార్ వ్యాఖ్యానించారు.

నేపాల్ నుంచి భారత్‌కు విద్యుత్ ఎగుమతి

కఠ్మాండు: నేపాల్ నుంచి భారత్‌కు విద్యుత్ ఎగుమతి మొదలైంది. రుతుపవనాల రాకతో ప్రాజెక్టులు నిండి నేపాల్‌లోని జల విద్యుత్ కర్మాగారాలు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. దీంతో, 600 మెగావాట్ల మిగులు కరెంటును శనివారం నుంచి భారత్‌కు విక్రయిస్తున్నామని నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రతినిధి తెలిపారు. నేపాల్‌లో జలవిద్యుత్ ప్రాజెక్టుల ద్వారానే ఎక్కువగా కరెంటు ఉత్పత్తవుతుంది. డిమాండ్ తక్కువగా ఉండే వేసవి కాలంలో విద్యుదుత్పత్తి ఎక్కువగా ఉంటుంది. డిమాండ్ ఎక్కువగా ఉండే శీతాకాలంలో విద్యుత్ ఉత్పత్తి తగ్గుతుంది. గత ఏడాది జూన్– నవంబర్ మధ్యలో భారత్‌కు విద్యుత్ ఎగుమతి ద్వారా రూ.1,200 కోట్లను ఆర్జించింది. కొన్ని రోజుల క్రితం డిమాండ్ పెరగడంతో భారత్ నుంచి 400 మెగావాట్ల విద్యుత్‌ను నేపాల్ కొనుగోలు చేసింది.

మంచుచరియల కింద సజీవ సమాధి

గిల్గిట్: పాకిస్తాన్‌లో మంచు చరియలు విరిగి పడిన ఘటనలో చిన్నారి సహా 10 మంది సజీవ సమాధి కాగా, మరో 25 మంది గాయపడ్డారు. ఆక్రమిత కశ్మీర్‌లోని కెల్ ప్రాంతంలోని సంచార గిరిజనులు మేకలను మేపుకుంటూ పక్కనే గిల్గిట్–బల్టిస్తాన్ ప్రాంతంలోని ఎస్తోర్‌కు వెళ్లారు. శనివారం తిరిగి వస్తుండగా షౌంటర్ పాస్‌లోని చంబేరి వద్ద వారిపై మంచు చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో నలుగురు మహిళలు, నాలుగేళ్ల బాలుడు సహా 10 మంది చనిపోయారు. మరో 25 మంది వరకు గాయపడ్డారు. అననుకూల వాతావరణంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం : 28 : మే : 2023



సాహో ఛత్రపతి

ఛత్రపతి శివాజీ జయంతిని శనివారం బెళగావిలో మరాఠా సంఘాలు వైభవంగా నిర్వహించాయి. శివాజీ, యోధుల వేషాల్లో కళాకారులు

న్యూస్‌రీల్

మహిళా ఎస్‌ఐ ఇంటికి నిప్పు



ఎస్‌ఐ శోభ

యశవంతపుర: మహిళా ఎస్‌ఐ సెలవు పెట్టి ఊరికి వెళ్లగా, ఆమె ఉంటున్న అద్దె ఇంటికి ఎవరో దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటన హాసన్ జిల్లా అరకలగూడు తాలూకా కోణనూరులో జరిగింది. కోణనూరు స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్న శోభా భరెమక్కనవర్ సెలవుపై ఊరికెళ్లారు. బుధవారం రాత్రి దుండగులు ఆమె ఇంటి తలుపులను బద్దలు కొట్టి నిప్పుపెట్టారు. రూ.80 వేలు విలువగల లాప్‌టాప్, రూ.25 వేలు విలువైన డ్రెస్సింగ్ టేబుల్, రూ.60 వేలు విలువగల మంచం, రూ 50 వేలు విలువగల బట్టలు కాలిపోయాయి. శోభా సెలవు ముగించుకొని శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా మొత్తం దగ్ధమై కనిపించాయి. డీఎస్పీ మురళీధర్, సీఐ రఘుపతి పరిశీలించారు. జాగిలాలతో ఆధారాల కోసం దర్యాప్తు చేపట్టారు.

రెండు రంగుల మందారం



మండ్య: మండ్య నగరంలో ఉన్న చౌకి మఠం వద్ద నివాసముండే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నందకుమారి ఇంట్లో వివిధ రకాల పూల మొక్కలు ఉన్నాయి. ఇందులో ఒక మందారం చెట్టు రెండు రంగులు ఉన్న పూలను పూచింది. ఒకే పుష్పం సగం ఊదా, మరో సగం ఎరుపు రంగులో పూచింది. ఈ వింత పుష్పాన్ని చూడడానికి జనం ఎగబడ్డారు. నందకుమారి మాట్లాడుతూ ఆ పుష్పం చూసి ఆశ్చర్యం వేసిందని చెప్పారు.

కాంగ్రెస్ కక్ష సాధింపు: బీవై

దొడ్డబళ్లాపురం: కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ ఎమ్మెల్యే బీవై విజయేంద్ర ఆరోపించారు. శనివారం కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీజేపీ ఎమ్మెల్యే హరీష్ పూంజా, మాజీ మంత్రి అశ్వత్థనారాయణపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందన్నారు. హత్యకు గురైన ప్రవీణ్ నెట్టారు భార్యకు ఇచ్చిన ఉద్యోగాన్ని తొలగించారని అన్నారు. ఇవన్నీ కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండు చేసారు.

మేఘానికి సొబగులు



ఎవరో అలంకరించినట్లు ఎంతో అందంగా తయారైన మేఘం. శనివారం బెంగళూరు గగనవీధుల్లో కనువిందు చేసింది

మంత్రిమండలి ఫుల్

- కొత్తగా 24 మంది మంత్రుల ప్రమాణం
- ఒక్క కుర్చీ ఖాళీ లేకుండా భర్తీ
- రాజ్‌భవన్‌లో ఆర్భాటంగా కార్యక్రమం



శనివారం బెంగళూరు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న 24 మంది మంత్రులు



రాజ్‌భవన్‌లో మంత్రుల కుటుంబాలు, అనుచరుల ఆనందహేల

శివాజీనగర: సిద్దరామయ్య ప్రభుత్వంలో మరో 24 మంది మంత్రులుగా చేరారు. నాలుగురోజుల కసరత్తు తరువాత ఢిల్లీలో రాష్ట్ర నేతలు, హైకమాండ్ పెద్దలు కలిసి జాబితాను ఖరారు చేశారు. బెంగళూరు రాజ్‌భవన్‌లో శనివారం ఉదయం అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. 23 మంది ఎమ్మెల్యేలు, అలాగే అసెంబ్లీలో ఏ పదవీ లేని రాయచూరు జిల్లా నేత బోసురాజు చేత గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీ.కే. శివకుమార్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. సీఎం, డీసీఎం, మరో 32 మంది మంత్రులతో కలిసి కేబినెట్ పరిమాణం 34కి చేరింది. ఇక పూర్తిస్థాయి మంత్రి మండలి ఏర్పాటైనట్లే. కొత్తగా ఒకటి రెండు మంత్రి పదవులు ఇవ్వడానికి కూడా వీలు ఉండదు.

నూతన మంత్రులు ఎవరెవరంటే

నూతన మంత్రులుగా హెచ్.కే.పాటిల్, కృష్ణబైరేగౌడ, ఎన్.చెలువరాయస్వామి, కే.వెంకటేశ్, హెచ్.సీ.మహదేవప్ప, ఈశ్వర ఖండ్రె, కే.ఎన్.రాజణ్ణ, దినేశ్ గుండురావు, శరణ బసప్ప దర్శనాపుర, శివానంద పాటిల్, ఆర్‌బీ తిమ్మాపుర, ఎస్.ఎస్. మల్లికార్జున, శివరాజ తంగడగి, శరణ్ ప్రకాశ్ పాటిల్, మంకాళు వైద్య, లక్ష్మీ హెబ్బాళ్కర్, రహీం ఖాన్, డీ సుధాకర్, సంతోష్ లాడ్, ఎన్.ఎస్.బోసురాజు, భైరతి సురేశ్, మధు బంగారప్ప, ఎం.సీ.సుధాకర్, బీ నాగేంద్ర తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. మే 20న ముఖ్యమంత్రిగా సిద్దరామయ్య, డిప్యూటీగా డీకేశి, మరో 8 మంది మంత్రులు ప్రమాణం చేయడం తెలిసిందే.

రాజభవన్ బయట జనసందడి

రాజ్‌భవన్‌లోకి పాస్‌లు ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించగా, బయట కొత్త మంత్రుల అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కోలాహలం నెలకొంది. అనుకూల నినాదాలు మిన్నంటాయి. రాజ్‌భవన్ బయట రోడ్డులో భారీ ఎల్ఇడీ తెరను ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రసారం చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో వాహన సంచారాన్ని బంద్ చేశారు.

అసంతృప్తి లేదే: సీఎం

మంత్రి పదవి దక్కలేదని ఒక్కరు కూడా తన వద్ద అసంతృప్తిని వ్యక్తం చేయలేదని సీఎం సిద్దు అన్నారు. బీజేపీని విడిచి కాంగ్రెస్ చేరిన జగదీశ్ శెట్టర్, లక్ష్మణ సవదిలను మంత్రి మండలిలోకి చేర్చుకొంటారా అని విలేకరులు ప్రశ్నించగా, చూద్దామని సమాధానం చెప్పారు.


గ్యారంటీల అమలుపై...

బనశంకరి: మంత్రి వర్గంలో 34 స్థానాలను భర్తీ చేశామని, పాలనలో నూతన మార్పులు తీసుకురావాలని తీర్మానించామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. శనివారం విధానసౌధలో నూతన మంత్రుల ప్రమాణస్వీకారం తరువాత ఆయన విలేకరులతో మాట్లాడారు. పూర్తిస్థాయిలో మంత్రివర్గం ఏర్పాటు చేశామని, పాత, కొత్త ముఖాలకు అవకాశం కల్పించామని, కానీ మొదటిసారి గెలిచిన వారికి పదవులు ఇవ్వలేదని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు, ఐదు గ్యారంటీల గురించి మంత్రివర్గ సమావేశంలో చర్చించి ప్రవేశపెడతామని తెలిపారు. ఆ వెంటనే అమల్లోకి తీసుకువస్తామన్నారు. కొడగు, హావేరి, హాసన, చిక్కమగళూరు తదితర జిల్లాలకు కేబినెట్లో చోటు లేకపోయిందన్నారు. పుట్టరంగశెట్టి డిప్యూటీ స్పీకర్ పదవికి అంగీకరించలేదన్నారు. అసంతృప్తి ఎప్పుడూ ఉండేదే అన్నారు.



లోపలికి అనుమతించలేదని రాజ్‌భవన్ బయట రగడ

మామిడి కాయల అలంకారం



తుమకూరు: తుమకూరు జిల్లాలోని చిక్కనాయకనహళ్లి తాలూకాలోని హులియూరు సమీపంలో ప్రసిద్ధ కుప్పూరు గద్దిగె మహా సంస్థాన మఠంలో గురు మరుళసిద్దేశ్వర స్వామివారికి శనివారం మామిడి కాయలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

20 ఏళ్ల తరువాత బంగారప్ప కుటుంబానికి..

శివాజీనగర: బీసీ నేతగా గుర్తింపు పొందిన బంగారప్ప కుటుంబానికి 20 సంవత్సరాల తరువాత మళ్లీ మంత్రి మండలిలో అవకాశం దక్కింది. మాజీ ముఖ్యమంత్రి ఎస్.బంగారప్ప కుమారుడు మధు బంగారప్ప శనివారం కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సొరబ నియోజకవర్గంలో తన సోదరుడు కుమార బంగారప్పపై గెలుపొంది ఎన్నికల్లో మళ్లీ సత్తా చాటుకున్నారు. కాగా మధు బంగారప్ప, కుమార్ బంగారప్పల మధ్య సయోధ్య కోసం పెద్దల ప్రయత్నాలు ఫలించలేదు. ఏదీ ఏమైనా బంగారప్ప కుటుంబానికి 20 సంవత్సరాల తరువాత మంత్రి మండలిలో మళ్లీ అవకాశం లభించినట్లయింది.

ప్రవీణ్ నెట్టారు భార్య ఉద్యోగం తొలగింపు

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా బెళ్లారెలో హత్యకు గురైన హిందూ సంఘాల కార్యకర్త ప్రవీణ్ నెట్టార్ భార్య నూతన కుమారికి గత అక్టోబరులో అప్పటి ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఆఫీసులో కారుణ్య నియామకం కింద ఉద్యోగాన్ని ఇచ్చింది. అయితే ఇప్పుడు ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారు. ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వం ఇచ్చిన తాత్కాలిక నియమకాన్ని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆమెకు కలెక్టర్ ఆఫీసులో ప్రకృతి విపత్తుల విభాగంలో క్లర్కుగా ఉద్యోగం చేసేది. కాగా, జిల్లా కలెక్టర్ రవికుమార్ స్పందిస్తూ, ఆమెను అదే పోస్టులో కొనసాగించాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపనున్నట్లు చెప్పారు.

రైలు- ప్లాట్‌ఫారం మధ్య చిక్కి మహిళకు తీవ్రగాయాలు



చంద్రమ్మ (ఫైల్)

తుమకూరు: శనివారం ఉదయం బెంగళూరు నగరం నుంచి హుబ్లీకి వెళుతున్న జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో రైలు కదులుతుండగా మహిళా ప్రయాణికురాలు దిగబోతూ ప్లాట్‌ఫారం- రైలు మధ్యలో చిక్కుకొని తీవ్రంగా గాయపడింది. ఈ దుర్ఘటన తుమకూరు నగర రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. చంద్రమ్మ (40) అనే మహిళ బెంగళూరు నుంచి దావణగెరెకు కుటుంబంతో బయల్దేరింది. ఉదయాన్నే రైలు తుమకూరులో నిలిచినప్పుడు, పిల్లల కోసం రైలు దిగి తినుబండారాలు కొనుక్కుని రైలు ఎక్కింది. అప్పటికే రైలు నెమ్మదిగా కదిలింది అయితే ప్లాట్‌ఫారం మీద ఎవరో పిల్లలు వెళుతుంటే వారు తన పిల్లలేమోనని ఆమె కంగారు పడింది. వారిని పిలుచుకుని రావాలని రైలు దిగబోతూ జారి పడడంతో రైలు- ప్లాట్‌ఫారం మధ్య చిక్కుకుపోయింది. రైలు అలాగే ముందుకు వెళ్లడంతో ఆమె కాళ్లు తెగి పడ్డాయి. జనం గట్టిగా కేకలు వేయడంతో రైలును నిలిపివేసి పోలీసులు, అధికారులు ఆమెను బయటకు తీసి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బస్సులో కీచకుడు.. అరెస్టు

యశవంతపుర: బస్‌లో ముందు సీట్లో కూర్చున్న మహిళ జడను లాగిన కీచకుడు కటకటాల పాలయ్యాడు. మంగళూరు-ధర్మస్థల మార్గంలోని తిరిగే కేఎస్ ఆర్‌టీసీ బస్‌లో హమీద్ అనే వ్యక్తి ముందు సీట్లో కూర్చున్న మహిళ జడను లాగాడు. కొందరు ప్రయాణికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వీడియో వైరల్ కాగానే హిందూ జాగరణ వేదిక కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలించి, బంట్వాళ తాలూకా నావూరకి చెందిన హమీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జాగరణ వేదిక నాయకులు డిమాండ్ చేశారు.

అటు సంబరం.. ఇటు ఆగ్రహం

- మంత్రి పదవి రాలేదని భగ్గు
- పలువురు ఎమ్మెల్యేల అసంతృప్తి



చామరాజనగరలో పుట్టరంగ శెట్టి మద్దతుదారుల ధర్నా

బనశంకరి: మంత్రి పదవులు వచ్చినవారి నియోజకవర్గాల్లో సంబరాలు జరిగితే, దక్కని ఎమ్మెల్యేల్లో అసమ్మతి చెలరేగింది. రేసులో ఉన్న నేతల మద్దతుదారులు చామరాజనగర, బెంగళూరు, మైసూరు, హావేరి జిల్లాల్లో ధర్నాలకు దిగారు. మంత్రి పదవులు కావాలని గట్టిగా పట్టుబట్టినవారిలో 70 మంది దాకా ఉండగా, వారిలో చాలామంది ఢిల్లీకి వెళ్లి లాబీయింగ్ చేశారు. కానీ లిస్టులో మాత్రం లేకపోయింది. మైసూరులో తన్వీర్‌సేఠ్ మద్దతుదారులు, బెంగళూరు విజయనగర ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప మద్దతుదారులు, హావేరిలో ఎమ్మెల్యే రుద్రప్ప లమాణి అనుచరులు శనివారం ధర్నాలకు దిగారు.

ఆరుసార్లు గెలిస్తే ఇవ్వరా?

- 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తన్వీర్‌సేఠ్‌కు మంత్రి పదవి రాలేదంటూ మైసూరు గాంధీ సర్కిల్‌లో ఆయన ఫొటోలను పట్టుకుని అనుచరులు బైఠాయించారు. సిద్దరామయ్య ఆప్తునిగా ఉన్న తన్వీర్ గతంలో ప్రాథమిక విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఈసారి పదవి తప్పదనుకుంటే, తారుమారైంది. అంతేగాక రాజ్‌భవన్‌లో ప్రమాణ వేడుకకు కూడా ఆయన హాజరు కాలేదు.
- లంబాణీ సముదాయానికి చెందిన రుద్రప్ప లమాణి తనకు పదవి రాలేదని అసమాధానం వ్యక్తం చేశారు.
- ఇక సీనియర్ నేత, ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ పరిస్థితి అలాగే ఉంది. చివరిక్షణంలో మంత్రి వర్గం నుంచి పేరు తప్పించారని, సీఎం, డీసీఎంల వర్గ రాజకీయాల వల్ల తనకు మంత్రి పదవి దక్కలేదని వాపోయినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ఆప్తుల వద్ద తెలిపినట్లు సమాచారం.
- కేపీసీసీ కార్యాధ్యక్షునిగా ఉన్న సలీం అహ్మద్ మంత్రి పదవిపై ఆశపెట్టుకోగా అవకాశం లభించలేదు. వినయ్ కులకర్ణి, టీబీ జయచంద్రతో పాటు చాలామంది సీనియర్లు తలోరకంగా అసంతృప్తిని వెళ్లగక్కారు.

పదవి రాకపోతే నేనేం చేయాలి: డీకే

పదవులు రాలేదని అసమాధానానికి గురైతే నేనేం చేయాలని డిప్యూటీ సీఎం డీకేశి ప్రశ్నించారు. అసమ్మతి గురించి విలేకరులు ఆయనను అడగగా, అనేకసార్లు తనకు కూడా ధరంసింగ్, సిద్దరామయ్య మంత్రిమండలిలో చోటు దక్కలేదని, కానీ సహనంతో వేచి చూశానని చెప్పారు. పదవి రాకపోతే నేనేం చేయాలి, మాట్లాడేవారు మాట్లాడాలి నేను మాట్లాడనని అన్నారు.

శాఖపై రామలింగారెడ్డి అలక?

పదవులు రాలేదని కొందరు, తమకు నచ్చిన శాఖ ఇవ్వలేదని మరికొందరు అలిగినట్లు సమాచారం. సీనియర్‌మంత్రి రామలింగారెడ్డికి రవాణా శాఖను కేటాయించగా, ఆయన తనను అవమానించేలా ఈ శాఖను ఇచ్చారని వాపోయినట్లు తెలిసింది. గతంలో నాలుగేళ్లకు పైగా రవాణాశాఖామంత్రిగా పని చేశానని, హోంమంత్రిగా పనిచేసిన తనకు కీలకశాఖ కేటాయించాలని కానీ రవాణాశాఖ ఇవ్వడం ఏమిటని అన్నట్లు సమాచారం. జూనియర్లకు ముఖ్యమైన శాఖలను ఇచ్చి, నాకు రవాణా శాఖ ఇవ్వడం సరికాదని చెప్పినట్లు తెలిసింది.

రాజ్‌భవన్ ముందు నిరసన

శివాజీనగర: మంత్రి పదవులు రాని కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో అనేకమంది ఆగ్రహానికి లోనయ్యారు. విజయనగర ఎమ్మెల్యే ఎం.కృష్ణప్పకు మంత్రి పదవి రాకపోవడంతో మద్దతుదారులు రాజభవన్ వద్ద చేరుకొని తమ డిమాండ్ పరిష్కరించాలని కోరారు. రాజభవన్ వద్ద చేరుకొన్న కృష్ణప్ప, ప్రియాకృష్ణ మద్దతుదారులు పోస్టర్లు పట్టుకొని నినాదాలు చేసి అసంతృప్తిని వ్యక్తం చేశారు. గోవిందరాజనగరలో ఆయన తనయుడు ప్రియాకృష్ణ కూడా ఎమ్మెల్యేగా గెలిచారు. ఇద్దరిలో ఒక్కరికైనా మంత్రి పదవి ఇవ్వాల్సిందని అనుచరులు వాపోయారు. వారే కాకుండా పెద్దసంఖ్యలో నేతలు అసంతృప్తిని అణచుకుని మౌనంగా ఉన్నారు.

కాఫీ తోటలో కరెంటు షాక్‌తో..



ఏనుగు కళేబరం

మైసూరు: రాష్ట్రంలో ఏనుగుల మరణాలు కొనసాగుతున్నాయి. ఇటీవల చామరాజనగర జిల్లాలో ఒకటి, కొడగు జిల్లాలో రెండు గజరాజులు మృత్యువాత పడ్డాయి. మళ్లీ ఇప్పుడు కొడగులోని కుట్టద వద్ద కరెంటు షాక్ తగిలి ఏనుగు కన్నుమూసింది. పొన్నంపేట తాలూకాలోని కుట్ట గ్రామానికి దగ్గర ఉన్న కుట్ట-నాగరహొళె రోడ్డులోని కాళి గుడి వద్ద కాఫీ తోటలో ఆహారం వెతుక్కుంటూ ఒక ఏనుగు చొరబబడింది. అక్కడ ఉన్న 11 కెవి కరెంటు లైన్ వైర్లు తగలడంతో అది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

కాంగ్రెస్ గ్యారెంటీలకు నెల గడువు

యశవంతపుర: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెలరోజుల్లో అమలు చేయకుంటే ఆందోళనలు చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నళిన్‌కుమార్ కటీల్ హెచ్చరించారు. శనివారం ఆయన మంగళూరులో విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎలా పోరాటం చేయాలనేదిపై స్పష్టత ఉందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 24 గంటల్లో అమలు చేస్తామని సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు హామీలు ఇచ్చి, ఇప్పుడు షరతులు వర్తిస్తాయి అని చెప్పటం సరికాదన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలపై ద్వేష రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. దక్షిణ కన్నడ జిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.

నెహ్రూ అందరికీ స్ఫూర్తి: సీఎం

శివాజీనగర: సమాజంలో శాంతి, సామరస్యతకు భంగం కలిగించే ఏ సంఘంపైనా అయినా కఠిన చర్యలు తీసుకొంటామని సీఎం సిద్దరామయ్య అన్నారు. శనివారం ధానసౌధ ఆవరణలో దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 59వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో సిద్దు.. నెహ్రూ త్యాగాలు, జీవితం అందరికీ స్ఫూర్తి అని కొనియాడారు. సంఘ పరివార నిషేధం గురించి ప్రభుత్వం చెప్పలేదని అన్నారు.

రైస్ పుల్లింగ్ చెంబు రూ.2 కోట్లని..

- రియల్టర్‌కు టోపీకి యత్నం

చింతామణి: మహిమ గల రైస్ పుల్లింగ్ చెంబును రూ. 2 కోట్లకు విక్రయిస్తామని ఓ ముఠా మోసానికి పాల్పడుతూ దొరికిపోయింది. ఈ ఘటన చిక్కబళ్లాపుర జిల్లా చింతామణి తాలూకా రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని కై వారంలో చోటుచేసుకొంది. వివరాలు... హైదరాబాద్‌కు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి చక్కా సురేంద్రకుమార్, అతని స్నేహితులకు గుంటూరు జిల్లాకు చెందిన కరీముల్లా ఫోన్‌చేసి చింతామణి తాలూకాలోని ఆనూరు గ్రామానికి చెందిన వెంకటచలపతి, లక్ష్మప్ప వద్ద రైస్ పుల్లింగ్ చెంబు ఉందని, రూ. 2 కోట్లు ఖరీదు అని, అది ఉంటే ధనప్రాప్తి కలుగుతుందని నమ్మించాడు. బెంగళూరులోని పాదరాయనపుర ప్రాంతానికి చెందిన ఫయాజ్ పాషా, జాఫర్‌లు మిమ్మల్ని లక్ష్మప్ప వద్దకు తీసుకెళ్తారని చెప్పాడు. సరేనని సురేంద్రకుమార్, అతని మిత్రులు కైవారకు వచ్చారు. ఫయాజ్, జాఫర్‌లు కలిసి వారి నుంచి రూ. 5 వేలు అడ్వాన్స్ తీసుకుని ఆ చెంబును చూపించారు. దాంతో రైస్ పుల్లింగ్ చేయాలని సురేంద్రకుమార్ కోరగా, చేయలేకపోయారు. దీంతో తమ అడ్వాన్స్‌ను తిరిగి వ్వాలని కోరడంతో సురేంద్రకుమార్‌పై దాడికి యతి్నంచారు. ఎలాగో తప్పించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.



మైసూరులో జరిగిన కాలేజ్ ఫెస్ట్‌లో జోరుగా ఆలాపన

వర్షమా.. వచ్చిపోవే





వర్షాకాలం పతాకస్థాయికి చేరగా రాష్ట్రంలో ప్రధాన జలాశయాలన్నీ వట్టిపోయాయి. బెళగావి ఎంకే హుబ్లీ వద్ద మలప్రభ నది ఎండిన చిత్రం, అలాగే బాగల్‌కోట వద్ద రాళ్లు, ఇసుక తేలిన మలప్రభ నది

క్లుప్తంగా

జవహర్‌లాల్ నెహ్రూ సేవలు అమోఘం



చిత్రపటానికి పూలమాల వేసిన నాయకులు

రాయచూరు రూరల్: దివంగత మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు అమోఘమని సీనియర్ కాంగ్రెస్ నేత పారసమల్ సుఖాణి పేర్కొన్నారు. ఆయన శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. అత్యంత ప్రభావశీల ప్రధాన మంత్రిగా దేశంలో పంచశీల సూత్రాలను అమలు చేసిన వ్యక్తిగా కొనియాడారు. సురేష్, జయంతిరావ్, జాగీర్దార్, అబ్దుల్ కరీం, భీమనగౌడ, పవన్, రాణి, ప్రేమలత, మాలా, శశికళ, రాజశేఖర్, నిర్మల, రజియాలున్నారు.

జపాన్ పర్యటనకు మండ్య బాలలు



జపాన్ విద్యార్థులతో బాలలు

మండ్య: తాలూకాలోని సిద్దయ్యనకొప్పలులోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు జపాన్‌లో నిర్వహించిన విద్యార్థుల వినియమ కార్యక్రమంలో పాల్గొన్నారు. 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు అయిన అస్విన్, 8వ తరగతి చదివే ధన్య జి. గౌడ. సాంస్కృతిక పర్యటన కింద జపాన్‌కు వెళ్లారు. ఏప్రిల్ 23న వెళ్లిన వీరు జూన్ 2న తిరిగి వస్తారు. జపాన్ ప్రజలకు కన్నడ సంస్కృతీ సంప్రదాయాలు, ఆహారం, ఆచార విచారాలు తదితరాలను వివరిస్తారు. అలాగే జపాన్ సంస్కృతి గురించి తెలుసుకుంటారు. పలు నగరాలలో పర్యటించి విశేషాలు తెలుసుకుంటారు.

తంగడిగికి మంత్రి పదవిపై సంబరాలు



ఆనందోత్సవాల్లో నాయకులు, కార్యకర్తలు

గంగావతి: కనకగిరి ఎమ్మెల్యే శివరాజ్ తంగడిగి మంత్రి పదవిని చేపట్టిన సందర్భంగా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సవాలను వ్యక్తం చేస్తూ స్వీట్లను పంచుకొని సంబరాల్లో మునిగి తేలారు. సిద్దాపుర, కారటగి, కనకగిరి తదితర పలు ప్రాంతాల్లో ఆయనకు మంత్రి పదవి లభించడంపై కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కనకగిరి విభాగం అధ్యక్షులు రమేష్ నాయక్ మాట్లాడుతూ శివరాజ్ తంగడిగికి పార్టీ మంత్రి పదవిని అప్పగించి సముచిత న్యాయం చేకూర్చిందన్నారు. వెనుకబడిన ప్రాంత అభివృద్ధి కోసం శివరాజ్ తంగడిగి ఎంతో శ్రమించారని, ఇకపై కూడా ఆయన మరింత అభివృద్ధికి పాటుపడతారని ఆశాభావం ప్రకటించారు.

కనకదుర్గమ్మకు 1001 టెంకాయలు



టెంకాయలను కొడుతున్న అభిమానులు

బళ్లారిఅర్బన్: బెంగళూరులో శనివారం సిద్దరామయ్య కేబినెట్‌లో గ్రామీణ ఎమ్మెల్యే బీ.నాగేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో నగరంలోని కనకదుర్గమ్మ దేవస్థానం ముందు కాంగ్రెస్ యువ నాయకుడు ఎంజీ.కనక నేతృత్వంలో అభిమానులు 1001 టెంకాయలను కొట్టి పూజలు నిర్వహించారు. నాగేంద్రకు మంత్రి పదవి దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ అభిమానులతో పార్టీ కార్యకర్తలు బాణసంచాను పేల్చి స్వీట్లను పంచి పెట్టారు. ఈసందర్భంగా అభిమానులు అనిల్‌కుమార్, మల్లి, అరుణ్, నూర్‌వలీ, అఖి, నిఖిల్, వినోద్, రామలింగ, పవన్, భీమా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మాలూరు: పట్టణంలోని బస్టాండు వద్ద అంబేడ్కర్ పార్కు ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు సుమారు 50 ఏళ్ల వయసు కలిగి ఉన్నాడని, మృతుడి వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కోలారు ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలో భద్రపరిచారని, బంధువులు ఎవరైనా ఉంటే మాలూరు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ చంద్రాధర్ తెలిపారు.

బోసురాజును వరించిన మంత్రిగిరి

- సీనియారిటీకి అధిష్టానం పట్టం



ఎన్.ఎస్.బోసురాజు

రాయచూరు రూరల్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాయచూరు నగర నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించిన పార్టీ సీనియర్ నాయకుడు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ బోసురాజుకు అనివార్య పరిస్థితుల్లో ఆ స్థానాన్ని తమకే కేటాయించాలని మైనార్టీలు పట్టుబట్టడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పకుండా తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని ఏఐసీసీ స్థాయిలో జరిగిన ఒప్పందం మేరకు కాంగ్రెస్ అధిష్టానం ఎన్.ఎస్.బోసురాజుకు మంత్రి పదవిని కట్టబెట్టింది. 1972–1976 మధ్యలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1976–80 వరకు తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 1980–91 మధ్య జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, 1991–2000 వరకు రాయచూరు, కొప్పళ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షుడిగా, 2009–2017 వరకు కేపీసీసీ ఉపాధ్యక్షుడిగా, 2018 నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

శాసనసభ్యుడిగా బోసురాజు నేపథ్యం..

1985లో మాన్వి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన బోసురాజు తన ప్రత్యర్థి చేతిలో కేవలం 3700 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అనంతరం 1999–2004 మధ్యలో మాన్వి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 నుంచి ఎమ్మెల్సీగా వ్యవహరించారు. గత ముఖ్యమంత్రులు బంగారప్ప, వీరప్ప మొయిలీల హయాంలో కాడా అధ్యక్షుడిగా, ఎస్ఎం కృష్ణ హయాంలో హైదరాబాద్ కర్ణాటక అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా, ధరంసింగ్ హయాంలో ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శిగా విధులు నిర్వహించారు.

చిరకాలం తర్వాత జిల్లాకు మంత్రి పదవి

వెనుకబడిన రాయచూరు జిల్లాకు రెండు దశాబ్దాల అనంతరం మంత్రి భాగ్యం లభించింది. 2002లో ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ హయాంలో జిల్లాలోని రాయచూరు రూరల్(కల్మల) నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న రాజా అమరేశ్వర నాయక్ అప్పట్లో మంత్రిగా పని చేశారు. అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాల్లో జిల్లా వాసులకు అమాత్య పదవులు కేటాయించలేదు. 2018లో జేడీఎస్, కాంగ్రెస్ సంకీర్ణ సర్కార్‌లో సింధనూరు ఎమ్మెల్యే వెంకటరావు నాడగౌడ మాత్రమే ఏడాది పాటు మంత్రిగా పని చేశారు.

సిద్దు కేబినెట్‌లో నాగేంద్రకు చోటు

- అంచెలంచెలుగా ఎదిగిన వైనం
- జిల్లాకు చెందిన ఇద్దరికి స్థానం



బి నాగేంద్ర

సాక్షి,బళ్లారి: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సిద్దరామయ్య మంత్రివర్గంలో బళ్లారి జిల్లాకు చెందిన ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. జిల్లాలోని గ్రామీణ నియోజకవర్గం నుంచి సీనియర్ బీజేపీ నాయకుడు, మాజీ మంత్రి శ్రీరాములుపై అఖండ మెజారిటీ సాధించిన బి. నాగేంద్రకు సిద్దరామయ్య కేబినెట్‌లో చోటు దక్కింది. శనివారం కేబినెట్ విస్తరణలో భాగంగా బి. నాగేంద్ర రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ధార్వాడ జిల్లా కలఘటగి నియోజకవర్గం నుంచి గెలుపొందిన జిల్లాలోని సండూరుకు చెందిన మాజీ మంత్రి సంతోష్‌లాడ్‌కు కూడా సిద్దు మంత్రివర్గంలో స్థానం లభించింది. నాగేంద్ర రాజకీయంగా అంచెలంచెలుగా ఎదుగుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా వరుసగా విజయాలతో కేబినెట్ మంత్రి పదవిని సాధించారు.

నాగేంద్ర బయోడేటా:

రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన బి నాగేంద్ర బళ్లారి జిల్లాకు చెందిన బి.ఆంజనేయులు, లక్ష్మీదేవి దంపతులకు 1971లో జన్మించారు. బీకాం వరకు చదువుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖా మంత్రి జయరాంకు సమీప బంధువు కూడా. 2008లో బీజేపీ తరఫున కూడ్లిగి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం 2013 అసెంబ్లీ ఎన్నికల్లో కూడ్లిగి నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బళ్లారి గ్రామీణ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి శ్రీరాములుపై దాదాపు 30 వేల మెజారిటీతో అఖండ విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఆయనకు సిద్దరామయ్య మంత్రివర్గంలో చోటు కల్పించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

పాత్రికేయులు సత్యనిష్టతో పని చేయాలి



నూతన పదాధికారులను సన్మానించిన దృశ్యం

కంప్లి: కత్తి కన్నా కలం గొప్పదనే విషయాన్ని రుజువు చేసే ఏకైక వృత్తి పాత్రికేయుడిదని, పాత్రికేయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సత్యం, న్యాయం, నిష్టతో పని చేయాలని ప్రెస్ క్లబ్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు సిద్దరామప్ప సిరిగేరి తెలిపారు. కురుగోడు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం కర్ణాటక ప్రెస్‌క్లబ్ తాలూకా శాఖ పదాధికారుల ఎంపిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రెస్‌క్లబ్ కౌన్సిల్ నియమాలకనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కరోనా మహమ్మారి సందర్భంలో తాము ప్రాణాలొడ్డి సేవలందించామన్నారు. ప్రభుత్వం తమకు ఎలాంటి సౌకర్యం అందించకపోవడం దురదృష్టకరం అన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్ జిల్లా ఉపాధ్యక్షుడు కే.వీరభద్రగౌడ మాట్లాడుతూ రాజ్యాంగంలో పత్రికారంగం కూడా నాల్గో అంగమన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజల కష్ట, నష్టాలపై గళమెత్తి బాధితులకు అండగా నిలవాలన్నారు. అనంతరం నూతన పదాధికారుల పేర్లను ప్రకటించారు. కంప్లి తాలూకా శాఖ నూతన అధ్యక్షునిగా హెచ్.మరియప్ప, ప్రధాన కార్యదర్శిగా టీహెచ్ఎం రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షునిగా సచ్చిదానంద హిరేమఠ, ఉపాధ్యక్షులుగా హేమంత, సమితి సభ్యులుగా అంబణ్ణ, బసవరాజ్, వీరేష్, గోపినాథ, వినాయక్‌లు ఎంపికయ్యారు.

మరిన్ని మంత్రి పదవులివ్వండి



మాట్లాడుతున్న నాగవేణి పాటిల్

రాయచూరు రూరల్: జిల్లాలోని సీనియర్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులను ఇవ్వాలని కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు నాగవేణి పాటిల్ డిమాండ్ చేశారు. ఆమె శనివారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వాల్లో ఇతర జిల్లాల వారికే అమాత్య పదవులు కట్టబెట్టారని గుర్తు చేశారు. నంజుండప్ప నివేదిక ఆధారంగా జిల్లాకు చెందిన వారినే ఇన్‌చార్జి మంత్రిగా నియమించాలన్నారు.

జూన్ 3 నుంచి ముంగారు ఉత్సవాలు



మాట్లాడుతున్న పాపారెడ్డి

రాయచూరు రూరల్: నగరంలో జూన్ 3 నుంచి మూడు రోజుల పాటు ముంగారు సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఏ.పాపారెడ్డి వెల్లడించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 3న కర్ణాటక ఎద్దులతో 1.5 టన్నుల రాతిదూలం లాగే పోటీలను రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి బోసురాజు ప్రారంభిస్తారన్నారు. 4న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ఎద్దులతో 2 టన్నుల రాతిదూలం లాగే పోటీలను కాశీ జగద్గురువులు, నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ ప్రారంభిస్తారన్నారు. 5న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ఎద్దులతో 2.5 టన్నుల రాతి దూలం లాగే పోటీలను నిర్వహిస్తామన్నారు. 4న లక్ష్మీదేవి జాతర ఎద్దుల ఊరేగింపు, కళాబృందాలతో ఉత్సవం జరుగుతుందన్నారు. ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతామన్నారు.

పోటీల్లో విజేతలకు బహుమానాలివే..

3న జరిగే కర్ణాటక ఎద్దులకు ప్రథమ బహుమతిగా రూ.55 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.45 వేలు, తృతీయ బహుమతిగా రూ.35 వేలు, చతుర్ధ బహుమతిగా రూ.25 వేలు, పంచమ బహుమతిగా రూ.20 వేలు, 4న జరిగే ఎద్దుల పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.70 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.55 వేలు, తృతీయ బహుమతిగా రూ. 45 వేలు, చతుర్ధ బహుమతిగా రూ.35 వేలు, పంచమ బహుమతిగా రూ.30 వేలు, ఆరవ రూ.20 వేలు, 5న జరిగే ఎద్దుల పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.80 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.65 వేలు, తృతీయ బహుమతిగా రూ.55 వేలు, చతుర్ధ బహుమతిగా రూ.45 వేలు, పంచమ బహుమతిగా రూ.35 వేలు, ఆరో బహుమతిగా రూ.25 వేలు నగదు ఇస్తామన్నారు.

అతిసార బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కరియమ్మ నాయక్

రాయచూరు రూరల్: కలుషిత నీరు తాగి ఓ బాలుడు మరణించడంతో పాటు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శనివారం దేవదుర్గ ఎమ్మెల్యే కరియమ్మ నాయక్ పరామర్శించారు. దేవదుర్గ తాలూకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి బాగోగులను ఆమె విచారించారు. రేకలమరడి గ్రామ పంచాయతీ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించి ప్రజలకు వైద్యంతో పాటు ఆరోగ్య సలహాలు అందించాలని ఆదేశించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న క్రైం ఎస్ఐ శారద

కంప్లి: సైబర్ నేరాల నియంత్రణకు బ్యాంక్ ఖాతాదారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని క్రైం ఎస్ఐ శారద తెలిపారు. పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ కార్యాలయంలో జేసీఐ సోనా కంప్లి అధ్యక్షులు సంతోష్ కొట్రప్ప సోగి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సైబర్ నేరాల నియంత్రణపై జాగృతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఖాతాదారులు బ్యాంక్ నుంచి సొమ్ము డ్రా చేసే సమయంలో సైబర్ నేరస్తులు డబ్బు దోచుకునేందుకు చేసే కుట్రల నుంచి హుషారుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ముఖ్యాధికారి డాక్టర్ శివలింగప్ప, బ్యాంక్ మేనేజర్ ఉమాదేవి హిరేమఠ, జేసీఐ కార్యదర్శి అమరనాథ శాస్త్రి, పదాధికారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై సామూహిక అత్యాచారం

- చికిత్స పొందుతూ బాధితురాలు మృతి

రాయచూరు రూరల్: నలుగురు వ్యక్తుల చేతిలో ఓ మహిళ సామూహిక అత్యాచారానికి గురై మృతి చెందిన ఘటన జిల్లాలోని సింధనూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. బరకాలు(తాడ్‌పాల్) కుట్టుకొని జీవనం సాగిస్తున్న మహిళపై ఈనెల 23న నలుగురు కామాంధులు అత్యాచారానికి పాల్పడ్డారు. బరకం కుట్టివ్వాలనే సాకుతో మల్లప్ప అనే వ్యక్తి ఆమెను ద్విచక్రవాహనంలో ఎక్కించుకెళ్లారు. వారితో కలిసిన మరో ముగ్గురు ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. స్పృహ కోల్పోయిన మహిళను రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా శుక్రవారం రాత్రి చికిత్స పొందుతూ ఆమె మరణించింది. ఈ ఘటనపై సింధనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శెట్టర్, సవదికి మంత్రి పదవులివ్వాలి

హుబ్లీ: జగదీష్ శెట్టర్, లక్ష్మణ సవదిలకు కూడా మంత్రి పదవులు ఇవ్వాల్సిందని, ఇక ముందైనా వారికి మంత్రి పదవులు ఇవ్వాలని మూరుసావిర మఠం గురుసిద్దరాజ యోగేంద్ర స్వామి తెలిపారు. నగరంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. జగదీష్ శెట్టర్, లక్ష్మణ సవది అనుభవజ్ఞులైన నాయకులని, వారి అనుభవాన్ని పార్టీ ఉపయోగించుకోవాలన్నారు.

విజయోత్సవాలు

కాగా ధార్వాడ జిల్లా కలఘటగి ఎమ్మెల్యే సంతోష్ లాడ్‌కు మంత్రి పదవి లభించడంపై ఆయన అభిమానులు హుబ్లీలోని చెన్నమ్మ సర్కిల్‌లో శనివారం విజయోత్సవం ఆచరించి బాణసంచాను పేల్చారు. అదేవిధంగా బెళగావి గ్రామీణ నియోజకవర్గం ఎమ్మెల్యే లక్ష్మీ హెబ్బాళ్కర్‌కు కూడా మంత్రి పదవి లభించిన నేపథ్యంలో హుబ్లీలోని గదగ్ రోడ్డులో అంబేడ్కర్ ప్రతిమ వద్ద మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పరం రంగులు చల్లుకొని బాణసంచాను పేల్చి మిఠాయిలు పంచుకున్నారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన



నిరసన చేస్తున్న పలు సంఘాల కార్యకర్తలు

హొసపేటి: పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించక పోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్, సీపీఎం, వివిధ ప్రగతిశీల సంఘాల ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ ఎ.కరుణానిధి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంట్ భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించక పోవడం దురదృష్టకరమన్నారు. ఈ విషయంపై ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున నిరసన తెలపాలన్నారు. ఆయా పార్టీల నేతలు భాస్కర్‌రెడ్డి, వెంకటరమణ, జంబయ్యనాయక పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో నలుగురి అరెస్ట్


హుబ్లీ: ధార్వాడ నగరంలోని కమలాపుర శివారులో జరిగిన రియల్ ఎస్టేట్ వ్యాపారితో పాటు జంట హత్యల కేసుకు సంబంధించి పరారీలో ఉన్న నిందితులను ధార్వాడ విద్యాగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు అర్బాద్ హంచనాళ, నదీమ్, రహీంతో పాటు నలుగురిని అరెస్ట్ చేశారు. నిందితులు హత్య చేశాక దాండేలిలో తలదాచుకున్నారు. పోలీసులు వెంటాడి అన్వేషించడంతో నిందితులు ముండగోడకు పరారయ్యారు. ఎట్టకేలకు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం రాత్రి కమలాపురలో రియల్ ఎస్టేట్ వ్యాపారి మహమ్మద్ కుడిచి హత్య జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గణేష్ అనే మరో వ్యక్తి కూడా కత్తి వేటు తగలడంతో మృతి చెందాడు. హత్యలకు పాత కక్షలే కారణమని చెబుతున్నారు. ముఖ్య నిందితుడు అర్బాద్ హంచనాళ గతంలో హత్యకు గురైన రౌడీ షీటర్ ఫ్రూట్ ఇర్ఫాన్ కుమారుడు. ఫ్రూట్ ఇర్ఫాన్ గతంలో మహమ్మద్ కుడిచితో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. తండ్రి హత్య జరిగాక మహమ్మద్‌ను అర్బాద్ డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశాడు. ఇదే కారణంగా వీరిద్దరి మధ్య ఘర్షణలు జరిగేవి. ఈ కారణంగానే మహమ్మద్ కుడిచిని హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు.

రైల్వే బ్రిడ్జికి ప్రైవేటు బస్సు ఢీ

- 25 మంది ప్రయాణికులకు గాయాలు

చెళ్లకెరె రూరల్: రైల్వే బ్రిడ్జిని ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో 25 మంది ప్రయాణికులు గాయపడిన ఘటన గురువారం రాత్రి నగర సమీపంలోని రోజా డాబా వద్ద జరిగింది. బెంగళూరు నుంచి రాయచూరు వెళుతున్న సంజన బస్సు రైల్వే బ్రిడ్జిని బలంగా ఢీకొనడంతో బస్సు అదుపు తప్పి బోల్తా పడి 25 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. రాత్రి 10.30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బస్సు డ్రైవర్ బసవరాజు అతి వేగంగా బస్సును నడపడం వల్లనే ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం అనంతరం గాయపడిన వారికి చెళ్లకెరె ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనలో డ్రైవర్ బసవరాజు తలకు గట్టి దెబ్బ తగలగా ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఘటన విషయం తెలిసిన వెంటనే చెళ్లకెరె ఇన్‌స్పెక్టర్ రాజా ఫకృద్దీన్ దేశాయి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎస్ రంగనాథ్ కేసు నమోదు చేసుకున్నారు.

జూన్ 1 నుంచి పీయూసీ తరగతులు షురూ



డీడీపీయూ రామచంద్రప్ప

కోలారు: జిల్లా వ్యాప్తంగా జూన్ 1 నుంచి పీయూసీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు డీడీపీయూ రామచంద్రప్ప తెలిపారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కళాశాలల్లో మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ విద్యా శాఖ మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో 33 ప్రభుత్వ, 12 ఎయిడెడ్, 90 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు ఇప్పటికే అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలలు నిర్ణీత ఫీజులు మాత్రమే వసూలు చేయాలన్నారు. రోస్టర్ పద్ధతిని అనుసరించి అడ్మిషన్లు జరపాలని సూచించామన్నారు. అడ్మిషన్ సమయంలో నియమాలను తూచ తప్పకుండా పాటించకుంటే చర్యలు తప్పవన్నారు. విద్యార్థులను పాఠాలతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. ప్రైవేటు కళాశాలలు ఫీజుల వివరాలను నోటీసు బోర్డులలో తప్పనిసరిగా ప్రకటించాలన్నారు.

ముంగారు వానలతో జాగ్రత్త.!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: ముంగారు వానలను ఎదుర్కోవడానికి అధికారులు సకల సన్నద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే జి కె వెంకటశివారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు అతివృష్టితో నష్టపోయిన కుటుంబాలకు పరిహారం అందించాలన్నారు. వ్యవసాయ శాఖ రైతులకు అవసరమైన విత్తనాలు అందించాలన్నారు. పశువుల మేత సంగ్రహణ, అంటువ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ యూనిట్‌ను పునః ప్రారంభించాలన్నారు. రాజ కాలువలు, డ్రైనేజీలను శుభ్రం చేయాలన్నారు. పురసభకు వచ్చిన రూ.15 కోట్ల నిధులను ఉపయోగించుకోవాలన్నారు. కేసీ వ్యాలీ పైప్‌లను అమర్చడానికి తవ్విన రహదారులను సక్రమంగా పూడ్చాలన్నారు. తహసీల్దార్ శిరీన్ తాజ్ మాట్లాడుతూ పంటనష్టంపై సమీక్ష నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. పరిహారం అందిన వెంటనే రైతుల ఖాతాలకు జమ చేస్తామన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

మంత్రి మునియప్పకు ఘనస్వాగతం



మునియప్పను స్వాగతిస్తున్న కార్యకర్తలు

కోలారు: ఇటీవల బెంగళూరులో రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి సారిగా కోలారు నగరానికి వచ్చిన మంత్రి కెహెచ్ మునియప్పకు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అపార అనుభవం కలిగిన కెహెచ్ మునియప్ప మంత్రి కావడంపై హర్షం వ్యక్తం చేశారు. మునియప్పను జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కూడా చేయాలని, అప్పుడే జిల్లాతో పాటు రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నెల 30న లేదా జూన్ 4న జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కెహెచ్ మునియప్పను ఘనంగా సన్మానిస్తామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్, కె జయదేవ్, విజయనరసింహ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతదేహం

మాలూరు: చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న కేసు మిస్టరీని మాలూరు పోలీసులు ఛేదించారు. బెంగళూరు రూరల్ జిల్లా కూగూరు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి (25) అనే వ్యక్తి మాలూరు తాలూకా అంచెముస్కూరు గ్రామ సమీపంలోని నీలగిరి తోపులో 8 రోజుల క్రితం చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మాలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు తర్వాత మృతుడిని కృష్ణమూర్తిగా గుర్తించారు. శనివారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి ఇద్దరు బాలల మృతి



లోకేశ్వరి మృతదేహం



కార్తీక్ మృతదేహం

కేజీఎఫ్: సరదాగా ఈత కొట్టేందుకు చెరువు వద్దకు వెళ్లిన ఇద్దరు బాలలు అందులో మునిగి మరణించిన ఘటన అండర్‌సన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు..తాలూకాలోని గోణమాకనహళ్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ కుమారుడు కార్తీక్ (14), అదే గ్రామానికి చెందిన రమేష్ కుమార్తె లోకేశ్వరి(11) మృతి చెందిన పిల్లలు. పాఠశాలలకు సెలవులు కావడం వల్ల వీరిద్దరూ గ్రామ సమీపంలోని సూరనహళ్లి చెరువులో స్నానానికి దిగారు. అయితే బురదలో చిక్కుకు పోయి పైకి రాలేక ఇద్దరు నీటిలో మునిగి మరణించినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే అండర్సన్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో ఇద్దరు పిల్లలను చెరువు నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను తల్లిదండ్రులకు అప్పగించారు. మృతుల ఇద్దరు తండ్రులు ఆటో డ్రైవర్లు కాగా వీరి తల్లులు జీకే గార్మెంట్స్‌లో పనికి వెళుతున్నారు. పిల్లల మృతితో ఇరు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. అండర్‌సన్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

యార్డులో సౌకర్యాల కోసం ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం పదాధికారులు

శ్రీనివాసపురం: పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్ యార్డులో మౌలిక సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు శనివారం ఏపీఎంసీ మార్కెట్ యార్డు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ ముంగారు వానలతో తాలూకాలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్ట పోయిన మామిడి రైతులకు ప్రభుత్వం నుంచి తగిన పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో తగిన సౌలభ్యాలు లేకపోవడం వల్ల రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రతియేటా ఏదో విధంగా నష్టపోతున్న రైతులకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని ఒత్తిడి చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తంబళ్లి మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు అంజప్ప పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలేవీ?



నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

శ్రీనివాసపురం: ముత్తకపల్లి జీపీలోని పెద్దపల్లి, గాంధీనగర, కల్లుకుంట, గిరిజనహళ్లి గ్రామాల్లో మౌలిక సౌకర్యాలను కల్పించడంలో పంచాయతీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు శనివారం ముత్తకపల్లి జీపీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పెద్దపల్లి గ్రామంలో గత 6 నెలల నుంచి బోరుబావి చెడిపోయి గ్రామస్తులు నీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామాల్లో డ్రైనేజీలు మూసుకుపోయి మురుగు నీరు రహదారిలోకి వస్తోందన్నారు. దీని వల్ల దోమల బెడద అధికమై వివిధ రోగాల బారిన పడాల్సి వస్తోందన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ పథకంలో భాగంగా అందించిన చెత్త బుట్టల పంపిణీలో కూడా రాజకీయాలు చేసి తారతమ్యం చేశారన్నారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాలను కల్పించి సమస్యలను పరిష్కరించకుంటే పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత


బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: నగరంతో పాటు తాలూకాలో తాగునీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇడగూరు రోడ్డు 14వ వార్డు సమీపంలో తాగునీటి అవసరాల కోసం బోరు తవ్వకాన్ని ప్రారంభించి మాట్లాడారు. నగరంలో అన్ని వార్డుల్లో నీటి సమస్య ఉందని, మోటార్లు కాలిపోయిన చోట్ల కొత్త మోటార్లు, పంపులు బిగిస్తామని, నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. వీరం డహళ్లిలో నీటి సమస్య తీర్చడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగరసభ మాజీ అధ్యక్షురాలు రూపా అనంతరాజు, కమిషనర్ గీత, నగర సభ సభ్యులు పాల్గొన్నారు.

తుమకూరులో నెహ్రూ వర్ధంతి

తుమకూరు: తుమకూరు నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని, దివంగత జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ, నాయకులు ఇక్బాల్ అహ్మద్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ కేబుల్ చోరీ


చేంబర్ తొలగించి కేబుల్ చోరీ చేసిన దృశ్యం

దొడ్డబళ్లాపురం: ఇంటర్నెట్ సేవలు అందించడానికి ప్రైవేటు కంపెనీ ఏర్పాటు చేసిన డిజిటల్ చేంబర్‌ను తొలగించి కేబుల్ చోరీ చేసిన సంఘటన దొడ్డ పట్టణ పరిధిలోని కరేనహళ్లిలో చోటుచేసుకుంది. కరేనహళ్లిలోని రంగనాథ బేకరి వద్ద డిజిటల్ చేంబర్ ఉండగా శుక్రవారం రాత్రి దుండగులు చేంబర్ తొలగించి విలువైన కేబుల్ చోరీ చేసారు. దీంతో స్థానికంగా పలు చోట్ల ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలిగింది. దొడ్డ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అభిమానుల సంబరం

తుమకూరు: డీసీసీ బ్యాంక్ అధ్యక్షుడు, మధుగిరి ఎమ్మెల్యే కే.ఎన్. రాజన్న మంత్రిగా ప్రమాణం చేయడంతో వాల్మీకి సముదాయం నాయకులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కుప్పూరు శ్రీధరనాయక ఆధ్వర్యంలో తుమకూరు టౌన్‌హాల్ వద్ద టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. రాజన్న మంత్రి పదవి చేపట్టడం ఆనందంగా ఉందని చెప్పారు.

ఆటో డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు


హెల్త్ కార్డులు అందుకున్న దృశ్యం

కృష్ణరాజపురం: నగరంలోని కృష్ణరాజపురం పరిధిలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్య పరీక్షలు చేయించారు. శనివారం దాదాపు 200 మంది ఆటో డ్రైవర్లకు వైదేహి ఆస్పత్రి సహకారంతో వారికి ఆరోగ్య పరీక్షలు, బీమా సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా వైట్‌ఫీల్డ్ ట్రాఫిక్ సీఐ రాఘవేంద్ర మాట్లాడుతూ...ఆటో డ్రైవర్లు రోడ్డు నియమాలు తప్పకుండా పాటించాలని, ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. అవసరమైన సమయంలో హెల్త్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక బోధన అవసరం


బుద్ధిమాంద్య దివ్యాంగులకు బోధనా కిట్లను వితరణ చేసిన దృశ్యం

గౌరిబిదనూరు: బుద్ధిమాంద్య పిల్లలకు ప్రత్యేక బోధన అవసరమని, వారి వయసుకు, మానసిక స్థితికి ఎంతో వ్యత్యాసం ఉంటుందని తెలంగాణా రాష్ట్రం సికిందరాబాద్‌లోని నిమ్‌మీడ్ సంస్థ పునర్వసతి ప్రాజెక్ట్ అధికారి కనగ సభాపతి తెలిపారు. శుక్రవారం నగరంలోని అరుణోదయా బుద్ధిమాద్యం ప్రత్యేక పాఠశాలలో ఎన్నిక చేసిన 16 మందికి విద్య కిట్లను వితరణ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కిట్లను అందించిన కనగ సభాపతికి దివ్యాంగుల పాఠశాల ప్రాజెక్ట్ అధికారి నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఫిజియోథెరపిస్టు హరిణి, నవ్య, శాంతా మహేష్, కీర్తి, నందిని, సవిత పాల్గొన్నారు.

పరమేశ్వర్‌కు హోం, బైరేగౌడకు రెవెన్యూ?

- మంత్రులకు శాఖల కేటాయింపు ?
- డీకేకు దక్కని ముఖ్యశాఖలు


నూతన మంత్రి వర్గ సభ్యులతో గవర్నర్, సీఎం, డీసీఎం తదితరులు

బనశంకరి: మంత్రుల ప్రమాణ స్వీకారం ముగియడంతో చకచకా శాఖల కేటాయింపు కూడా నిర్వహించినట్లు తెలిసింది. అయితే దీనిపై పూర్తి స్పష్టత లేదు. కీలకమైన హోంశాఖ పరమేశ్వర్‌కు, డిప్యూటీ సీఎం శివకుమార్‌కు జల వనరులు, బెంగళూరు నగరాభివృద్ధి శాఖ కేటయించినట్లు సమాచారం.

శాఖల వివరాలు..

- ముఖ్యమంత్రి సిద్దరామయ్య –ఆర్థిక, ఇంటెలిజెన్స్, పలు ఇతర శాఖలు
- డిప్యూటీ సీఎం డీకే శివకుమార్– జలవనరులు, బెంగళూరునగరాభివృద్ధి (బీడీఏ, బీబీఎంపీ)
- డా. పరమేశ్వర్ –హోంశాఖ
- ఎంబీ.పాటిల్– భారీ మధ్యతరహా పరిశ్రమలు, ఐటీ, బీటీ
- కేహెచ్.మునియప్ప–ఆహారపౌరసరఫరాలశాఖ
- కేజే.జార్జ్ – ఇంధనశాఖ
- జమీర్‌అహ్మద్– గృహ నిర్మాణం, వక్ఫ్
- రామలింగారెడ్డి– రవాణాశాఖ
- సతీశ్ జార్కిహొళి– ప్రజాపనుల శాఖ
- ప్రియాంక్ ఖర్గే –గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్
- హెచ్‌కే.పాటిల్–న్యాయ,శాసనసభ వ్యవహారాలు
- కృష్ణ బైరేగౌడ– రెవెన్యూ
- చెలువరాయస్వామి– వ్యవసాయ
- కే.వెంకటేశ్–పశుసంవర్ధక శాఖ, పట్టుపరిశ్రమ
- డా. మహదేవప్ప – సాంఘిక సంక్షేమ
- ఈశ్వర్‌ఖండ్రే–అటవీశాఖ
- కేఎన్.రాజణ్ణ–సహకార శాఖ
- దినేశ్ గుండూరావ్–ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ
- శరణ బసప్ప దర్శనాపుర–చిన్నతరహా పరిశ్రమలు
- శివానంద పాటిల్–జౌళి, చక్కెరపరిశ్రమలు
- ఆర్‌బీ.తిమ్మాపుర–అబ్కారీ, దేవదాయశాఖ
- ఎస్ఎస్.మల్లికార్జున–గనులు, ఉద్యానవనశాఖ
- శివరాజ్ తంగడగి–వెనుకబడిన వర్గాల సంక్షేమం
- శరణప్రకాష్ పాటిల్–ఉన్నత విద్య
- మంకాళ్ వైద్య– మత్స్యశాఖ
- లక్ష్మీ హెబ్బాళ్కర్–మహిళా శిశుసంక్షేమ
- రహీంఖాన్– మున్సిపల్
- డీ.సుధాకర్–గణాంకాలు, మౌలిక సౌకర్యాలు
- సంతోష్‌లాడ్– కార్మిక
- బోసురాజు–పర్యాటక, సైన్స్ అండ్ టెక్నాలజీ
- బైరతి సురేశ్–నగరాభివృద్ధి
- మధు బంగారప్ప–ప్రాథమిక విద్య
- డా. ఎంసీ సుధాకర్–వైద్య విద్యాశాఖ
- బి.నాగేంద్ర–యువజన క్రీడలు శాఖ

8 మందికి తొలిసారి బెర్తులు

శివాజీనగర: నూతన మంత్రివర్గం కొలువుతీరడం పూర్తి కాగా, మంత్రులు కావడం 8 మంది మంత్రి కావడం ఇదే తొలిసారి. మిగతావారు రెండు మూడుసార్లు ఆ పదవిని అలంకరించినవారే.

- లక్ష్మీ హెబ్బాళ్కర్, బైరతి సురేశ్, మధు బంగారప్ప, కే.ఎన్.రాజణ్ణ, బీ.నాగేంద్ర, మాంకాళ్ సుబ్బు వైద్య, ఎన్.ఎస్.బోసురాజు, డాక్టర్ ఎం.సీ.సుధాకర్ తొలిసారిగా మంత్రులయ్యారు.
- హెచ్.సీ.మహదేవప్ప 4వ సారిగా, కృష్ణబైరేగౌడ 3వ సారిగా, హెచ్.కే.పాటిల్ 4వ సారిగా ఎన్.చెలువరాయస్వామి, ఆర్.బీ.తిమ్మాపురలు 3వ సారి మంత్రులయ్యారు.
- పిరియాపట్టణ వెంకటేశ్, రహీంఖాన్, ఈశ్వర ఖండ్రె, దినేశ్ గుండురావు, శివానంద పాటిల్, డీ.సుధాకర్, సంతోష్ లాడ్, శివరాజ్ తంగడగిలు 2వ సారిగా మంత్రులయ్యారు.

లింగాయత్‌లకు ఎక్కువ పదవులు

- కులపరంగా చూస్తే అత్యధికంగా లింగాయత్ వర్గం నుంచి 7 మంది మంత్రులుగా, ఒక్కలిగ సముదాయంలో ఐదు మంది మంత్రులయ్యారు.
- ఎస్సీ వర్గాల్లో 6 మందికి మంత్రి స్థానాలు లభించగా, ఎస్టీలకు ముగ్గురికి పదవి దక్కింది.
- కురుబ సముదాయం నుండి ఇద్దరు, రెడ్డి సామాజిక వర్గం నుండి ఇద్దరికి, ముస్లిం సముదాయం నుండి ఇద్దరు, ఈడిగ, క్రైస్తవ, బ్రాహ్మణ, జైన్, బెస్త, రాజు క్షత్రియ వర్గాల్లో ఒక్కొక్కరికి బెర్తు లభించింది.

రామనగరలో జేడీఎస్ కార్యకర్తలపై దాడి


జేడీఎస్ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మంజునాథ్

దొడ్డబళ్లాపురం: ఎన్నికలు ముగిసి నెల తిరక్కుండానే రామనగర జిల్లాలో రాజకీయ విద్వేషాలు రగులుకున్నాయి. మాగడి పట్టణంలోని జ్యోతి నగర్‌లో గురువారం రాత్రి జరిగిన గ్రూపు ఘర్షణ రాజకీయ రంగు పులుముకుంది. ఈ ఘర్షణలో ఇద్దరు జేడీఎస్ కార్యకర్తలపై దాడి చేయగా ఇద్దరూ తీవ్ర గాయాలపాలై ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జేడీఎస్ కార్యకర్తలు హనుమంతరాజు (40), అచ్యుత్‌రావ్ (24) గాయపడ్డవారు. వీరిపై బిడది బ్లాక్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్, అతని అనుచరులు దాడి చేసారని ఆరోపించారు. గురువారం రాత్రి జేడీఎస్ కార్యకర్తలు అచ్యుతరావ్, హనుమంతరాజు ఇద్దరినీ స్వాన్లి అనే వ్యక్తి స్నేహితుడు ఒక విషయానికి సంబంధించి చర్చలకు పిలిచాడని, చర్చలు జరుగుతుండగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రవీణ్, నవీన్, కిరణ్ నెలమంగలకు చెందిన శరత్‌కుమార్ తదితరులు వచ్చి దుర్భాషలాడి దాడి చేసారని బాధితులు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల్లో ఒకరిని అరెస్టు చేయగా మిగతావారు పరారయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జేడీఎస్ కార్యకర్తలను మాగడి మాజీ ఎమ్మెల్యే ఏ మంజు కలిసి పరామర్శించారు. ప్రవీణ్‌ను బిడది బ్లాక్ యూత్ కాంగ్రెస్ నుంచి తొలగించామని, అతడు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని జిల్లా యూత్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ జోగేందర్ తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి విగ్రహం

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగి పాళ్య గ్రామంలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. వేద పండితులు ప్రత్యేక హోమ పూజలు చేశారు. కమిటీ సభ్యుడు రాఘవేంద్ర ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

అదుపుతప్పి టెంపో బోల్తా



చింతామణి: వేరుశెనగ లోడుతో వస్తున్న టెంపో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడిన సంఘటన రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఉప్పారపేట–సోరప్పల్లి మధ్యలో శనివారం జరిగింది. వివరాలు.. చిక్కబళ్లాపురం నుంచి చింతామణి తాలూకా ఊలవాడి గ్రామానికి వేరుశెనగ లోడుతో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదం నుంచి బయటపడిన డ్రైవర్ రాజుకు అక్కడి నుంచి పారిపోయాడు. రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మానసిక ఒత్తిడిలో విద్యార్థులు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మండ్య: మహమ్మారి కోవిడ్ తరువాత విద్యార్థులు చదువుతో పాటు ఇతర విషయాల్లో రాణించలేకపోతున్నారని, మానసిక ఇబ్బందులుతున్నారని లోకాయుక్త న్యాయమూర్తి బీఎస్ పాటిల్ అన్నారు. శనివారం లయన్స్ సంస్థ ఆధ్వర్యంలో మండ్య నగరంలో అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన ప్రాంతీయ సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడుతూ...కరోనా సమయంలో విద్యార్థులు రెండేళ్ల పాటు ఇళ్లల్లోనే గడిపారని, దీంతో విద్యార్థుల్లో ఆందోళన ఉందని, వారిలో ఆత్మస్థైర్యం నింపాలన్నారు.

స్పీకర్‌పై అవహేళనగా పోస్టు

యశవంతపుర: సోషల్ మీడియాలో స్పీకర్‌పై అవహేళనగా పోస్టు పెట్టిన చిక్కమగళూరుకు చెందిన శ్రీరామసేన నాయకుడిపై కేసు నమోదు చేశారు. ప్రతేశ్ అనే యువకుడు స్పీకర్ యూటీ ఖాదర్‌పై సోషల్ మీడియాలో అవహేళనగా పోస్టులు పెట్టారు. కాంగ్రెస్ ఐటీ సెల్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మతతత్వ సంబంధిత కేసు నమోదు చేశారు.

పోలీసులపై దాడి ఇద్దరి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

యశవంతపుర: తాగిన మత్తులో పోలీసులపై దాడి చేసిన ఇద్దరు యువకులను కలబురగి పోలీసులు అరెస్ట్ చేశారు. నగర బజారు పోలీసుస్టేషన్ కానిస్టేబుళ్లు శాంతలింగ, దేవేంద్రలు రాత్రి బీట్‌లో ఉండగా రామమందిరం వద్ద యరగోళ కల్యాణ మంటపం సమీపంలో మద్యం మత్తులో ఉన్న మల్లికార్జున, విజయ్‌లు విధుల్లో ఉన్న ఇద్దరు పోలీసులపై దాడి చేశారు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

అబద్ధపు హామీలతో అధికారంలోకి..

యశవంతపుర: విధానసభ ఎన్నికలలో కాంగ్రెస్ అనేక చోట్ల ఐదు వేల విలువగల గిఫ్ట్ కూపన్లను పంపిణీ చేసినట్లు బీజేపీ ఆరోపించింది. రామనగర కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికలకు ముందు ఓటర్లకు ఐదువేల విలువగల కూపన్లు పంపిణీ చేసినట్లు బీజేపీ ట్వీట్ చేసింది. కూపన్ల పంపిణీని కాంగ్రెస్ నేరుగా ఒప్పుకున్నట్లు బీజేపీ ఆరోపించింది.

చిత్రలేఖనం... వైవిధ్యం




చిత్రలేఖన కళాకారిణి సుమలత కుంచె నుంచి జాలువారిన చిత్రాలు

బనశంకరి: చిత్రకళా పరిషత్‌లో ఎక్స్‌ప్రెషనిజం పేరుతో ఏర్పాటు చేసిన పెయింటింగ్స్ ప్రదర్శన నగరవాసులను కనువిందు చేస్తోంది. కుమారకృపరోడ్డు చిత్రకళా పరిషత్ గ్యాలరీ 1, 2లో ఆంధ్రప్రదేశ్ కాకినాడకు చెందిన కుంచె చిత్రకారిణి కే.సుమలత గీసిన విభిన్నమైన ఆలోచనలు, ఆధ్యాత్మిక, ప్రకృతి, ఆరాధన, వన్యజీవులు సంరక్షణపై నవ్యమైన చిత్రాలతో కూడిన చిత్ర ప్రదర్శన నగరవాసులను ఆహా అనిపిస్తుంది. కాకినాడకు చెందిన కే.సుమలత డిగ్రీ పట్టభద్రురాలు. పెయింటింగ్స్‌పై మక్కువతో తల్లిదండ్రులు లక్ష్మీదేవి, చక్రధరరావ్ ప్రోత్సాహంతో ఈ రంగంలో అడుగుపెట్టారు. ఆధ్యాత్మికత, ఆధునిక విజ్ఞానంతో కూడిన తమదైనశైలిలో నవ్యమైన చిత్రాలకు కుంచె ద్వారా జీవం పోస్తున్నారు. కర్ణాటకకు చెందిన ప్రఖ్యాత బేలూరు శిల్పకళ, హంపి శిల్పకళా సౌందర్యాన్ని చిత్రలేఖనం ద్వారా వైవిధ్యంగా పెయింటింగ్ రూపంలో ఎంతో అద్భుతంగా గీశారు. ఈ ప్రదర్శన 31 వరకు అందుబాటులో ఉంటుంది.

సుధాకర్ అభిమానుల విజయోత్సవం


విజయోత్సవంలో అభిమానులు

చింతామణి: రాష్ట్ర కేబినెట్‌లో చింతామణి ఎమ్మెల్యే సుధాకర్‌కు మంత్రి పదవి లభించడంతో అభిమానులు పటాసులు పేల్చి స్వీట్లు పంచుకొన్నారు. సుధాకర్ దివంగత ఆంజనేయరెడ్డి కుటుంబ వారసుడుగా 2004 రాజకీయ అరంగ్రేటం చేసి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి మూడవ సారి గెలవడంతో మంత్రి పదవి దక్కిందని, దీంతో ఉభయ జిల్లాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

జరిమానా వసూలు

యశవంతపుర: కేఎస్ఆర్‌టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారి నుంచి అధికారులు రూ. 5.54 లక్షల జరిమానా వసూలు చేశారు. ఏప్రిల్లో 3,415 మంది నుంచి ఈ జరిమానా వసూలు చేసినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. టికెట్ తీసుకుని ప్రయాణాలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

అయోధ్యలో ఆశ్రమానికి భూమిపూజ

మైసూరు: మైసూరు నగరంలోని శ్రీ అవధూత దత్త పీఠం శ్రీగణపతి సచ్చిదానంద స్వామి 81వ పుట్టిన రోజు వేడుకలను ఈసారి అయోధ్యలో జరుపుకున్నారు. అయోధ్యలో గణపతి సచ్చిదానంద ఆశ్రమ శాఖను నిర్మించడానికి స్వామీజీ స్వయంగా భూమిపూజ చేశారు.

ఫిర్యాదుదారుడిపై రిక్కీరై, అనుచరుల దాడి

బనశంకరి: ఫిర్యాదిదారుడిపై ముత్తప్పరై కుమారుడు రిక్కీ రై, అతని అనుచరులు దాడి చేశారు. ఫిర్యాదిదారుడు శ్రీనివాసనాయుడిని చితకబాదారు. రిచ్మండ్ సర్కిల్‌లోని కారఘు హోటల్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పారిశ్రామికవేత్త శ్రీనివాసనాయుడు కారుకు నిప్పు పెట్టిన కేసులో రిక్కీరై ఆరోపి కాగా సదాశివనగర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై కోర్టులో చార్జిషీట్ కూడా వేశారు. హోటల్‌లో దొరికిన శ్రీనివాసనాయుడుపై రిక్కీరై దాడి చేసి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై శ్రీనివాసనాయుడు కబ్బన్‌పార్కు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కనువిందుగా కాలేజ్ ఫెస్ట్



మైసూరు: మైసూరు నగరంలోని ఓ ప్రైవేటు వర్సిటీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సద్గమయి–2023 విద్యార్థుల ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ కళలను ప్రదర్శించారు. గానాలాపన, నృత్యాలు, ప్రతిభా ప్రదర్శనలతో హోరెత్తించారు.

హోసూరు వార్తలు..

బాలల శిక్షణ శిబిరం ముగింపు


ముగింపు కార్యక్రమంలో బాలలు, అధికారులు

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కేఆర్‌పీ డ్యాం వద్ద గత 12వ తేదీ పాఠశాల విద్యాశాఖ ప్రారంభించిన వేసవి శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. ఇందులో పాల్గొన్న 8, 9వ తరగతి విద్యార్థులకు ఆటలు, కళాకృతుల తయారీ, సంగీతం, నాట్యం పర్యావరణ పరిరక్షణ తదితరాలలో శిక్షణనిచ్చారు. తళి సమీపంలోని పూల ఎగుమతి కేంద్రం, అయూరు అటవీశాఖ పార్కు, హోసూరులోని క్యాటిల్‌ఫాం, అశోక్ లేల్యాండ్ పరిశ్రమలను సందర్శించారు. పిల్లలకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శరయు, కమిషనర్ స్నేహ, సబ్‌కలెక్టర్ శరణ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హోసూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సిఫ్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు.. హోసూరు–బెంగళూరు జాతీయ రహదారి దర్గా సమీపంలోని ముత్తుమారియమ్మ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఓ వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పాముకాటుకు గురైన మహిళ మృతి

పాముకాటుతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన ఘటన ఘటన సిఫ్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... హోసూరు పారిశ్రామికవాడ చిన్నయలసగిరి ప్రాంతానికి చెందిన అంజినప్ప భార్య సరసమ్మ (45) ఈ 22వ తేదీ అదే ప్రాంతంలో మేకలు మేపుతుండగా పాము కాటేసింది. ఆమెను స్థానికులు హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక శుక్రవారం రాత్రి మృతి చెందింది

మృతదేహంతో ఆందోళన

క్రిష్ణగిరి: స్మశానవాటికకు వెళ్లే దారిని ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ వృద్ధురాలి శవంతో బంధువులు ఆందోళన చేపట్టిన ఘటన ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. వివరాలు... సూళగిరి సమితి ఉద్దనపల్లి సమీపంలోని రామాపురం గ్రామానికి చెందిన చిన్నతాయమ్మ (65) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. బంధువులు శుక్రవారం అంత్యక్రియలు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో స్మశానవాటికకు వెళ్లే దారిని ఓ వ్యక్తి ఆక్రమించుకొని పశువులకొట్టం నిర్మించడంతో ఆగ్రహంతో ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకొన్న ఉద్దనపల్లి పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. సర్వే చేయించి స్మశానవాటికకు దారి ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి


వడగళ్ల వానకు దెబ్బతిన్న క్యాబేజ్ పంట

క్రిష్ణగిరి: ప్రకృతి వైపరీత్యాల వల్ల ధ్వంసమైన పంటలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు. హోసూరు, సూళగిరి, డెంకణీకోట, అంచెట్టి తాలూకాల్లో వాణిజ్య పంటలకు అనుకూలమైన శీతోష్ణస్థితి ఉండడంతో పెద్ద ఎత్తున రైతులు ఎక్కువ విస్తీర్ణంలో వాణిజ్య పంటలు సాగు చేసి ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రధానంగా ఈ తాలూకాల్లో టమోటో, బీన్స్, క్యారెట్, బీట్‌రూట్, కాలీఫ్లవర్, బీర, బెండ, వంగ, క్యాప్సికం, పుదీన, కొత్తిమీర తదితర పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పండించే కాయగూరలను హోసూరు, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు తదితర మార్కెట్‌లకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా క్రిష్ణగిరి జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో వాణిజ్య పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ప్రైవేట్ స్కూళ్ల వాహనాల తనిఖీ


పాఠశాల వాహనాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో శనివారం ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వాహనాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆర్టీవో కాళియప్పన్ ఆధ్వర్యంలో కలెక్టర్ శరయు వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా క్రిష్ణగిరి, బర్గూరు తాలూకాల్లో నిర్వహిస్తున్న 45 పాఠశాలలకు చెందిన 250 వాహనాలను ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...స్కూల్ వ్యాన్లలో ప్రధానంగా జీపీఎస్ యంత్రం అమర్చి ఉండాలని, ప్రాథమిక చికిత్సకు అవసరమైన సంరజామా, మంటలార్పే ఉపకరణాలు, అత్యవసర ద్వారం ఉంచాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, సీట్‌బెల్ట్ ధరించాలని, పిల్లల తల్లిదండ్రులకు డ్రైవర్ల సెల్ నంబర్లు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో చేపట్టవలసిన రక్షణ చర్యలపై చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో అధికారులు బాబు, తమిళరసి, అన్బు చెలియన్, ఆనంద్ పాల్గొన్నారు.

మురికి కూపంలా దక్షిణ పెన్నా నది

- ఫ్యాక్టరీల వ్యర్థాలతో కలుషితం


దక్షిణ పెన్నాలో ప్రవహిస్తున్న కలుషిత నీరు

హోసూరు: స్వచ్ఛమైన జలాలతో కళకళలాడాల్సిన నది రసాయన వ్యర్థాలతో మురికి కూపంగా మారింది. దక్షిణ పెన్నా పరివాహక ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కెలవరపల్లి రిజర్వాయర్‌కు వరద నీరు పోటెత్తింది. డ్యాం నుంచి అధికారులు నీటిని బయటకు వదిలారు. నది పరివాహక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రైవేట్ పరిశ్రమలు రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలను యథేచ్ఛగా నదిలోకి వదిలేస్తున్నారు. దీని వల్ల నది జలాలు నల్లగా మలినమై నురుగు ఏర్పడుతోంది. ఈ నీటిని రైతులు పంటలకు వినియోగించడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని, పలు సంవత్సరాలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి రసాయన వ్యర్థాలను దక్షిణపెన్నాలో కలిపే పరిశ్రమలపై చర్యలు చేపట్టాలని కోరారు.

లక్ష్మీ హెబ్బాళ్కర్‌కు డబుల్ ఆనందం

శివాజీనగర: సిద్దరామయ్య కేబినెట్‌లో మంత్రి పదవి పొందిన లక్ష్మీ హెబ్బాళ్కర్‌కు మరో ఆనందం కూడా తోడైంది. ఆమె నానమ్మ అయ్యారు. లక్ష్మీ హెబ్బాళ్కర్ కోడలు ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో హెబ్బాళ్కర్ కుటుంబంలో సంతోషం నెలకొంది. శనివారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటం సంతోషకరం కాగా, దానికి తోడుగా తనకు మనవరాలు పుట్టిందని, తమ ఇంటికి లక్ష్మీ వచ్చిందని హెబ్బాళ్కర్ తెలిపారు. ఏ శాఖ ఇచ్చినా సంతోషంతో స్వీకరిస్తానన్నారు. హెబ్బాళ్కర్ కుటుంబమంతా రాజభవన్‌కు వచ్చారు.


ప్రభుత్వం రాయితీపై అందించనున్న వరి విత్తనాలు

రైతుకు విత్తు సాయం

అందరికీ అన్నం పెట్టే అన్నదాత సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోంది. గడిచిన నాలుగేళ్లలో రైతుభరోసా పేరిట సాగు పెట్టుబడి నుంచి పంట కొనుగోలు వరకు అన్నీ తానై నిలుస్తూ అండగా ఉంటోంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి ఎరువులు, పంట కొనుగోలు సమయంలో కావాల్సిన గోనె సంచులు వరకు అన్నీ తానే అందిస్తూ సాయం చేస్తోంది. దీంతో వారి కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

- నాలుగేళ్లలో 2,14,065 క్వింటాళ్ల విత్తనాల సరఫరా
- విత్తనాల కోసం ప్రభుత్వం వెచ్చించిన రాయితీ నిధులు రూ.25.83 కోట్లు
- ఈ ఏడాది అందించనున్న విత్తనాలు 48,487 క్వింటాళ్లు

విజయనగరం ఫోర్ట్: రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే సాగు పెట్టుబడి కోసం రైతులకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 చొప్పన ఆర్థిక సాయం చేస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ముంగిటే అన్ని సేవలు అందిస్తుంది. రైతుల పండించిన వరి, మొక్కజొన్న తదితర పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు లబ్ధి చేకూర్చుతుంది. అన్నిటికంటే ముఖ్యంగా పంటల సాగుకు అవసరమైన విత్తనాలను కూడా ప్రభుత్వం రాయితీపై అందిస్తుంది. జిల్లాలో వరి, మొక్కజొన్న, పెసర, మినుము, పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. ఇందుకోసం ఏటా రూ.కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తోంది.

రాయితీ విత్తనాలపై ఆసక్తి

గతంలో రైతులు తాము పండించిన పంటలో కొంత పంటను విత్తనాల కోసం ఉంచేవారు. ఆ పంటను ప్రత్యేకంగా కోసి విత్తనాలు సిద్ధం చేసుకునేవారు. కొన్నేళ్లుగా రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవడం మానేశారు. ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలనే సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో అధిక శాతం మంది ఈ విధంగానే చేస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంట అయిన వరి పంటకు సంబంధించి రైతులు పూర్తిగా రాయితీ విత్తనాలపైనే ఆధారపడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనాలు చాలకపోతే ప్రైవేటు డీలర్ల వద్ద రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

నాలుగేళ్లలో 2,14,065 క్వింటాళ్ల విత్తనాల సరఫరా

గత నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం 2,14,065 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు రాయితీపై ప్రభుత్వం అందించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.25.83 కోట్లు ఖర్చు చేసింది. ఏటా 50 వేల క్వింటాళ్ల వరకు విత్తనాలను ప్రభుత్వం అందిస్తుంది. దీని వల్ల లక్షా 50 వేల మంది వరకు రైతులు లబ్ధి పొందుతున్నారు. ఈ ఏడాది 2023 - 24 సంవత్సరానికి సంబంధించి 48,487 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభంలో రైతులకు ప్రభుత్వం విత్తనాలు రాయితీపై అందిస్తోంది. విత్తనాలకు సంబంధించిన రాయితీ సొమ్మును ప్రభుత్వమే చెల్లిస్తోంది. అన్ని పరీక్షలు చేసిన మీదట నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం రాయితీపై రైతులకు అందిస్తోంది.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

కరుణ రథం.. సేవ అమోఘం

సమాజంలో కొందరు మానవతావాదులు అందిస్తున్న సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయి. తోటి మనుషులు పడుతున్న బాధలను చూసి చలించిపోయి చేతనైన మేర సాయం అందిస్తూ గొప్ప మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఏ ఆసరా లేని అనాథ వృద్ధుల ఆకలి తీరుస్తూ అండగా ఉంటున్నారు. ఎదుటి మనిషి కన్నీరు తుడవడానికి ఏ బంధమూ ఉండనక్కర్లేదని.. స్పందించే హృదయం ఉంటే చాలని నిరూపిస్తున్నారు. అంధకారమయమైన వారి జీవితాల్లో వెలుగురేఖలా నిలుస్తున్నారు కృష్ణాజిల్లా నాగాయలంక మండలం తలగడదీవి గ్రామంలోని కరుణ రథం హోమ్ నిర్వాహకులు.

– కృష్ణాడెస్క్


వంట పూర్తిచేసాక క్యారియర్‌లలో భోజనం, తదుపరి పంపిణీకి సిద్ధం చేస్తున్న నామమాత్ర వేతన సేవకులు

అంధకారంలో వెలుగురేఖలా స్వచ్ఛంద సంస్థ

- అనాథ వృద్ధుల ఇంటికే భోజనం సరఫరా
- దాతల సాయంతో రెండు పూటలా క్యారియర్లు అందజేత
- నాగాయలంకలోని తలగడదీవిలో వినూత్న సేవ


దాత కేటాయించిన స్థలంలో కరుణ రథం హోమ్ కోసం ప్రత్యేకంగా నిర్మించిన వంటశాల

కుటుంబ సభ్యుల ఆసరా లేని అనేక మది వృద్ధులను ఆదుకోవాలనే తలంపు, జన్మభూమి రుణం తీర్చుకోవాలనే భావనతో తెలుగు లోగిలి అనే ఓ స్వచ్ఛంద సేవా సంస్థ కరుణ రథం హోమ్ ఏర్పాటు చేసి అందిస్తున్న సేవలు చూసి అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద అనాథ వృద్ధుల ఇంటి వద్దకే నేరుగా ఆహారం పంపిస్తున్నారు. నిత్య భోజన క్యారియర్‌ల సేవా పథకం గత ఆరేళ్లుగా కొనసాగిస్తూ సంస్థ ముందుకు సాగుతోంది. నాగాయలంక మండలంలోని తలగడదీవి గ్రామంలో గాంధీజీ జయంతి నేపథ్యంలో 2017 అక్టోబర్‌లో కరుణ రథం హోమ్ ఆవిర్భవించింది.

ముందుకొచ్చిన దాతలు..

సామాజిక సేవా తత్పరత కలిగిన భోగాది శ్రీరామలక్ష్మి వృద్ధులకు సేవలు అందించాలనే ఆలోచనతో స్ఫూర్తి పొందిన రియల్టర్ (హైదరాబాద్), సేవా సంస్థల నిర్వాహకుడు పేర్ల శ్రీనివాసరావు (పీఎస్ రావు) దాతగా ముందుకు వచ్చారు. జన్మనిచ్చిన తన గ్రామం రుణం తీర్చుకుంటానని ఆసరాలేని అనాథ వృద్ధులకు నిత్యం వారి ఇళ్లకే భోజనం పంపించి ఆదరిస్తాననే ప్రతిపాదన చేయడంతో గ్రామ ప్రముఖుడైన గణపేశ్వరాలయం ధర్మకర్త మండల రాంబాబు వంటశాల నిర్మాణానికి స్థలం ఇస్తానని ముందుకొచ్చారు. అందుకు అనుగుణంగా కరుణ రథం హోమ్ ఆవిర్భవించింది.

న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ ప్రోత్సాహం..

అప్పటి ఉభయ తెలుగు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ ఈ వినూత్న ఆశ్రమ ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. తనకు జన్మనిచ్చిన తలగడదీవి గ్రామంలో నిరుపేద, ఆసరా లేని అనాథ వృద్ధులు భోజనానికి ఎలాంటి ఇబ్బందులు పడరాదని భావించారు. ఆ ఉద్దేశంతో ప్రత్యేకంగా నిర్మించిన భోజనశాలలో వంటచేసి భోజనాలను క్యారియర్‌ల ద్వారా ఇళ్లకు పంపించే ఏర్పాటు చేశారు. పూర్తి నిర్వహణ, పంపిణీ బాధ్యతను సేవానిరతి కలిగిన భోగాది రామలక్ష్మికి అప్పగించినట్లు తెలుగు లోగిలి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పేర్ల శ్రీనివాసరావు (పీఎస్‌రావు) వివరించారు.

ఆరేళ్లుగా ముగ్గురు మహిళలు..

ఆరేళ్లుగా నిరంతరాయంగా వృద్ధులకు భోజన సేవలు అందిస్తున్నట్లు రామలక్ష్మి పేర్కొన్నారు. ఈ అరుదైన సేవలకు ముగ్గురు మహిళలు నిర్వహణ భారం వహిస్తున్నారని తెలిపారు. మొదట్లో 40 మంది వృద్ధులకు భోజన క్యారియర్‌లు రెండు పూటలా పంపేవారమని చెప్పారు. కొందరు చనిపోవడం ఇతర కారణాలతో ప్రస్తుతం ఆ సంఖ్య 25 మందికి చేరిందన్నారు. ఒక్కొక్కరికీ రెండు క్యారియర్‌లు కేటాయించారు (ఒకటి ఇచ్చి ఒకటి తెస్తారు). ఉదయం, సాయంత్రం రెండు సార్లు భోజనం అందిస్తారు. వంటశాలలో వంట చేయడానికి ఒక బేబి అనే మహిళ , భోజన క్యారియర్ చేర్చడం, తీసుకురావడానికి కోటేశ్వరమ్మ అనే మరో మహిళ సేవా కోణంలోనే నామమాత్రపు వేతనంపై పని చేస్తున్నారు. ఉదయం వేళలో 200 గ్రాముల వైట్ రైస్, కూర, పచ్చడి, మజ్జిగతో, సాయంత్రం ఒక కూరతో భోజన క్యారియర్‌లు పంపిస్తున్నారు.



మనిషి జన్మకు సంతృప్తి..



మనిషిగా పుట్టిన ప్రతిఒక్కరూ తమ జన్మకు సంతృప్తి, స్వాంతన చేకూరాలంటే ఇలాంటి సేవలే ఊతమిస్తాయి. వృద్ధులకు సాయం లాంటి సామాజిక సేవ చేయాలనే తలంపు ఉన్నప్పటికీ సాధ్యం కాదు. పీఎస్‌రావు లాంటి సేవామూర్తులు ముందుకు రావడంతోనే ఈ భోజన క్యారియర్‌లు అందించగలుగుతున్నాం.

– భోగాది రామలక్ష్మి, హోమ్ పర్యవేక్షణ, భోజన సేవల నిర్వాహకురాలు.

హోమ్ ఆదరణ మాటలతో చెప్పలేం



ప్రతి రోజు రెండు పూటలా భోజనం క్యారియర్‌లను ఇంటికి తెచ్చి ఇస్తారు. ఎవరి ఆసరా లేకుండా ఒంటరిగా ఉంటున్న నాకు కరుణ రథం హోమ్ అందించే భోజన సేవలు ఎంతగానో ఆదుకుంటున్నాయి. పీఎస్ రావు, రామలక్ష్మి లాంటి వారి సేవలకు కృతజ్ఞతలు చెల్లించుకుంటున్నా.

–దోవారి శశిరేఖ, ఒంటరి వృద్ధురాలు, గుజ్జల రవీంద్రనగర్ ఎస్సీ కాలనీ,

మాకు జవసత్వాలు కలిగిస్తున్నారు



గ్రామంలో గొప్ప కార్యక్రమం చేపట్టి ఒంటరిగా జీవిస్తున్న మాలాంటి వారికి భోజనం పెట్టి జవసత్వాలు కలిగిస్తున్నారు. రెండు పూటలా క్యారియర్‌లతో మాకు భోజనం అందించడం సామాన్య విషయం కాదు. ఈ వయస్సులో మాకు ఆసరాగా నిలిచిన దాత, సేవకులకు చేతులెత్తి మొక్కాల్సిందే.

–నాదెళ్ల భాస్కరరావు, వృద్ధుడు, ఎస్సీ కాలనీ

ప్రకృతి ఒడి.. ప్రశాంత లోగిలి!

- ఊరికి దూరంగా ఇల్లు
- పట్టణాల్లో పెరిగిన వేడి వాతావరణం
- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కాలుష్యం
- కరోనా నేర్పిన పాఠంతో ఆరోగ్యంపై దృష్టి
- వెంచర్లలో వ్యక్తిగత ఇళ్ల కొనుగోలుకు ఆసక్తి
- సొంత పొలాల్లో ఫాంహౌస్‌ల నిర్మాణం


మాచాని నాగరాజు తన పొలంలో నిర్మించుకున్న ఫాంహౌస్

కరోనా మహమ్మారి జీవనాన్ని కొత్త దారిలో తీసుకెళ్తోంది. పట్టణాల్లో చిన్న పని దొరికితే చాలు.. అపార్ట్‌మెంట్ ఎన్నో అంతస్తు అయినా పరవాలేదు.. సర్దుకుపోదాం అనే ధోరణి ఇప్పుడు తగ్గుతోంది. కాస్తంత రెంటు ఎక్కువైనా.. వ్యక్తిగత ఇల్లు మేలు అనే భావన ఇప్పుడు అధికమవుతోంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం.. కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్న నేపథ్యంలో పట్టణానికి కాస్త దూరమైనా ప్రశాంతమైన వాతావరణంలో నివసించేందుకు ఇష్టపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొక్కలు నాటేందుకు ఇష్టపడని వారు కూడా.. ఇప్పుడు ప్రకృతితో మమేకమై జీవించేందుకు ఆసక్తి చూపుతుండటం విశేషం.

– సాక్షి, కర్నూలు డెస్క్



ప్రశాంతత కోసం నగరానికి దూరంగా ఇల్లు కరోనా నేర్పిన పాఠం ఎప్పటికీ మర్చిపోలేం. నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. జనాభా అధికం కావడంతో ఇరుకు ప్రాంతాల్లో సర్దుకుపోయి జీవించాల్సిన పరిస్థితి. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఊరి బయట ప్రశాంత వాతావరణంలో ఇటీవల వ్యక్తిగత ఇల్లు నిర్మించుకున్నాం. గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రాంతంలో నివాసం ఉంటే వ్యాధుల బారి నుంచి కొంతవరకైనా బయటపడొచ్చు.

– హరగోపాల్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కర్నూలు

నంద్యాల పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలో ఓ వెంచర్ రూపుదిద్దుకుంటోంది. మహానంది మండలం బుక్కాపురం వద్ద 25 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ వెంచర్‌లో 12 విల్లాలను ఒక్కొక్కటి 25 సెంట్ల స్థలంలో నిర్మించనున్నారు. మిగిలిన స్థలం అంతా పచ్చదనానికి కేటాయిస్తున్నారు. అంటే.. ప్రశాంత జీవనానికి ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో ఈ వెంచర్‌ను చూస్తే అర్థమవుతోంది. జిల్లాలోని ప్రధాన పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. పిల్లల చదువులు, ఉద్యోగం, ఇతరత్రా అవసరాల దృష్ట్యా చాలా మంది పల్లెల నుంచి పట్టణాలకు చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాలు పట్టణాల్లో కలిసిపోతున్నాయి. జనాభా పెరుగుతున్న కొద్దీ ఎక్కడా ఖాళీ స్థలం కనిపించని పరిస్థితి. అంతో ఇంతో స్థలం ఉందంటే అపార్ట్‌మెంట్, లేక షాపింగ్ కాంప్లెక్స్ కడదామనే ఆలోచన వస్తోంది. ఈ కారణంగా కనుచూపు మేరలో కాంక్రీటు వనాలే కనిపిస్తున్నాయి. ఫలితంగా ఉష్ణోగ్రతలు ఏడాదికేడాది విపరీతంగా పెరిగి ఆందోళన కలిగిస్తున్నాయి.

అపార్ట్‌మెంట్ సంస్కృతి ఇటీవల కాలంలో అధికమైంది. ఉపాధి, ఉద్యోగంలో భాగంగా పట్టణాల్లో ఉండాల్సి రావడంతో ఎక్కడికక్కడ అపార్ట్‌మెంట్‌లు పుట్టుకొచ్చాయి. ఐదు అంతస్తులతో, వందలాది నివాసాలతో కూడిన ఈ కాంక్రీటు వనాలు మనుషులను దగ్గర చేస్తున్నా, మనసులను దూరంగా ఉంచుతున్నాయి. పక్కపక్కనే ఉంటున్నా ఎవరికి వారుగా బతికేస్తున్నారు. ఇక ఇటీవల కరోనా సృష్టించిన విలయం నేపథ్యంలో ఇలా ఇరుకిరుకు ప్లాట్లలో కాకుండా ఊరికి దూరంగా విశాలమైన వ్యక్తిగత ఇళ్లలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.

పచ్చని చెట్లు కనుమరుగు

పట్టణాల పరిధి పెరుగుతున్న కొద్దీ చుట్టుపక్క గ్రామాలు అందులో విలీనం అవుతున్నాయి. ఈ కారణంగా అభివృద్ధి విస్తరిస్తుండటంతో గ్రామీణ వాతావరణం కనుమరుగవుతోంది. శివారు కాలనీల్లో పెద్ద పెద్ద బిల్డింగ్‌లు పుట్టుకొస్తుండగా.. ఆ ప్రాంతంలోని చెట్లు తొలగించక తప్పని పరిస్థితి. కొంత స్థలం ఉందంటే చాలు.. రెండు ఇల్లు కట్టుకొని, ఒకటి బాడుగకు ఇచ్చుకోవడమో.. లేదంటే అపార్ట్‌మెంట్ కడితే జీవనానికి కాస్త ఊరట కలిగిస్తుందనే ఆశ పచ్చని చెట్లకు శాపమవుతోంది.

పల్లెకు పోదాం..

పట్టణాల్లో వాతావరణం రోజురోజుకూ కాలుష్యంతో నిండుకుంటోంది. ఇంటి నుంచి బయటకు వచ్చి ఎక్కడన్నా సేదతీరుదామంటే చెట్టు నీడను వెతుక్కోవాల్సిందే. సెంటు స్థలం ఉందంటే చాలు రోడ్డు పక్కనైతే దుకాణం కడుతున్నారు. ఇతర ప్రాంతాల్లో అయితే ఇంటి ఆలోచన చేస్తున్నారు. ఈ కారణంగా మధ్య తరగతి ప్రజలు తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నగరానికి దూరంగా, పల్లెలకు సమీపంలోని వెంచర్లలో ప్లాట్లు కొంటున్నారు. పదవీ విరమణ వయస్సు తర్వాత పల్లె వాతావరణంలో సేద తీరేందుకు ఇష్టపడుతున్నారు.

అభిరుచికి అనుగుణంగా వెంచర్లు

కొనుగోలుదారుల అభిరుచికి అనుగుణంగా రియల్ ఎస్టేట్ కూడా తన స్వరూపాన్ని మార్చుకుంటోంది. ఇప్పటి వరకు 3 నుంచి 5 సెంట్ల స్థలాలతో వెంచర్లు ఉండగా.. ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా 25 సెంట్ల స్థలాలతో వెంచర్లు వెలుస్తున్నాయి. ముఖ్యంగా వ్యాపారులు, అధికారులు, వైద్యులు ఈవిధమైన వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. రియల్టర్లు ఇలాంటి వాళ్లను ఎంపిక చేసుకొని అందుకు అనుగుణంగా వెంచర్లలో సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇలాంటి వెంచర్లలో ప్లాట్లు కూడా పరిమితంగా ఉంటుండటం విశేషం.

ఇంటిల్లిపాది ఆహ్లాదంగా గడుపుతాం



పట్టణాల్లో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోతుంది. అందుకే ఎమ్మిగనూరుకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న మా సొంత పొలంలోనే ఫాంహౌస్ కట్టుకున్నాం. ఉన్న ఇద్దరు కుమారులు మెట్రో నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. అయినప్పటికీ అక్కడ ప్రశాంతత లేదని చెబుతుంటారు. చిన్నబ్బాయి హర్ష ఉద్యోగం వదిలేసి ఇక్కడికొచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. యాంత్రిక జీవనం నుంచి బయటపడేందుకు, ఇంటిల్లి పాది సంతోషంగా గడిపేందుకు ఈ ప్రాంతం మాకు ఎంతో అనువుగా ఉంది. ప్రకృతి ఒడిలో సేదతీరితే ఎంతో ఆరోగ్యం.

– మాచాని నాగరాజు


నంద్యాల శివారులో 25 సెంట్ల స్థలంలో నిర్మించనున్న ఇంటి నమూనా


కర్నూలు నగరంలో కాంక్రీటు వనాలను తలపిస్తున్న అపార్ట్‌మెంట్లు

బిందు సేద్యానికి సర్కారు సాయం

సేద్యంలో సరికొత్త ఒరవడి సృష్టించి అన్నదాత అన్ని విధాల లాభపడేలా రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. సాగు పెట్టుబడి నుంచి విత్తనాలు, ఎరువులు, పంట దిగుబడులు కొనుగోలు వరకు తానే బాధ్యత తీసుకున్న ప్రభుత్వం సాగులో కొత్త సేద్యానికి అవసరమైన పరికరాలను సైతం సబ్సిడీపై ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ఇందులో బిందు సేద్యానికి తన వంతు సాయం చేస్తోంది.

చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

- 55 శాతం రాయితీతో స్ప్రింక్లర్లు
- రూ.40.78 కోట్ల పరికరాలకు ప్రతిపాదనలు
- పార్వతిపురం మన్యం జిల్లాలో 600 హెక్టార్లు లక్ష్యంగా అడుగులు
- ఆర్‌బీకేల్లో ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల పక్రియ


కొమరాడ మండలంలో బిందు సేద్యం ద్వారా పండిస్తున్న బొప్పాయి


పామాయిల్ తోటలో డ్రిప్ పరికరాలు

పార్వతీపురం టౌన్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ సంస్కరణలు చేపడుతున్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను(ఆర్‌బీకే) ఏర్పాటు చేసి రైతులకు విత్తనాలు, ఎరువులు, సాగు పరికరాలు అందుబాటులో ఉంచడం వంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టి రైతు ప్రభుత్వమన్న ముద్ర వేసుకున్నారు. అలాగే రైతులకు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయడమే లక్ష్యంగా సూక్ష్మ సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పెట్టుబడి ఖర్చులను తగ్గిస్తూ సాగును లాభదాయకంగా మార్చేందుకు రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలను సమకూర్చనుంది. రైతులకు నచ్చిన కంపెనీ ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ పక్రియను ప్రారంభించింది.

జిల్లాలో లక్ష్యం ఇలా..

డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి 2023 - 24 సంవత్సరానికి జిల్లాలోని 15 మండలాల పరిధిలో 600 హెక్టార్లను లక్ష్యంగా ఇచ్చారు. రైతులకు నచ్చిన కంపెనీలతో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను పొందవచ్చు. ఇందుకు సంబంధించి నాలుగు కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. డ్రిప్, స్ప్రింక్లర్లకు ఏర్పాటుకు సంబంధించి రిజిస్ట్రేషన్ పక్రియ జిల్లాలో ప్రారంభమైంది. వీటి అవసరం ఉన్న రైతులు తమ పరిధిలోని ఆర్‌బీకేకు వెళ్లి అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లను కలిసి తమ వివరాలను నమోదు చేయించుకోవాలి.

90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

సూక్ష్మసేద్య పథకంలో ఐదెకరాల్లోపు భూమి కలిగిన సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను ఇవ్వనున్నారు. డ్రిప్ యూనిట్ విలువలో 10 శాతం రైతు భరించాల్సి ఉంటుంది. అలాగే 55 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లను మంజూరు చేయనున్నారు. మిగతా 45 శాతం రైతు భరించాల్సి ఉంటుంది. 5 నుంచి 10 ఎకరాల మధ్య భూమి కలిగిన రైతులకు 70 శాతం సబ్సిడీ డ్రిప్, 45 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్ల పరికరాలను అందజేస్తారు. సబ్సిడీ పోను మిగతా సొమ్మును రైతులు భరించాల్సి ఉంటుంది. గతంలో సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకున్న రైతులు ఏడేళ్లు పూర్తి చేసుకుని ఉంటే వారు మళ్లీ పొందేందుకు అర్హులు. భూమి కలిగిన ప్రతి రైతుకు (భార్య, భర్త) ఈ సబ్సిడీ పథకం వర్తిస్తుంది. మామిడి, సపోటా, జామ, అరటి, బొప్పాయి, కూరగాయలు, పూలతోటలు, పసుపు, ఉల్లి పంటలకు డ్రిప్, వేరుశనగలకు స్ప్రింకర్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి 2023 - 24 సంవత్సరానికి ప్రభుత్వం జిల్లాకు 600 హెక్టార్లను లక్ష్యం ఇచ్చింది. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. డ్రిప్, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేయించుకోవాలి.

– శ్రీనివాసరావు, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

జయహో ఎవరెస్ట్

మే 29, 2023 నాటికి
ఎడ్మండ్ హిల్లరీ, టెన్జింగ్ నార్గేలు
ఎవరెస్ట్ అధిరోహించి 70 ఏళ్లు.
ఆ సందర్భంగా నేపాల్‌లోని లుక్లా ఎయిర్‌పోర్ట్‌లో
వాళ్లిద్దరి బంగారు విగ్రహాలు ప్రతిష్ఠించారు.
అంతేనా?
షెర్పాల ఘన ఆరోహణ సంప్రదాయాన్ని నిలబెడుతూ
'ఎవరెస్ట్ మేన్'గా ఖ్యాతికెక్కిన 'కమిరత్న షెర్పా'
మే 23న 28వసారి ఎవరెస్ట్ ఎక్కి
ఆ మహా పర్వతం ఒడికి తాను
ముద్దుబిడ్డని నిరూపించుకున్నాడు.
ఎవరెస్ట్– ఒక ధవళ దేవత.
ఈ ఆరాధన ఎప్పటికీ వైరలే.


హిల్లరీ–నార్గే విగ్రహాలు


కమిరత్న షెర్పా

ఎంత బాగుందో ఆ సన్నివేశం

మే 26న, నేపాల్‌లోని లుక్లా ఎయిర్‌పోర్ట్‌లో (దీని పేరు టెన్సింగ్–హిల్లరీ ఎయిర్‌పోర్ట్) ఎడ్మండ్ హిల్లరీ, టెన్జింగ్ నార్గే బంగారు విగ్రహాలు ప్రతిష్ఠిస్తే ఆ కార్యక్రమంలో హిల్లరీ కుమారుడు పీటర్ హిల్లరీ, టెన్జింగ్ కుమారుడు జామ్లింగ్ నార్గే పాల్గొన్నారు. డెబ్బయి ఏళ్ల క్రితం తమ తండ్రులు సృష్టించిన ఘన చరిత్రను వాళ్లు గుర్తు చేసుకోవడం, పొంగిపోవడం అందరినీ ఉద్వేగభరితం చేసింది. ఎవరెస్ట్‌ను నేపాల్‌వైపు ఎక్కాలనుకునేవారు మొదట లుక్లా ఎయిర్‌పోర్ట్‌లోనే దిగుతారు కాబట్టి వారికి స్ఫూర్తినివ్వడానికి, 70 ఏళ్ల ఉత్సవాల్లో భాగంగా ఈ విగ్రహాలు ఆవిష్కరించారు.

ఇప్పటికి 6 వేల మంది

డెబ్బయి ఏళ్ల క్రితం అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ హిల్లరీ, నార్గేల జంట ఎవరెస్ట్‌ను అధిరోహించాక అప్పటి నుంచి ఇప్పటి వరకూ హిమాలయన్ డేటాబేస్ ప్రకారం ఆరు వేల మంది ఎవరెస్ట్ అధిరోహించారు. దానికి రెట్టింపు మంది ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వరకూ వెళ్లి వచ్చారు. పర్వతారోహకుల తొలి ఆరోహణ కలగా ఇప్పటికీ ఎవరెస్ట్ నిలిచి ఉంది. ఇప్పుడు నేపాల్‌వైపు నుంచి ఎవరెస్ట్ అధిరోహించాలంటే 9 లక్షలు పర్మిట్ ఫీజు కట్టాలి. ఈ సీజన్‌లో 478 మందికి పర్మిట్ ఇచ్చారు. వీరిలో చాలామంది గైడ్‌ను తీసుకెళతారు కాబట్టి రికార్డు స్థాయిలో 900 మంది ఈ సీజన్‌లో ఎవరెస్ట్‌ను అధిరోహిస్తారని భావిస్తున్నారు.

మంచుపులి

హిల్లరీకి దారి చూపేందుకు వచ్చి చరిత్రలో నిలిచిన షెర్పా టెన్జింగ్ నార్గేను 'మంచు పులి' అని పిలుస్తారు. ఆ షెర్పాల జాతికే చెందిన కమిరత్న షెర్పాను 'ఎవరెస్ట్ మేన్' అని పిలుస్తారు. ఎందుకంటే ఇతను ఎవరెస్ట్ గైడ్‌గా పని చేస్తూ ఇప్పటికి 27సార్లు ఆ శిఖరాగ్రాన్ని ఎక్కి దిగాడు. అందుకని అత్యధికసార్లు ఎవరెస్ట్ ఎక్కిన ఘనత ఇతని పేరు మీద ఉంది. అయితే మొన్నటి మే 22న పసాంగ్ దవ రత్న అనే మరో షెర్పా 27వసారి ఎవరెస్ట్ అధిరోహించి కమిరత్న రికార్డును సమం చేశాడు. ఇది ఏమాత్రం రుచించని కమిరత్న ఆ మరుసటి రోజు ఉదయానికి ఎవరెస్ట్ ఎక్కి 28 వసార్లు ఎక్కిన ఏకైక వ్యక్తిగా రికార్డు తన పేరు మీదే నిలుపుకున్నాడు. ఈ మే నెలలో కమిరత్న రెండుసార్లు ఎవరెస్ట్ ఎక్కాడు. హైదరాబాద్ బెజవాడల మధ్య తిరిగినంత సులభంగా ఎవరెస్ట్ అధిరోహిస్తున్న ఇతణ్ణి మరో మంచుపులి అనక ఇంకేం అనగలం.

వైరల్

డాక్టర్ గారు డ్యాన్స్ చేశారు!



పని ఒత్తిడిలో ఉన్న వారికి హాబీలే రిలాక్సేషన్.

కర్నాటకలోని మంగళూరుకు చెందిన దర్శిని రేష్మా ప్రదీప్ డాక్టర్ కావాలనుకొని డ్యాన్సర్ కాలేదు. డాక్టర్ కావాలనుకున్న కలను నిజం చేసుకున్న దర్శిని ఎంత బిజీగా ఉన్నాసరే, తనలోని 'నృత్యకళ'ను కాపాడుకుంటోంది. పని ఒత్తిడి నుంచి బయటపడడానికి, మనసు తేలిక చేసుకోవడానికి ఆమె అనుసరించే మార్గం.. డ్యాన్స్. షారుక్‌ఖాన్ హీరోగా చేసిన 'రా.వన్' సినిమాలోని పాపులర్ సాంగ్ 'చెమ్మక్ చెల్లో' పాటకు ఆమె చేసిన డ్యాన్స్ వీడియో క్లిప్ ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్‌గా మారింది.'ఐ లవ్ దిస్ పార్ట్ ఆఫ్ ది సాంగ్' కాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ వీడియోక్లిప్ 2.5 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'చెమ్మకు చెల్లో' సాంగ్ సంగతి ఎలా ఉన్నా...

దర్శిని డ్యాన్స్ స్టెప్పులను చూస్తుంటే మన 'ఇంద్ర' సినిమాలోని 'దాయి దాయి దామ్మా కులికే కుందనాలబొమ్మ' వీణ స్టెప్పులు గుర్తుకొస్తున్నాయి. 'గుడ్ డ్యాన్సింగ్' 'వాట్ ఏ లవ్లీ డ్యాన్స్'... మొదలైన కామెంట్స్‌తో స్పందించారు నెటిజనులు.

ఆ రోజుల్లో... ఐషూ



ఈ ఫొటోను చూస్తూ 'ఇది అంతర్జాల విందు' అన్నారు ఒక యూజర్.

21 సంవత్సరాల వయసులో 'మిస్ వరల్డ్' అందాల కిరీటాన్ని గెలుచుకుంది ఐశ్వర్య రాయ్. ఆ శుభదినాన తల్లితో కలిసి ఫ్లోర్ మ్యాట్‌పై కూర్చొని భోజనం చేస్తున్న ఫొటో వైరల్‌గా మారింది. భారతీయతకు, భారతీయ భోజన సంప్రదాయాలకు అద్దం పట్టే ఫొటో ఇది.

పాపులర్ పేజ్ 'హిస్టారిక్ విడ్స్'లో షేర్ చేసిన ఈ ఫొటో గంటల వ్యవధిలోనే 2.6 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

'సో...ప్యూర్ అండ్ జెన్యూన్' 'మన విలువలు, సంప్రదాయాలు భూమాతను, భోజన సంప్రదాయాలను గౌరవిస్తాయి'... ఇలా నెటిజనులు రకరకాలుగా స్పందించారు.

మండే ఎండలు కాస్త జాగ్రత్త



'అబ్బబ్బా! ఎండలు మండిపోతున్నాయి' అని ఇంట్లో కూర్చొనే అపసోపాలు పడుతుంటారు చాలామంది. అలాంటిది ఎర్రటి ఎండలో గంటల తరబడి నిలబడడం సామాన్య విషయం కాదు. కాని సామాన్యులకు తప్పదు. తనను తాను సామాజిక కార్యకర్తగా పరిచయం చేసుకునే లక్నోకు చెందిన ఖుషీ పాండే వీధి వీధి తిరుగుతూ పండ్లు, కూరగాయలు అమ్ముకునేవాళ్లకు, రిక్షా కార్మికులకు కాటన్ టవల్స్ ఇవ్వడంతో పాటు ఎండలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పింది.

'నో నీడ్ టు వర్రీ ఎబౌట్ ది హీట్' కాప్షన్‌తో కూడిన ఖుషీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కొద్ది సమయంలోనే 5.15 లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'మీ వీడియో నన్ను బాగా ఇన్‌స్పైర్ చేసింది. నేను టోపీలు పంచాలనుకున్నాను. ఈ వీడియో చూసిన తరువాత కాటన్ టవల్స్ బెటర్ అనిపించింది. తలతో పాటు మెడను కూడా కవర్ చేస్తాయి' అని ఒక యూజర్ స్పందించాడు.

అమ్మాచిని మించి దైవం ఉన్నదా!

మనం చిన్నవయసులో ఉన్నప్పుడు అమ్మ ఎత్తుకుంటుంది. కుంచెం నడవడం వచ్చిన తరువాత కూడా ఎత్తుకోమని అమ్మ దగ్గర మారాం చేసేవాళ్లం. అలాంటి అమ్మను ఎత్తుకోవడాన్ని మించిన అదృష్టం ఏం ఉంటుంది!



కేరళకు చెందిన రోజన్ పరంబిల్ స్విట్జర్లాండ్‌లో ఉద్యోగం చేస్తాడు. అయిదు సంవత్సరాల తరువాత సొంత ఊరు వచ్చాడు. వయసు పైబడి, బలహీనంగా కనిపిస్తున్న అమ్మాచి(అమ్మ)ను చూసి చాలా బాధేసింది. ఎంతో కాలంగా ఇంటి నాలుగు గోడలకే పరిమితమైన అమ్మకు బయటిగాలి తాకేలా ట్రిప్ ప్లాన్ చేశాడు. ఈ చిరు ప్రయాణంలో వారు ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు. రకరకాల జ్ఞాపకాలను కలబోసుకుని తెగ నవ్వుకున్నారు. నచ్చిన చోట ఆగి సెల్ఫీలు తీసుకున్నారు. గతంలో ఒకసారి రోజన్ తన తల్లిని స్విట్జర్లాండ్ తీసుకువెళ్లి యూరప్‌లోని రకరకాల ప్రదేశాలు చూపెట్టాడు. తల్లిలో అప్పుడు కనిపించిన ఎనర్జీ ఇప్పుడు మరోసారి కనిపించింది. ట్రిప్ కోసం రోజన్ తన తల్లిని భుజాల మీద మోస్తూ కారు దగ్గరికి తీసుకువెళుతున్న వీడియో వైరల్ అయింది. నెటిజనులను కదిలించేలా చేసింది.

దివ్యమైన ఐడియా సుమీ!



అమెరికాలో నివసిస్తున్న దివ్య మయ్యా చీరె ధరించి స్కీయింగ్ చేస్తూ ఇంటర్నెట్ మినీ సెలబ్రిటీగా మారింది. 'స్కీయింగ్‌కు చీర ధరించడమే కరెక్ట్ అని చెప్పడం నా ఉద్దేశం కాదు. అది భారతీయతను ప్రతిఫలించే ప్రతీక మాత్రమే' అంటుంది దివ్య.

దివ్య వీడియోల పుణ్యమా అని ఎంతోమంది మహిళలు చీరె ధరించి స్కీయింగ్ చేస్తూ, భారతీయతను చాటుకుంటూ 'భేష్' అనిపించుకున్నారు. చీరె ధరించి స్కీయింగ్ చేయడానికి సంబంధించిన సలహాలు దివ్యను అడుగుతుంటారు. తన ఛాయిస్ మాట ఎలా ఉన్నా... హెల్మెట్, గ్లోవ్స్‌లాంటి సేఫ్టీలను ధరించడం మాత్రం దివ్య మరవదు. చీర ధరించే కాదు లెహంగా ధరించి కూడా స్కీయింగ్ చేయగలను అంటూ చేసిన వీడియో వైరల్ అయింది.

కట కటా... మర్కటా!



ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ కోతి వీడియో వైరల్ అయింది. మిలియన్ వ్యూస్ సొంతం చేసుకుంది.

ఇంతకీ ఈ వీడియోలో ఏముంది అనగా....ఒకాయన ఏదో ఆలోచిస్తూ ఆలయం మెట్లు ఎక్కుతూ వస్తుంటాడు. ఆ మెట్ల పక్కన గద్దెపై కూర్చున్న కోతి ఆ వ్యక్తి కళ్లద్దాలను లాగేసుకుంది. ఇతడు బిత్తరపోతూ ఉండగానే 'ఈ అద్దాలు నాకు సెట్ అవుతాయా' అన్నట్లుగా ట్రయల్స్ స్టార్ట్ చేసింది కోతి. ఈలోపు అక్కడికి వచ్చిన ఒక మహిళ కొన్ని పండ్లను కోతి ముందు పెట్టింది. అంతే...ఆ అద్దాలను పక్కన పెట్టి పండ్ల పని పట్టింది కోతి. ఈ వీడియోను చూస్తూ బిగ్గరగా నవ్వుతున్న వాళ్లతో పాటు 'అయ్యో..ఈ వనజీవులు ఎంత ఆకలితో అల్లడుతున్నాయో కదా!' అని బాధపడుతున్న వారూ ఎందరో ఉన్నారు.

హెల్త్



మల్టిపుల్ స్క్లిరోసిస్ అంటే?

మన ప్రతి అవయవమూ మెదడు నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తుంటుంది. ఆ ఆదేశాలు అందడానికి నరాలు (నర్వ్స్) దోహదపడతాయి. ఈ నరాలపైన ఉంటూ, వాటిని రక్షించేందుకు మైలీన్ షీత్ అనే పొర కీలక భూమిక పోషిస్తుంది. అయితే కొందరిలో తమ సొంత వ్యాధినిరోధక కణాలే మైలీన్ షీత్‌ను దెబ్బతీయడం వల్ల మెదడు నుంచి అందే ఆదేశాలు సక్రమంగా అందవు. దాంతో కొన్ని అవయవాలు సక్రమంగా పనిచేయవు. ఈ కండిషన్‌ను 'మల్టిపుల్ స్క్లిరోసిస్'గా పేర్కొంటారు. ఈ 'మల్టిపుల్ స్క్లిరోసిస్' సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

'మల్టిపుల్ స్క్లిరోసిస్' జబ్బు వైకల్యం తెచ్చిపెడుతుంది. అయితే ఇదెలా ఎందుకు జరుగుతుందన్న విషయం స్పష్టంగా తెలియదు. ఇప్పటికి దీన్ని పూర్తిగా నయం చేయలేపోయినప్పటికీ చాలావరకు అదుపు చేయవచ్చు.

లక్షణాలు: మల్టిపుల్ స్క్లిరోసిస్ లక్షణాలు వ్యక్తి నుంచి వ్యక్తికి మారుతుంటాయి. ఏ నరాలు దెబ్బతిన్నాయన్నదాన్ని బట్టి లక్షణాలు మారుతుంటాయి. ఉదాహరణకు కాళ్లకు వచ్చే నరాలు దెబ్బతిన్నవారిలో నడక కష్టమవుతుంది. సాధారణ లక్షణాలు ఇలా ఉంటాయి.

- దెబ్బతిన్న నరాన్ని బట్టి కాళ్ల చేతుల చివర్లు మొద్దుబారినట్లుగా మారడం.
- ఒక్కోసారి మెడ కదిలించినప్పుడు (ప్రధానంగా మెడను ముందుకు ఒంచినప్పుడు) షాక్ కొట్టినట్లుగా అనిపించడం. (దీన్నే 'లెర్‌మైట్ సైన్' అంటారు).
- ఒంటి కదలికల్లో సమన్వయం లోపించడం. నడిచే సమయంలో సమన్వయం కోల్పోవడం
- కొందరిలో చూపు పాక్షికంగా దెబ్బతినడం. మరికొందరిలో చూపు పూర్తిగా పోవచ్చు కూడా.
- ఒకే వస్తువు రెండుగా కనిపించడం.
- సెక్స్, మూత్రవిసర్జన, మలవిసర్జన సక్రమంగా జరగకపోవడం.
- అలసట, నీరసం, నిస్సత్తువ
- మాట ముద్దగా రావడం
- నేర్చుకోవడం / తెలుసుకోవడంలో సమస్యలు (కాగ్నిటివ్ ప్రాబ్లమ్స్)
- మూడ్స్ త్వరత్వరగా మారిపోవడం.


డా॥ వై. మురళీధర్ రెడ్డి
సీనియర్ న్యూరాలజిస్ట్

నిర్ధారణ: ఈ జబ్బును నిర్ధారణ చేయడానికి నిర్దిష్టంగా వైద్య పరీక్ష ఏదీ లేదు. ఇతర వ్యాధులేవీ లేకపోవడాన్ని చూస్తూ (రూల్ అవుట్ చేస్తూ) దీన్ని కనుగొంటారు. లంబార్ పంక్చర్ అనే పరీక్షతో వెన్నెముక చివర చిన్న ముక్కనూ, మెదడు, వెన్నుపాము చుట్టూ ఉండే 'సెరిబ్రో స్పైనల్ ఫ్లుయిడ్' అనే ద్రవాన్ని సేకరించి పరీక్షించడం ద్వారా దీన్ని తెలుసుకుంటారు. ఇటీవల అందుబాటులోకి వచ్చిన యాంటీబాడీలను పరీక్షించే సరికొత్త 'కప్పా ఫ్రీ లైట్ చెయిన్స్' అనే వైద్య పరీక్ష ఈ వ్యాధి నిర్ధారణకు దోహదపడుతుంది.

చికిత్స: ఇంటర్‌ఫెరాన్ బీటా మెడికేషన్ అనే మందుల్ని ఇంజెక్షన్ ద్వారా దేహంలోకి పంపడం, గ్లాటిరమెర్ ఎసిటేట్ అనే మందుని చర్మం కింద ఇంజెక్ట్ చేయడంతో పాటు మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్స ప్రక్రియల ద్వారా ఈవ్యాధిని అదుపు చేయడానికి ప్రయత్నిస్తారు. టెరిఫ్లునమైడ్ అనే టాబ్లెట్లను నోటి ద్వారా ఇస్తారు. ఈ మందు సమస్య పదే పదే రాకుండా నివారిస్తుంది. ఈ మందులతో అనేక కొత్త మందుల్ని ఇటీవలే ఎఫ్‌డీఏ ఆమోదించింది.

పిల్లల్లో నీళ్ల విరేచనాలవుతుంటే...

నీళ్ల విరేచనాలను డయేరియా అంటారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న ఈ సీజన్‌లో చెరుకురసం, శీతలపానీయాలు తాగడం వల్ల పిల్లలకు విరేచనాలు అయ్యే అవకాశాలూ ఎక్కువే. డయేరియా రెండు వారాల కంటే తక్కువగా ఉంటే దాన్ని అక్యూట్ డయేరియా అనీ, అదే రెండు వారాలకు పైగా కొనసాగితే దాన్ని క్రానిక్ లేదా పెరిసిస్టెంట్ డయేరియా అంటారు. నిజానికి ఈ నీళ్ల విరేచనాలు పెద్దగా ప్రమాదకరం కావుగానీ, అది డీ–హైడ్రేషన్‌కు దారితీసిన సందర్భాల్లో ప్రమాదకరంగా పరిణమించవచ్చు.

మెడి టిప్

విరేచనాలను నివారించడానికి సూచనలివి...

- ఆహారం కలుషితం (కంటామినేట్) కాకుండా పరిశుభ్రమైన పరిసరాల్లో సరిగ్గా నిల్వ చేయాలి. అక్కడ తగినంత వెలుతురు, గాలి వస్తుండాలి.
- ఆహారం తీసుకునే ముందు పిల్లలు తమ చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కునేలా, అలాగే మల విసర్జన తర్వాత పిల్లలు తమ చేతులు శుభ్రంగా కడుక్కునేలా మంచి హైజీనిక్ అలవాట్లు నేర్పాలి.
- పిల్లలు మట్టిలోగాని, తోటలు, పొలాల్లోనూ, పెంపుడు జంతువులతో ఆడుకున్న తర్వాతా వారు చేతులు శుభ్రంగా కడుక్కునేలా చూడాలి.

తగ్గకపోతే... విరేచనాలవుతున్న పిల్లలకు మొదట ఓరల్ రీహైడ్రేషన్ థెరపీ ఇవ్వాలి. అంటే నోటి ద్వారా తగినన్ని ద్రవాలు తాగించాలి. మందుల షాపుల్లోని ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్స్, ఇంట్లోని సూప్‌లు, పళ్లరసాల వరకు తాగించవచ్చు. అప్పటికీ పిల్లలు డీలాపడిపోతుంటే ఆసుపత్రిలో చేర్పించి, సెలైన్ పెట్టాల్సి రావచ్చు. పరిస్థితిని బట్టి డాక్టర్లు యాంటీబయాటిక్స్ కూడా సూచించవచ్చు.



• పొగాకు

May 31 WORLD NO TOBACCO DAY

ఆరోగ్యాన్ని పొడిచే పిడిబాకు!



మన దేశంలో 26.7 కోట్ల మంది పొగతాగడం లేదా పొగాకు ఉత్పాదనలను వినియోగిస్తున్నారు. ఆ అలవాటు కారణంగా వచ్చే క్యాన్సర్లు, పక్షవాతం, గుండెజబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలూ వంటి వాటితో మన దేశవ్యాప్తంగా ప్రతి ఏటా 13.50 లక్షల మంది ప్రాణాలు వదులుతున్నారు. ఇక ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) లెక్కల ప్రకారం ప్రపంచం మొత్తం మీద 172 కోట్ల మంది సిగరెట్లు తాగుతున్నారు. వీళ్లంతా ప్రతిరోజూ 2000 కోట్ల సిగరెట్లను కాలుస్తుంటారు. వీళ్లలో 35 ఏళ్ల వయసు పైబడి, పొగతాగే అలవాటున్న వ్యక్తులు వివిధ రకాల జబ్బుల పాలబడి, తమ ఆరోగ్యం కోసం పెడుతున్న ఖర్చు ఎంతో తెలుసా? అక్షరాలా 1,77,342 కోట్లు! సొంత ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ, ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ మరీ మనం చేసే వృథా ఇది!! ఈ నెల 31న 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం' సందర్భంగా ఆరోగ్యానికి చేటు తెచ్చుకునేలా ఎన్నెన్ని అనర్థాల్ని చేజేతులారా ఆహ్వానిస్తున్నామో తెలుసుకునేందుకు ఉపయోగపడేదే ఈ కథనం.

పొగాకు అలవాటు రెండు రకాలుగా ఉంటుంది. చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి నిప్పుతో కాలుస్తూ పొగవెలువరించే అలవాటుతో పాటు... పొగ ఏదీ లేకుండానే గుట్కా, ఖైనీ. తమలపాకుతో నమిలే జర్దారూపంలో పొగాకు నమలడం, నశ్యం రూపంలో పీల్చడం ద్వారా కూడా పొగాకుకు బానిసలవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా చనిపోయే ప్రతి ఐదుగురిలో ఒకరు కేవలం పొగాకు వల్లనే ప్రాణాలొదులుతున్నారు.

అణువణువునా విషం...

అత్యంత హానికరమైన, ఆరోగ్యానికి ప్రమాదకరమైన వాటిల్లో ప్రపంచమంతటా లీగల్‌గా అమ్మే రెండు ఉత్పాదనల్లో మరీ ప్రమాదకరమైనవి సిగరెట్లు, బీడీల వంటివి మాత్రమే. మరొకటి మద్యం.

నాలుగు అంగుళాల పొడవుండే సిగరెట్‌లో 4,800 హానికరమైన రసాయనాలుంటాయి. అందులో మళ్లీ 70 – 72 రసాయనాలు తప్పక క్యాన్సర్‌ను కలగజేసేవే. ఒకసారి పొగతాగడం అంటూ మొదలుపెడితే... ఈ వీళ్లలో దాదాపు సగం మంది (50% మంది) దీని వల్ల వచ్చే అనర్థాలు, అనారోగ్యాల కారణంగానే మరణించే అవకాశం ఉందని అధ్యయనాలు తెలుపుతున్నాయి.

ప్రతి అవయవానికీ క్యాన్సర్ ముప్పు...

వెలుపల మన తల నుంచి కాలి చివరలు మొదలుకొని దేహం లోపలా ఉన్న అన్ని అంతర్గత అవయవాల వరకు దేన్నీ వదలకుండా పొగాకు తన దుష్ప్రభావాలకు గురిచేస్తుంది. దాదాపు 30 శాతం వరకు క్యాన్సర్లకు పొగాకే కారణం. తల నుంచి లెక్క తీసుకుంటే... హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లు, నోటి క్యాన్సర్లు పొగాకు కారణంగానే ఎక్కువగా వస్తాయి. నోరు మొదలుకొని... దేహంలోపలికి వెళ్లే కొద్దీ... ల్యారింగ్స్, ఈసోఫేగస్, పెద్దపేగు (కొలోన్), మలద్వార (కోలోరెక్టల్) క్యాన్సరు, బ్లడ్‌క్యాన్సర్లు, కాలేయ క్యాన్సర్లు, పాంక్రియాటిక్ క్యాన్సర్లు, బ్లాడర్ క్యాన్సర్లు... వీటన్నింటికీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పొగాకే కారణం. ఇక ప్రోస్టేట్ క్యాన్సర్‌కూ, పొగాకుకూ నేరుగానే సంబంధం ఉంది. పొగాకులోని బెంజీన్ రసాయనం 'అక్యూట్ మైలాయిడ్ లుకేమియా' (ఒకరకం బ్లడ్‌క్యాన్సర్)కు కారణమవుతుంది.

ఈ క్యాన్సర్లతో పాటు ఇక గుండెజబ్బులు, పక్షవాతం, రక్తనాళాలకు సంబంధించిన జబ్బులు... ఇలా శరీరంలోని ప్రతి కీలక అవయవాన్నీ పొగాకు దెబ్బ తీస్తుంది.

ఆరోగ్యాన్నీ వాతావరణాన్నే కాదు... సిగరెట్ వ్యర్థాలతో భూమిని సైతం...

సిగరెట్లు, బీడీలు, చుట్టలు తాగే సమయంలో వెలువడే పొగతో ఆరోగ్యానికి, పర్యావరణానికీ ఎలాగూ ముప్పు చేకూరుతుందన్నది కనబడే సత్యం. కాకపోతే మనం విస్మరించే ఇంకో వాస్తవం ఉంది. సిగరెట్ తాగాక మిగిలిపోయే పీకల (బట్స్) బరువు 77 కోట్ల కిలోలు, అంటే 7.70 లక్షల టన్నులు. ఏటా ఇన్నేసి టన్నుల మొత్తంలో సిగరెట్ వ్యర్థాలు మనం నివాసం ఉంటున్న ఈ భూమిని కలుషితం చేస్తున్నాయి.

బానిసగా చేసుకునేది నికోటిన్...

పొగాకులోని నికోటిన్... ఆ ఉత్పాదనలకు బానిసయ్యేలా చేస్తుంది. సిగరెట్‌లోని పొగపీల్చిన 10 సెకండ్లలో నికోటిన్ మెదడును చేరుతుంది. ఏదైనా సంతోషం కలిగించే పనిని చేయగానే... మెదడులో డోపమైన్ అనే రసాయనం వెలువడుతుంది. నికోటిన్ మెదడును చేరగానే వెలువడే ఈ డోపమైన్ కారణంగానే హాయిగా, రిలాక్స్‌డ్‌గా ఉన్న భావన కలుగుతుంది. ఆ అనుభూతిని తరచూ పొందేందుకు స్మోకింగ్‌ను ఆశ్రయిస్తారు. ఆ తర్వాత్తర్వాత అదే అనుభూతి కలగడం మునపటంత బలంగా లేకపోయినప్పటికీ... ఆ అనుభవం కోసం వెంపర్లాడటంతో నికోటిన్‌కు బానిసవుతారు. నికోటిన్ కోరిక ఎంత బలంగా ఉంటుందంటే... ప్రఖ్యాత మనస్తత్వ నిపుణుడు సిగ్మండ్ ఫ్రాయిడ్‌కు 'స్క్వామస్ సెల్ కార్సినోమా ఆఫ్ పాలెట్' అనే రకం క్యాన్సర్ సోకింది. అంగిలిలో వచ్చిన ఈ నోటిక్యాన్సర్ నుంచి విముక్తి కల్పించడం కోసం డాక్టర్లు ఆయనకు దాదాపు 30కి పైగా సర్జరీలు చేశారు. దవడను, సైనస్‌నూ తొలగించారు. అయినా ఆయన సిగరెట్ మానేయలేదు. చివరకు అంగిలికీ... కంటిగూడుకూ మధ్య ఉన్న క్యాన్సర్ గడ్డను శస్త్రచికిత్సతో తొలగించడం సాధ్యం కాలేదు. దాదాపు 16 ఏళ్ల పాటు పొగాకు మానేయమని ఎందరు ప్రాధేయపడ్డా ఫ్రాయిడ్ మానలేదు. ఇదీ నికోటిన్ పవర్.


డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు,
సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్

పొగాకు ఉత్పాదనల కోసం ప్రపంచంలోనే అసహ్యకరమైన రంగు

పాంటోన్ 448–సి అనేది ప్రపంచంలోనే అత్యంత అసహ్యకరమైన రంగు. దీన్ని ఈ చావును సూచించే రంగుగా కూడా చెబుతారు. ఈ రంగుతోనే సిగరెట్ ప్యాక్‌లు తయారవుతున్నప్పటికీ... పొగతాగేవారిని ఆకర్షించడం కోసం దాన్ని మరింత ఆకర్షణీయంగా చేసి వాడుతుంటారు.

పొగమానేసిన మరుక్షణమే ప్రయోజనాలు...

పొగతాగడం మానేసిన మరుక్షణం మనకు కలగాల్సిన ప్రయోజనాలు మొదలవుతాయి. చివరి సిగరెట్ తర్వాత 20 నిమిషాల్లో గుండె వేగం నార్మల్‌కు వస్తుంది. 12 గంటల తర్వాత దేహంలో కార్బన్‌మోనాక్సైడ్ మోతాదులు తగ్గడంతో బాటు రక్తంలో ప్రమాదకరమైన విషాల మోతాదులు తగ్గుతాయి. లంగ్స్ మూడు నెలల్లో నార్మల్‌కు వస్తాయి. ఏడాది తర్వాత హార్ట్‌ఎటాక్ వచ్చే ముప్పు (రిస్క్) సగానికి తగ్గిపోతుంది. పదిహేనేళ్లు మానేయగలిగితే... సిగరెట్ అలవాటుకు ముందు ఎలాంటి ఆరోగ్యం ఉంటుందో... అదే ఆరోగ్యం మళ్లీ సమకూరుతుంది.

మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీ: హారికకు నాలుగో స్థానం



భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీలో నాలుగో స్థానం సంపాదించింది. సైప్రస్‌లో శనివారం ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత హారిక, పొలీనా షువలోవా (రష్యా), తాన్ జాంగి (చైనా) 6.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... షువలోవాకు రెండో ర్యాంక్, తాన్ జంగికి మూడో ర్యాంక్, హారికకు నాలుగో ర్యాంక్ ఖరారయ్యాయి. దినారా (జర్మనీ) 7 పాయింట్లతో విజేతగా నిలిచింది. నిర్ణీత నాలుగు గ్రాండ్‌ప్రి సిరీస్ టోర్నీల తర్వాత టాప్-2లో నిలిచిన కాటరీనా లాగ్నో (రష్యా; 325 పాయింట్లు), అలెక్సాంద్రా గోర్యాచ్‌కినా (రష్యా; 318.5 పాయింట్లు) 2023-2024 క్యాండిడేట్ చెస్ టోర్నీకి అర్హత సాధించారు.

ఫైనల్లో ప్రణయ్

సెమీస్‌లో సింధు పరాజయం



కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత నంబర్ వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రణయ్ తొలి గేమ్‌లో 19-17తో ఆధిక్యంలో ఉన్న దశలో అతని ప్రత్యర్థి క్రిస్టియన్ అడినాటా (ఇండోనేసియా) గాయం కారణంగా వైదొలిగాడు. దాంతో ప్రణయ్‌ను విజేతగా ప్రకటించారు. నేడు జరిగే ఫైనల్లో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)తో ప్రణయ్ తలపడతాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. సెమీఫైనల్లో సింధు 14-21, 17-21తో గ్రెగోరియా మరిస్కా టున్‌జంగ్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయింది. సెమీస్‌లో ఓడిన సింధుకు 6,090 డాలర్ల (రూ. 5 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 6,420 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మళ్లీ ఓడిన భారత్



లండన్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య పురుషుల ప్రొ లీగ్ టోర్నీలో భారత జట్టుకు మరో ఓటమి ఎదురైంది. యూరోప్ అంచె లీగ్‌లో భాగంగా బ్రిటన్ జట్టుతో శనివారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా 2-4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. శుక్రవారం బెల్జియంతో జరిగిన మ్యాచ్‌లోనూ భారత్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. బ్రిటన్‌తో జరిగిన పోరులో భారత్ తరఫున నమోదైన రెండు గోల్స్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (14వ, 43వ ని.లో) సాధించాడు. బ్రిటన్ తరఫున టిమోతీ నర్స్ (7వ ని.లో), థామస్ (32వ ని.లో), లీ మార్టన్ (34వ ని.లో), నికోలస్ (54వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మొత్తం తొమ్మిది జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో 10 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న భారత్ 19 పాయింట్లతో రెండో స్థానంలో... బ్రిటన్ 22 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాయి. యూరోప్ అంచెలో భారత్ మరో ఆరు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది.

‘ఫైనల్’ ధమాకా!

నేడు గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య ఐపీఎల్ తుదిపోరు

- టైటిల్ బరిలో టాప్-2 జట్లు
- గిల్ జోరుపైనే టైటాన్స్ ఆశలు
- సమష్టి ప్రదర్శనపై ధోని బృందం దృష్టి
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఈ ఐపీఎల్‌కు ఎవరు శుభం కార్డు వేస్తారో ఈ రాత్రే తెలుతుంది. ఈ సీజన్‌కు శ్రీకారం చుట్టిన జట్ల మధ్యే ఫైనల్ మ్యాచ్ జరుగనుండటం ఆసక్తికరం. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ‘డబుల్ ధమాకా’కు సన్నద్ధం కాగా... నాలుగుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ‘ఫైవ్ స్టార్’ ముంబై సరసన నిలవాలని ఆశిస్తోంది. రెండూ మేటి జట్లే! ఈ సీజన్ అసాంతం గట్టి పోరాటాలే చేశాయి. ఓపెనర్ల మెరుపులే ఇరు జట్లను శాసిస్తున్నాయి. మరి ఈ ఫైనల్లో ఎవరి మెరుపులు విజయాన్నిస్తాయో ఈ ‘సూపర్ సండే’ రోజు చూసేయండి.

అహ్మదాబాద్ తొలి క్వాలిఫయర్ చూశాం కదా... మళ్లీ చూద్దాం ‘ఫైనల్’గా! ఎందుకంటే ఆ మ్యాచ్ ఆడిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), గుజరాత్ టైటాన్స్ మధ్యే టైటిల్ పోరు జరుగుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ ఇలా ఆల్‌రౌండ్ సమతూకంతో ఉన్న జట్ల మధ్యే అమీతుమీ జరగనుండటం... టాపార్డర్‌లో హిట్టర్లుండటంతో నేడు నరేంద్ర మోదీ స్టేడియంలో పరుగుల విందు ఖాయం. టైటాన్స్ తమ సొంతగడ్డపై టైటిల్ నిలబెట్టుకునేందుకు తహతహలాడుతోంది. శుబ్‌మన్ గిల్ సంచలన శతకాలు, బౌలర్ల వెన్నుదన్ను జట్టును మరో మెట్టుపై నిలబెడుతోంది. అలాగని సూపర్ కింగ్స్‌ను తక్కువ చేయలేం. కీలకమైన మ్యాచ్‌ల్లో ధోని మార్క్ సారథ్యం జట్టుకు అదనపు ‘ఇంపాక్ట్’ అయ్యింది. ఈ నేపథ్యంలో ఫైనల్ ఫైనలే! ఎవరూ తగ్గేదేలే!

ధోని అనుభవం గెలిపిస్తుందా?

ధోని... ధోని... ఇప్పుడంతా ఇదే ఫీవర్. వచ్చే సీజన్ ఆడేది లేనిది ఇప్పుడైతే చెప్పలేదు కానీ. ట్రోఫీ గెలిస్తే మాత్రం విజయంతో నిష్క్రమించే అవకాశాలైతే ఉన్నాయి. అందుకేనేమో ఇర్ఫాన్ పఠాన్‌లాంటి గుజరాతీలు సైతం దిగ్గజ కెప్టెన్ ఉన్న సూపర్ కింగ్సే గెలవాలని మనసారా కోరుకుంటున్నారు. రుతురాజ్ గైక్వాడ్, డెవాన్ కాన్వేల శుభారంభమిస్తే... దీనికి అజింక్య రహానే, శివమ్ దూబే మెరుపులు తోడయితే చెన్నై భారీస్కోరుకు ఢోకానే ఉండదు. డెత్ ఓవర్లను కాచుకునేందుకు మొయిన్ అలీ, అంబటి రాయుడు, రవీంద్ర జడేజా ఉండనే ఉన్నారు. బౌలింగ్‌లో తీక్షణ, పతిరణ తుషార్ దేశ్‌పాండే, దీపక్ చహర్‌లు ధోని నమ్మకాన్ని నిలబెడుతున్నారు. ధోనికిది 11వ ఐపీఎల్ ఫైనల్. (చెన్నై తరఫున పదోది) అయితే చెన్నైకిది మింగుడు పడని వేదిక అహ్మదాబాద్. ఇక్కడ ఆడిన మూడుసార్లూ చెన్నై ఓడిపోయింది. ఇదొక్కటే జట్టుకు మైనస్!

అచ్చొచ్చే సొంతగడ్డపై...

ప్లే ఆఫ్స్‌లో గుజరాత్... చెన్నైతో వెనుకబడినప్పటికీ రెండో క్వాలిఫయర్‌లో ఐదుసార్లు చాంపియన్ ముంబైని మట్టికరిపించింది. శుబ్‌మన్ గిలే జట్టు బలం. ఈ సీజన్‌లో మూడు సెంచరీలతో జోరుమీదున్నాడు. కలిసొచ్చే అహ్మదాబాద్ వేదికపై మళ్లీ చెలరేగినా ఆశ్చర్యమైతే లేదు. ఎందుకంటే ఇక్కడే గుజరాత్ తొమ్మిదింట ఆరు మ్యాచుల్లో గెలిచింది. సాయి సుదర్శన్, కెప్టెన్ హార్దిక్ పాండ్యా, మిల్లర్‌లతో బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా ఉంటే... షమీ (28 వికెట్లు), రషీద్ ఖాన్ (27 వికెట్లు), మోహిత్ శర్మ (24 వికెట్లు)లతో బౌలింగ్ దళం కూడా దీటుగా ఉంది. పర్పుల్ క్యాప్ రేసులో ఈ ముగ్గురే ఉన్నారు.



9 ఇప్పటి వరకు జరిగిన 15 ఐపీఎల్ ఫైనల్స్‌లో తొమ్మిదిసార్లు తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు విజేతగా నిలిచింది. ఆరుసార్లు ఛేజింగ్ చేసిన జట్టు చాంపియన్‌గా అవతరించింది.

3 నేటి ఫైనల్లో గుజరాత్ టైటాన్స్ గెలిస్తే చెన్నై సూపర్ కింగ్స్ (2010, 2011), ముంబై ఇండియన్స్ (2019, 2020) జట్ల తర్వాత వరుసగా రెండేళ్లు ఐపీఎల్ టైటిల్ సాధించిన మూడో జట్టుగా గుర్తింపు పొందుతుంది.

0 ఇప్పటి వరకు 15 ఐపీఎల్ ఫైనల్స్ మ్యాచ్‌ల్లో ఏ జట్టు కూడా ఒక్కసారి ఆలౌట్ కాలేదు.

5 మొత్తం ఐపీఎల్ ఫైనల్స్‌లో ఐదుసార్లు ఆయా జట్లు 200 అంతకంటే ఎక్కువ పరుగులు చేశాయి.

రూ. 20 కోట్లు ఐపీఎల్ విజేత జట్టుకు లభించే ప్రైజ్‌మనీ.

రూ. 13 కోట్లు ఐపీఎల్‌లో రన్నరప్‌గా నిలిచే జట్టుకు లభించే మొత్తం.

తుది జట్లు (అంచనా)

గుజరాత్ టైటాన్స్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), సాహా, శుబ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, రషీద్ ఖాన్, మిల్లర్, తెవాటియా, విజయ్ శంకర్/జోష్ లిటిల్, నూర్ అహ్మద్, షమీ, మోహిత్ శర్మ.

చెన్నై సూపర్ కింగ్స్: ధోని (కెప్టెన్), రుతురాజ్, కాన్వే, శివమ్ దూబే/పతిరణ, రహానే, రాయుడు, జడేజా, మొయిన్ అలీ, దీపక్ చహర్, తుషార్, తీక్షణ.

పిచ్, వాతావరణం

ఈ సీజన్‌లో నరేంద్ర మోదీ స్టేడియంలో పరుగుల మోత మోగింది. 8 మ్యాచ్‌ల్లో సగటు స్కోరు 193. ఇందులో ఐదుసార్లు మొదట బ్యాటింగ్ చేసి జట్లే గెలిచాయి. టాస్ గెలిస్తే బ్యాటింగ్ ఎంచుకోవచ్చు. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు.

విజయంతో ముగింపు...




అడిలైడ్: ఆస్ట్రేలియాలో హాకీ పర్యటనను భారత మహిళల జట్టు విజయంతో ముగించింది. ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టుతో శనివారం జరిగిన చివరిదైన రెండో మ్యాచ్‌లో టీమిండియా 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (10వ ని.లో), దీప్ గ్రేస్ ఎక్కా (25వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టుకు అబిగెయిల్ విల్సన్ (22వ ని.లో) ఏకైక గోల్ అందించింది. ఆస్ట్రేలియా సీనియర్ జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 0-2తో కోల్పోగా... ఆస్ట్రేలియా ‘ఎ’ జట్టుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో ‘డ్రా’గా ముగించింది.

వెర్‌స్టాపెన్‌కు ‘పోల్’



మోంటెకార్లో: మొనాకో గ్రాండ్‌ప్రి ప్రధాన రేసును రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ తొలి స్థానం నుంచి ప్రారంభిస్తాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ సెషన్‌లో వెర్‌స్టాపెన్ ల్యాప్‌ను అందరికంటే వేగంగా ఒక నిమిషం 11.365 సెకన్లలో పూర్తి చేసి ఈ సీజన్‌లో మూడోసారి ‘పోల్ పొజిషన్’ సాధించాడు. నేడు ప్రధాన రేసు జరుగుతుంది. అలోన్సో (ఆస్టన్ మార్టిన్) రెండో స్థానం నుంచి, లెక్‌లెర్క్ (ఫెరారీ) మూడో స్థానం నుంచి రేసును ఆరంభిస్తారు.

నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ



పారిస్: టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఫ్రెంచ్ ఓపెన్ నేడు మొదలుకానుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో స్పెయిన్ దిగ్గజం, 14 సార్లు చాంపియన్ రాఫెల్ నాదల్ తుంటి గాయం కారణంగా ఈ టోర్నీకి తొలిసారి దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్), సెర్బియా దిగ్గజం జొకోవిచ్, నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) టైటిల్ ఫేవరెట్స్‌గా ఉన్నారు. నేడు జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో జిరీ వెసిలీ (చెక్ రిపబ్లిక్)తో సిట్సిపాస్, లాస్లో జెరి (సెర్బియా)తో ఏడో సీడ్ రుబ్లెవ్ తలపడతారు. మరోవైపు మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్, డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) టైటిల్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. స్వియాటెక్‌కు రెండో సీడ్ సబలెంకా (బెలారస్), నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్), ఐదో సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్), ఆరో సీడ్, గత ఏడాది రన్నరప్ కోకో గాఫ్ (అమెరికా) ఏడో సీడ్ ఆన్స్ జబర్ (ట్యూనిషియా), ఎనిమిదో సీడ్ మరియా సాకరి (గ్రీస్) నుంచి గట్టిపోటీ ఎదురు కానుంది. పురుషుల డబుల్స్ విభాగంలో భారత్ నుంచి రోహన్ బోపన్న, యూకీ బాంబ్రీ, సాకేత్ మైనేని బరిలోకి దిగనున్నారు.

భారత్, పాక్ మ్యాచ్ ‘డ్రా’

సలాలా (ఒమన్): ఆసియా కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య శనివారం జరిగిన పూల్ ‘ఎ’ లీగ్ మ్యాచ్ 1-1తో ‘డ్రా’గా ముగిసింది. భారత్ తరఫున శ్రద్ధానంద్ తివారి (24వ ని.లో), పాకిస్తాన్ తరఫున అలీ బషారత్ (44వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ టోర్నీలో వరుసగా తొలి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన భారత్, పాకిస్తాన్ జట్లకు ఇదే తొలి ‘డ్రా’ కావడం గమనార్హం. మూడు మ్యాచ్‌లు ముగిసిన తర్వాత భారత్, పాక్ జట్లు 7 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. నేడు జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో థాయ్‌లాండ్‌తో భారత్; జపాన్‌తో పాకిస్తాన్ తలపడతాయి. నేడు భారత్, పాక్ తమ మ్యాచ్‌లను ‘డ్రా’ చేసుకుంటే సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

సినిమా

నటనానంద తారక

శ్రీకృష్ణుడు, దుర్యోధనుడు, కీచకుడు, అర్జునుడు, భీముడు.... ‘శ్రీమద్విరాట పర్వము’లో ఈ ఐదు భిన్న పాత్రల్లో ఎన్టీఆర్ అభినయం చూసి, తెలుగు ప్రేక్షకులు ఆనందించారు.. నటన మాత్రమే కాదు... తెరపై ఆ అందగాడిని చూసి ఆనందించారు. అదే అందగాడు కురూపిగా కనిపించినా ఆనందించారు.. ఆ నటన అలాంటిది. 44ఏళ్ల సినీ కెరీర్‌లో ప్రేక్షకులకు ఆనందాన్నిచ్చిన నటుడు ‘నటనానంద తారకరాముడు’ (ఎన్.టి.ఆర్). ఈ తారక దేశంలోనే వంద చిత్రాలు పూర్తి చేసిన తొలి ఘనుడు.. ఆ తర్వాత ఎనిమిదేళ్లల్లో 200 సినిమాలు పూర్తి చేసి, రాష్ట్రంలో రెండొందల సినిమా మార్క్ చేరుకున్న నటుడు. 300 మార్కు కూడా ఈ నటుడి సొంతమే. 13 చారిత్రకాలు, 55 జానపదాలు, 186 సాంఘికాలు, 44 పౌరాణిక చిత్రాలు చేసి, తెలుగు తెర పై చెరగని ముద్ర వేశారు ఎన్టీఆర్. తొలి చిత్రం ‘మనదేశం’తో మొదలుకొని, చివరి చిత్రం ‘మేజర్ చంద్రకాంత్’ వరకూ దాదాపు 300 చిత్రాల్లో నటించారు. వాటిలో 140 వందరోజుల చిత్రాలు కాగా, 33 రజతోత్సవ చిత్రాలు కావడం విశేషం. ఈ ‘నటనానంద తారక’ ‘శత జయంతి’ నేడు. ఈ సందర్భంగా నందమూరి తారక రామారావు సినీ జీవిత విశేషాల్లో కొన్ని ఈ విధంగా...



పౌరాణికం

శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, దుర్యోధనుడు, భీముడు, యముడు, రావణాసురుడు... ఎలా ఉంటారు? ‘ఇలా ఉంటారు?’ అని ఎన్టీఆర్ తన పాత్రలతో చూపించారు. పౌరాణిక చిత్రాలకు పెట్టింది పేరు ఎన్టీఆర్. ఆయన నటించిన పౌరాణిక చిత్రాల్లో ఎప్పటికీ ప్రధానంగా చెప్పుకోవాల్సిన చిత్రం ‘దాన వీర శూర కర్ణ’ (1977). ఎన్టీఆర్ ఆరు పడవల ప్రయాణం ఈ సినిమా. అంటే..నటన, దర్శకత్వం, నిర్మాణం.. ఈ మూడు బాధ్యతలతో పాటు కృష్ణుడు, కర్ణుడు, దుర్యోధనుడు... మూడు పాత్రలను చేయడం అంటే ఆరు పడవల ప్రయాణమే కదా. మేకప్ వేయడానికి మూడు గంటలు, తీయడానికి రెండు గంటలు పట్టేదట. మూడు పాత్రల అభినయానికి, దర్శకుడిగా తీసిన విధానానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అయితే ఈ సినిమాలో శ్రీకృష్ణుడు పాత్ర కోసం అక్కినేని నాగేశ్వరరావుని సంప్రదిస్తే.. ‘కృష్ణుడిగా ఎన్టీఆర్‌ని చూసిన కళ్లతో ప్రేక్షకులు నన్ను చూడలేరు’ అంటూ చేయనని చెప్పారట. దీంతో కర్ణుడి పాత్ర అయినా చేయమని కోరితే.. ‘ఆ పాత్రకి నా ఆహార్యం సరిపోదు’ అంటూ సున్నితంగా తిరస్కరించారట ఏఎన్‌ఆర్. శ్రీకృష్ణుడు అంటే ఎన్టీఆర్ అనుకునేలా ఆ పాత్రకు వన్నె తెచ్చారు. ‘ఇద్దరు పెళ్లాలు’ (1954) చిత్రంలో ఎన్టీఆర్ తొలిసారి కృష్ణునిగా కనిపించారు. ఆ తర్వాత ‘మాయాబజార్’ (1957), ‘వినాయకచవితి’ (1957), ‘దీపావళి’ (1960), ‘శ్రీకృష్ణార్జున యుద్ధం’ (1963), ‘శ్రీకృష్ణ తులాభారం’ (1966) ఇలా... పలు చిత్రాల్లో శ్రీకృష్ణుడి పాత్ర పోషించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. ఆయన్ని అపర శ్రీకృష్ణునిగా నిలిపిన చిత్రం ‘మాయాబజార్’. ఈ చిత్రంలో తెలుగు, తమిళ భాషల్లో ఎన్టీఆరే శ్రీకృష్ణునిగా నటించి, తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించారు. ఇక ‘శ్రీకృష్ణ తులాభారం’లో మరోమారు కృష్ణుని పాత్రలో జీవించారు. ఈ చిత్రంలో శ్రీకృష్ణుని పాత్రధారి అయిన ఎన్టీఆర్‌ని సత్యభామ పాత్రధారి జమున కాలితో తన్నే సన్నివేశం ఉంటుంది. అంత పెద్ద స్టార్ హీరో అయినా భేషజాలకు పోకుండా, అభిమానులు, ప్రేక్షకులు ఏమనుకుంటారో? అని ఆలోచించకుండా కథకి అవసరం మేరకు ఆ సన్నివేశంలో నటించి, ‘దట్ ఈజ్ ఎన్టీఆర్’ అనిపించుకున్నారు. శ్రీకృష్ణుడిగా ఒదిగిపోయిన ఎన్టీఆర్.. శ్రీరామునిగానూ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ‘చరణదాసి’ (1956) చిత్రంలో తొలిసారి శ్రీరామునిగా కనిపించారు. ఆ తర్వాత ‘సంపూర్ణ రామాయణం’ (1958)లో తొలిసారి పూర్తి స్థాయిలో శ్రీరామునిగా నటించారాయన. ‘లవకుశ’ (1963) చిత్రంలో శ్రీరాముని పాత్రలో ఎన్టీఆర్ జీవించారు. ఆ తర్వాత ‘శ్రీరామ పట్టాభిషేకం’ (1978)తో పాటు మరికొన్ని చిత్రాల్లో శ్రీరామునిగా ప్రేక్షకులను అలరించారు. సౌమ్యుడైన శ్రీరాముడు పాత్రకు పూర్తి వ్యతిరేకమైన రావణాసురుడి పాత్రలోనూ ఎన్టీఆర్ ఒదిగిపోయిన వైనం అద్భుతం. ‘భూకైలాస్’ (1958) చిత్రంలో ఎన్టీఆర్ తొలిసారి రావణబ్రహ్మ పాత్రలో నటించి, మెప్పించారు. ఆ తర్వాత ‘సీతారామ కళ్యాణం’ (1961), ‘శ్రీరామ పట్టాభిషేకం’ (1978) వంటి పలు సినిమాల్లో రావణబ్రహ్మగా శభాష్ అనిపించుకున్నారు. అదే విధంగా ‘శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం’ (1960)లో తొలిసారి వెంకటేశ్వర స్వామి పాత్ర చేశారు ఎన్టీఆర్. అలాగే ‘పాండవ వనవాసము’ (1965)లో భీమునిగా, ‘ఉమ్మడి కుటుంబం’ (1967)లో తొలిసారి ‘యముడి’ పాత్రలో ఆకట్టుకున్నారాయన. ఇక ‘నర్తనశాల’ (1963)లో బృహన్నల పాత్రలో తన నటనా ప్రతిభను మరోసారి చూపించారు ఎన్టీఆర్. ఇలా పౌరాణిక పాత్రల్లో ఎన్టీఆర్ చెరగని ముద్ర వేశారు.



బృహన్నలగా...

జానపదం





ఎన్టీఆర్ నటించిన తొలి జానపద చిత్రం ‘పల్లెటూరి పిల్ల’ (1950). ఈ చిత్రంలో క్రూరమైన ఎద్దుతో ఎన్టీఆర్ పోరాడే యాక్షన్ సీన్ ఉంది. చిత్రదర్శకుడు బీఏ సుబ్బారావు ఎద్దు కొమ్ములను పట్టుకుంటే చాలని ఎన్టీఆర్‌తో అన్నారు. కానీ, ఎన్టీఆర్ ఆ ఎద్దుతో నిజంగానే పోరాడారు. ఆ యాక్షన్ సీన్ అప్పుడు రెండుసార్లు ప్రాక్చరయింది. డాక్టర్లు విశ్రాంతి సూచించినా ‘నో’ అన్నారు ఎన్టీఆర్. కట్టు కనిపించకుండా పొడవు చేతుల చొక్కా ధరించి, నటించారు. ‘పల్లెటూరి పిల్ల’ విడుదలైన మరుసటి సంవత్సరం ‘పాతాళ భైరవి’ (1951)లో చేసిన తోటరాముడి పాత్ర గురించి కూడా చెప్పుకోవాలి. ఈ పాత్రకు ఎన్టీఆర్‌ని తీసుకోవాలని నిర్మాతలు నాగిరెడ్డి-చక్రపాణి అనుకుంటే... పెద్దగా ఇమేజ్ లేని నటుణ్ణి అంత పెద్ద పాత్రకా? అనుకున్నారు దర్శకుడు కేవీ రెడ్డి. సరిగ్గా అదే టైమ్‌కి టెన్నిస్ ఆడుతున్న ఎన్టీఆర్ రెండు పాయింట్లు కోల్పోవడంతో బంతిని విసిరి కొట్టారు. అంతే.. జానపద నాయకుడి లక్షణం ఉందని తోటరాముడిగా ఎన్టీఆర్‌ని ఫిక్స్ చేశారు కేవీ రెడ్డి. ఈ పాత్రలో ఎన్టీఆర్ రెచ్చిపోయి నటించారు. ఇంకా ‘గులేబకావళి కథ’, ‘జగదేకవీరుని కథ’, ‘అలీబాబా నలభై దొంగలు’, ‘చిక్కడు దొరకడు’, ‘మంగమ్మ శపథం’, ‘గండికోట రహస్యం’... ఇలా దాదాపు యాభై జానపద చిత్రాల్లో నటించారు ఎన్టీఆర్.



సాంఘికం

హీరోగా పట్టుమని పది సినిమాలు పూర్తి చేయకుండానే సందేశాత్మక సినిమాలు చేయాలనుకున్నారు ఎన్టీఆర్. వరకట్నం తీసుకోవడం సరైంది కాదని, యువతలో చైతన్యం నింపేలా, అభ్యుదయ భావాలు రేకెత్తించేలా ‘పెళ్లి చేసి చూడు’ (1952)ను ప్రేక్షకుల ముందుకు తెచ్చారు. ఆ తర్వాత 1970లో స్వీయ దర్శకత్వంలో వరకట్నం ప్రధానాంశంగానే ‘వరకట్నం’ సినిమా తెరకెక్కించి, నటించారాయన. ఇక అప్పటి సాంఘిక దురాచారాల్లో ప్రముఖంగా వినిపించే మరో అంశం ‘కన్యాశుల్కం’. ఈ విషయంలో ప్రజల ఆలోచనా సరళిలో మార్పు రావాలనే ఉద్దేశ్యంతో ‘కన్యాశుల్కం’లో గిరీశంగా కనిపించి, మెప్పించారు ఎన్టీఆర్. ఈ చిత్రంలో గిరీశంగా ఎన్టీఆర్ చేసిన అభినయానికి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఈ చిత్రాలే కాదు.. ఉమ్మడి కుటుంబాల ప్రాముఖ్యతను తెలియజేసేలా, ‘ఉమ్మడి కుటుంబం’, కుటుంబ సంబంధాలకు అద్దంపట్టేలా ‘తల్లా? పెళ్లామా?’ చిత్రం, ఈ కోవలోనే ‘కోడలు దిద్దిన కాపురం’, ‘తాతమ్మ కల’, ‘ఇంటిగుట్టు’ సినిమాలు చేశారు ఎన్టీఆర్. ముఖ్యంగా 1969-1970 దశకంలో ఎన్టీఆర్ నుంచి ఎక్కువగా సాంఘిక చిత్రాలు వచ్చినట్లుగా తెలుస్తోంది. ‘వరకట్నం, తల్లా? పెళ్లామా?, కొడుకులు దిద్దిన కాపురం’ సినిమాల్లో నటించి, స్వీయ దర్శకత్వం వహించారు ఎన్టీఆర్. ఈ చిత్రాలే కాదు.. వ్యవసాయంలో కొత్త ప్రయోగాలు చేయాలని గ్రామీణ యువకులను ప్రోత్సహించే విధంగా ‘పల్లెటూరు’, ‘రైతుబిడ్డ’ వంటి వ్యవసాయ ఆధారిత సినిమాల్లో నటించారు. అలాగే వ్యవసాయ రంగంలో పెత్తందార్లను ప్రశ్నించేలా ‘పెత్తందార్లు’లో నటించారు. ఇంకా సమాజంలోని అసమానతను తెలిపేలా ‘రాజూ పేద’, మహిళలకు సమాజంలో దక్కాల్సిన గౌరవాన్ని గుర్తు చేసేలా ‘నాదీ ఆడ జన్మే’, ‘స్త్రీ జన్మ’ వంటి సినిమాలను ప్రేక్షకుల ముందుకు తెచ్చారు ఎన్టీఆర్. అలాగే దేశభక్తిని చాటేలా ‘బొబ్బిలిపులి’, ‘నా దేశం’, ‘జస్టిస్ చౌదరి, ‘మేజర్ చంద్రకాంత్’, కులమతాలకు అతీతంగా ‘ఒకే కుటుంబం’ వంటి సినిమాలు కూడా ఉన్నాయి.





ప్రయోగాత్మకం

‘పిచ్చి పుల్లయ్య’ (1953), ‘బండరాముడు’ (1959), ‘తిక్క శంకరయ్య’ (1968).. ఇవన్నీ ఎన్టీఆర్ హీరోగా నటించిన సినిమాల టైటిల్సే. వీటిని బట్టి అర్థం చేసుకోవచ్చు ఎన్టీఆర్‌కు కథ నచ్చితే ఎలాంటి సాహసానికైనా సై అంటారని. అందుకే 31ఏళ్ల వయసులోనే ‘తోడుదొంగలు’ (1954)లో వృద్ధ పాత్రకి ఓకే అన్నారు. అలాగే నాలుగుపదుల వయసు దాటకుండానే ‘భీష్మ’ (1962) చిత్రంలో కురు వృద్ధుడైన భీష్మ పాత్ర చేశారు. అదే విధంగా ‘కులగౌరవం’లో కుటుంబ పెద్దగా వృద్ధ పాత్రలో మరోసారి ఆడియన్స్‌తో క్లాప్స్ కొట్టించారు. ‘తోడు దొంగలు’ వచ్చిన ఏడాదే ‘రాజూ పేద’ చిత్రంలో ఎన్టీఆర్ పూర్తి డీ గ్లామరస్ రోల్ చేస్తే ఆడియన్స్ యాక్సెప్ట్ చేశారు. అదే ఏడాది రిలీజైన మరో చిత్రం ‘పరివర్తన’లో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో ఎన్టీఆర్ అభినయిస్తే ఆడియన్స్ యాక్సెప్ట్ చేశారే కానీ నెగటివ్‌గా తీసుకోలేదు. ఇంకా ‘పిచ్చి పుల్లయ్య’లో మానసిక పరిస్థితి బాగాలేని పుల్లయ్యగా, ‘తిక్క శంకరయ్య’లో శంకరయ్యగా.. ‘కలిసి ఉంటే కలదు సుఖం’, ‘ఆరాధన’ వంటి చిత్రాల్లో దివ్యాంగుడిగా ఎన్టీఆర్ ఒదిగిపోయారు. ఇవే కాదు.. ‘దాసి’లో జట్కా బండి రామయ్యగా... చెప్పుకుంటూ పోతే... ‘బడిపంతులు, ఆత్మ బంధువు, గుడిగంటలు’... ఇలా పలు చిత్రాల్లో ఎన్టీఆర్ కథలోని పాత్రలకే ప్రాధాన్యం ఇచ్చారు.




చారిత్రకం

‘నందామయ.. గురుడ నందామయ..’ స్క్రీన్ మీద కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్ర స్వామిగా సాత్వికంగా కనిపించారు ఎన్టీఆర్. ఒక యాక్షన్ హీరో అంత సాఫ్ట్ క్యారెక్టర్ చేయాలనుకోవడం ఓ సాహసం. ఎన్టీఆర్‌కి సాహసాలు ఇష్టం. అందుకే బ్రహ్మంగారి కథతో ‘శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర’ తీయాలనుకున్నారు. ఎన్టీఆర్ ఈ సినిమా తీయాలనుకోవడానికి ఓ కారణం ఉంది. అదేంటంటే... ఓసారి ఎన్టీఆర్ కడప జిల్లా సిద్ధవటంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమానికి వెళ్లారు. అక్కడ ఈ కాలజ్ఞాని చెప్పిన విషయాలు ఆయన్ను ఆకర్షించాయి. అందుకే వీరబ్రహ్మం పాత్ర చేయాలనుకున్నారు... దర్శకత్వం-నిర్మాణం కూడా ఎన్టీఆరే. షూటింగ్ సమయంలో కొన్ని ఆటుపోట్లు ఎదురయితే, పూర్తయ్యాక కొన్ని కారణాలతో మూడేళ్ల పాటు సెన్సార్ అనుమతి లభించలేదు. చివరికి ఆ సమస్య పరిష్కారమై 1984 నవంబరు 29న విడుదలై, ఘన విజయం సాధించింది. ఎన్టీఆర్ చేసిన చారిత్రాత్మక చిత్రాల్లో ఈ చిత్రానిది ప్రముఖ స్థానం కాగా, ఈ సినిమాకన్నా దాదాపు ముప్పై ఏళ్ల ముందు చేసిన చారిత్రాత్మక చిత్రం ‘తెనాలి రామకృష్ణ’ (1956)లో శ్రీకృష్ణ దేవరాయలుగా రాజసం చూపించారు ఎన్టీఆర్. కొంచెం తారాగణం మార్పుతో తెలుగు, తమిళ (‘తెనాలి రామన్’) భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించారు. తమిళంలోనూ శ్రీకృష్ణ దేవరాయలు పాత్రను ఎన్టీఆర్ చేయగా, తెనాలి రామకృష్ణగా శివాజీ గణేశన్ నటించారు. తెలుగులో ఈ పాత్రను ఏఎన్నార్ చేశారు. రాజదర్బారులో న్యాయమైన తీర్పు ఇచ్చిన దేవరాయలుకి ప్రేక్షకులు కూడా మంచి తీర్పు ఇచ్చి, ఈ చిత్రాన్ని సూపర్ హిట్ చేశారు. అన్నట్లు ‘మహా మంత్రి తిమ్మరసు’లోనూ శ్రీకృష్ణ దేవరాయలుగా మెప్పించారు. ఇంకా ‘అక్బర్ సలీం అనార్కలి’లో అక్బర్ పాత్రలో ఒదిగిపోయారు. ఎన్టీఆర్ ఇష్టపడి చేసిన పాత్రల్లో అశోకుడు ఒకటి. ‘సామ్రాట్ అశోక్’తో అది నెరవేర్చుకున్నారు. ఇంకా ‘చాణక్య చంద్రగుప్త’ (చంద్రగుప్తుడు పాత్ర), ‘శ్రీనాథ కవి సార్వభౌముడు’ (శ్రీనాథుడు పాత్ర)... ఇలా ఎన్టీఆర్ చేసిన చారిత్రాత్మక చిత్రాల్లో చరిత్రలో నిలిచిపోయినవి చాలా ఉన్నాయి.







పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎటువంటి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా పెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

20న సీపీఎం మహా పాదయాత్ర

సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయం

సాక్షి, అమరావతి: పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి జూన్ 20న విజయవాడకు మహా పాదయాత్ర నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్ణయించింది. విజయవాడలో వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్, ఎంఏ బేబి, బీవీ రాఘవులు హాజరయ్యారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితిని సమీక్షించి పార్టీ పురోగమనానికి తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం మీడియాకు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

కార్యదర్శివర్గ సభ్యుల ఎన్నిక

కాగా, రాష్ట్ర కమిటీ సమావేశం నూతనంగా వి.రాంభూపాల్, వి.ఉమామహేశ్వరరావులను కార్యదర్శి వర్గ సభ్యులుగా ఎన్నుకుంది. ఇప్పటి వరకు ఆహ్వానితులుగా ఉన్న సురేంద్ర, కె.సుబ్బరావమ్మలు పూర్తిస్థాయి కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఆహ్వానితులుగా ఉన్న ఉమామహేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల కార్యదర్శులు అప్పలనర్స, అరటికట్ల రవి రాష్ట్ర కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

యా.. అల్లాహ్!

- 786 సిరీస్ రూ.2 వేల నోట్లు మార్చాలంటే బాధగా ఉంది



నంద్యాల (అగ్రికల్చర్): నంద్యాలలోని బాల్కొండ హాల్ వీధికి చెందిన హమీద్ 786 సిరీస్ నంబర్‌తో గల రూ.2 వేల నోట్లను కొంతకాలంగా సేకరిస్తున్నారు. ఆయన వద్ద 100 వరకు రూ.2 వేల నోట్లు ఉన్నాయి. ఆర్బీఐ ఈ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించడంతో హమీద్ వాటిని మార్చాలా.. వద్దా.. అనే సందిగ్ధంలో పడ్డారు. 786 సిరీస్ నంబర్లతో కూడిన నోట్ల సేకరణకు తాను పడ్డ శ్రమను తలుచుకుని ఆవేదన చెందుతున్నారు. ప్రతి రూ.2 వేల నోటుకు కొంత ఎక్కువ మొత్తాన్ని చెల్లించానని చెప్పారు.

భలే.. భలే.. కొబ్బరిపువ్వు



చెన్నై మార్కెట్‌లో అరకేజీకి పైబడి ఉండే కొబ్బరి పువ్వుల అమ్మకం

పుష్కలంగా పోషకాలు నిండి ఉన్న పువ్వు

- కాయలో నీళ్లు ఇంకిపోయాక పువ్వుగా తయారు
- కోనసీమ నుంచి పలు పట్టణాలకు జోరుగా ఎగుమతి
- మార్కెట్‌లో రూ. 30 నుంచి రూ. 100 వరకూ ధర

సాక్షి, అమలాపురం: దేవాలయాల్లోనో, శుభకార్యాల్లోనో కొబ్బరి కాయ కొట్టినప్పుడు అందులో పువ్వు కనిపిస్తే మంచి జరుగుతుందని చాలామంది నమ్ముతారు. ఆ కొబ్బరి పువ్వు ఇప్పుడు కొంతమంది వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. సాధారణంగా కొబ్బరికాయలోని నీరు ఇంకిపోయాక మొక్క మొలకెత్తే సమయంలో ఈ కొబ్బరిపువ్వు కాయ లోపల తయారవుతుంది. ఈ సమయంలో కొబ్బరికాయను కొడితే లోపల దూదిలా తెల్లగా ఉండే కొబ్బరిపువ్వు ఉంటుంది. దీనిని చాలామంది ఇష్టంగా తింటారు. గతంలో ఇవి కొబ్బరి పంట ఉండే ప్రాంతాల్లోనే ఎక్కువగా లభించేవి. ఇప్పుడు మహానగరాల్లో కూడా లభిస్తున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, చెన్నై వంటి నగరాల్లో కొబ్బరి పువ్వుకు మంచి డిమాండ్ ఉంది. ఈ ప్రాంతాలకు గోదావరి జిల్లాల నుంచి ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల ద్వారా రోజూ కొబ్బరి పువ్వు ఎగుమతి అవుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముంజవరం, ముంగండ, మలికిపురం మండలం రామరాజులంక, పెదతిప్ప, రాజోలు, మామిడికుదురు మండలాలతో పాటు, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, దెందులూరు, పెదవేగి ప్రాంతాల్లో కొబ్బరి పువ్వు ఎక్కువగా లభ్యమవుతోంది. గోదావరి ప్రాంతం నుంచి ఈ వేసవి సీజన్‌లో రోజుకు 3 వేల నుంచి 5 వేల పువ్వులు హైదరాబాద్‌కు ఎగుమతి అవుతున్నాయి. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకూ రోజుకు 8 వేల నుంచి 10 వేల వరకు ఎగుమతి అవుతాయి.

కాయ కన్నా ప్రియం

కొబ్బరి పువ్వును వాడుక భాషలో కొబ్బరి గుడ్డుగా పిలుస్తారు. హైదరాబాద్ వంటి నగరాల్లో కొబ్బరి గుడ్డుకు సైజును బట్టి రూ. 30 నుంచి రూ.70 వరకూ ధర ఉంది. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా చెన్నై, బెంగళూరు మార్కెట్లకు ఈ పువ్వులు ఎగుమతి అవుతున్నాయి. పెద్దసైజు పువ్వులను ఆ మార్కెట్లలో రూ. 100 వరకూ అమ్ముతున్నారు. గోదావరి జిల్లాల్లో కొబ్బరి రైతుల వద్ద నుంచి వ్యాపారులు అన్ సీజన్‌లో పువ్వు సైజును బట్టి రూ. 4 నుంచి రూ. 9 మధ్యలోనే కొంటున్నారు. అదే సీజన్‌లో రూ.12 నుంచి రూ.15 వరకూ ధర చెల్లిస్తున్నారు.

ఆరోగ్యానికి మంచిది



కొబ్బరి పువ్వులో 66 శాతం కార్బోహైడ్రేట్లు, 64 శాతం సాల్యుబుల్ సుగర్స్ ఉంటాయి. ఫైబర్‌తో పాటు మినరల్స్, న్యూట్రియెంట్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. దీనిని తినడం ఆరోగ్యపరంగా మంచిది.

– బి.శ్రీనివాసులు, వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి, అంబాజీపేట, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

గతం కన్నా ఎగుమతులు పెరిగాయి



ఐదారేళ్ల క్రితం కొబ్బరి గుడ్డు ఉచితంగా ఇచ్చేవారు. మరీ డిమాండ్ ఉంటే పువ్వు రూపాయి ఉండేది. ఇప్పుడు కొబ్బరి కాయకన్నా ఎక్కువ ధర పలుకుతోంది. ఇటీవల ఎగుమతులు బాగా పెరిగాయి. కోనసీమ నుంచే కాకుండా ఏలూరు నుంచి కూడా ఎగుమతి అవుతోంది. అప్పుడప్పుడు కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా హైదరాబాద్‌కు కొబ్బరి గుడ్డు వస్తోంది.

– సూదాబత్తుల వెంకట రామకృష్ణ, వ్యాపారి, అంబాజీపేట

నీళ్ల కంటే ఎక్కువ పోషకాలు

కొబ్బరి నీళ్లు, కొబ్బరి కంటే కూడా కొబ్బరి పువ్వులోనే ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఆరోగ్య ప్రయోజనాలున్న ఈ పువ్వు రుచి కూడా అద్భుతంగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిని అదుపు చేయడంలో బాగా పని చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. రోగ నిరోధక శక్తిని పెంచుతుందని, అలసట, నీరసం వంటి సమస్యలను దూరం చేస్తుందని వివరిస్తున్నారు. కిడ్నీ ఇన్ఫెక్షన్లు, కిడ్నీ డ్యామేజ్ వంటి జబ్బులను నివారించడంలో కొబ్బరి పువ్వు అద్భుతంగా ఉపయోగపడుతుంది. ఈ పువ్వులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను దరి చేరకుండా చేస్తాయి. చర్మ సౌందర్యాన్ని సైతం రెట్టింపు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

'సింహాద్రి'లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

- విద్యుత్ సరఫరాకు డిమాండ్ లేకపోవడంతో రిజర్వు షట్‌డౌన్
- ఇప్పటికే 3, 4 యూనిట్లలో ఉత్పత్తి నిలిపివేసిన అధికారులు
- ప్రస్తుతం మొదటి యూనిట్‌లో 500 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి



సింహాద్రి ఎన్టీపీసీ ప్లాంట్

పరవాడ(అనకాపల్లి జిల్లా): సింహాద్రి ఎన్టీపీసీ ప్లాంట్‌లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. విద్యుత్ సరఫరాకు తగినంత డిమాండ్ లేని కారణంగా (రిజర్వు షట్‌డౌన్) రెండో యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేశారు. విద్యుత్‌కు తగినంత డిమాండ్ లేకపోవడం వల్ల శుక్రవారం ఉదయం సంస్థలో 3, 4 యూనిట్లలో ఉత్పత్తిని నిలిపివేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మొదటి యూనిట్ నుంచి 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతుంది. అవసరాలను బట్టి 2, 3, 4 యూనిట్ల నుంచి విద్యుత్ ఉత్పత్తిని పునరుద్ధరిస్తామని సంస్థ అధికారులు తెలిపారు. అయితే, విద్యుత్ ఉత్పత్తికి డిమాండ్ లేని కారణంగా మొదటి యూనిట్‌ను కూడా త్వరలో తాత్కాలికంగా నిలిపివేసే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.

మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లోనూ 'గడపగడప'కు..



సరుగుడులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గణేశ్

ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకొని.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే గణేశ్

నాతవరం(అనకాపల్లి జిల్లా): మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో నర్సీపట్నం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్ శనివారం పర్యటించారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలోని సరుగుడు, అచ్చంపేట, రామన్నపాలెం, యరకంపేటల్లో గణేశ్ 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. గతంలో కమ్యూనిస్ట్ ఎమ్మెల్యే దేముడు తప్ప మరెవరూ ఆ గ్రామాలకు వెళ్లలేదు. తాజాగా ఎమ్మెల్యే గణేశ్ ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానికుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

క్లుప్తంగా...

అథ్లెట్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో ప్రవేశాలు

సాక్షి, అమరావతి: ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) శిక్షణ కేంద్రంలో అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి వినాయక ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18 బాల, బాలికల విభాగంలో ఈ నెల 31, జూన్ 1వ తేదీన ఎంపికలుంటాయని పేర్కొన్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు సాయ్ రెసిడెన్షియల్ వసతి గృహంలో ఉచిత సౌకర్యాలతో క్రీడా శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో బాలికలకు మాత్రమే అవకాశం ఉందని, గెజిటెడ్ అధికారి సంతకంతో జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్పోర్ట్స్ సర్టిఫికెట్స్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, వైద్యుడి నుంచి శారీరక దారుఢ్యం ధ్రువీకరణ పత్రంతో ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఆయా తేదీల్లో హాజరు కావాలని కోరారు. వివరాలకు 98853 12356 నంబర్‌లో సంప్రదించవచ్చు.

31 నుంచి ఏపీ పీసెట్ ప్రవేశ పరీక్షలు

ఏఎన్‌యూ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యాయామ విద్య కళాశాలల్లో బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీపీసెట్-2023లో భాగంగా ఈ నెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రవేశ పరీక్షలు జరుగుతాయని ఏపీ పీసెట్ కన్వీనర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు దేహదారుఢ్య, క్రీడా నైపుణ్య అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లు, పరీక్షల షెడ్యూల్‌ను cetraprche.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

గ్రామాల్లోని బావుల్లో నీటి లోతు వివరాల సేకరణ

సాక్షి, అమరావతి: కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సూచన మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని బావుల్లో నీటి లోతు వివరాలను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి గ్రామ పంచాయతీలో ఎంపిక చేసిన రెండు లేదా మూడు బావుల్లో నీటి లోతు వివరాలను ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సేకరించాలని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశించారు. ఆ వివరాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన జల్ అదాలత్ యాప్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. జూన్ చివరికల్లా వివరాల సేకరణ పూర్తి చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

రుతుక్రమ సమస్యలపై సదస్సు నేడు

- మెప్మా ఆధ్వర్యంలో 123 యూఎల్బీల్లో నిర్వహణ
- 250 మందికి పైగా వైద్యులతో అవగాహన

సాక్షి, అమరావతి: మహిళల్లో రుతుక్రమం సమయంలో తలెత్తే ఇబ్బందులను మహిళలు ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారని మెప్మా ఎండీ విజయలక్ష్మి తెలిపారు. ఈ నిశ్శబ్దాన్ని ఛేదించేందుకు ఏటా మే 28న అంతర్జాతీయ రుతుక్రమ పరిశుభ్రత రోజుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యునిసెఫ్, జాతీయ అర్బన్ హెల్త్ మిషన్ సహకారంతో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 450కి పైగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రుతుక్రమ సమయంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చాలా మంది మహిళలకు తెలియదన్నారు. ఇలాంటి అపోహలకు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపాలంటే ముందు మహిళల్లో ఈ అంశంపై చైతన్యం రావాలని చెప్పారు. అందుకోసమే రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లోనూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పిస్తారని చెప్పారు. అందుకోసం పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రుల నుంచి 250 మందికి పైగా గైనకాలజీ వైద్యులు, 400 మంది వైద్య సిబ్బంది పాలుపంచుకుంటున్నట్టు వివరించారు. సదస్సులకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే కార్యక్రమానికి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరు కావాలని విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ

స్వర్ణజయంతి రైల్లో పొగలు

- చైన్ లాగి ప్రయాణికుల పరుగు

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం రాంపురం గ్రామం వద్ద శనివారం స్వర్ణజయంతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏసీ బోగీ నుంచి పొగలు వచ్చాయి. హజరత్ నిజాముద్దీన్ నుంచి త్రివేండ్రం వెళ్తున్న (రైలు నంబర్- 12644) స్వర్ణజయంతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు గుండ్రాతిమడుగు సమీపంలోకి రాగా నే.. ఏసీ కోచ్ (బీ-2) నుంచి పొగలు వస్తుండడంతో ఓ ప్రయాణికుడు అప్రమత్తమై చైన్ లాగాడు. రాంపురం గ్రామ సమీపంలో రైలు ఆగిన వెంటనే ప్రయాణికులు కిందకు దిగి పరుగులు తీశారు. రైలు డ్రైవర్లు, గార్డ్ రైలును తనిఖీ చేసి.. బోగిలోని ప్యానల్‌బోర్డులో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు లేచినట్లు గుర్తించారు. తాత్కాలిక మరమ్మతులు చేయడంతో రైలు కదిలింది. అనంతరం రాంపురానికి 5 కిలోమీటర్ల దూరంలోని డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో రైలు 40 నిమిషాలు నిలిపివేశారు. మరమ్మతులు చేశాక కదిలినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

శాంతిభద్రతలు భేష్

భయం వీడిన రాష్ట్ర ప్రజలు.. ప్రశాంత జీవనం


గంజాయిని ధ్వంసం చేస్తున్న పోలీసులు (ఫైల్)


మహిళా పోలీసులు

బ్రాండ్ ఏపీ

సాక్షి, అమరావతి: క్షేత్రస్థాయికి పోలీసు వ్యవస్థ.. స్నేహపూర్వక పోలీసు విధానం..
దశాబ్దాలుగా బ్రహ్మపదార్థంగా అంతుచిక్కకుండా ఉన్న ఈ రెండు లక్ష్యాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాధించి చూపించింది. అందుకోసం పోలీసు యంత్రాంగాన్ని వ్యవస్థాగతంగా బలోపేతం చేసింది. విధానపరంగా తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను అందిస్తున్నాయి. శాంతిభద్రతలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ప్రజలు భయ పడకుండా, శాంతి భద్రతలతో జీవించేలా ప్రభుత్వం పోలీసు వ్యవస్థను తీర్చిదిద్దింది. అక్రమ వ్యాపారాల నిరోధానికి కొత్తగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ)ని నెలకొల్పింది. దశాబ్దాలుగా వేళ్లూనుకుపోయిన గంజాయి సాగును కూకటివేళ్లతో సహా పెకలించివేసింది. నాటు సారా దందాను సమర్థంగా కట్టడి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సత్ఫలితాలు సాధిస్తోంది. రాష్ట్రంలో నేరాల కట్టడికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు, అల్లర్లు గణనీయంగా తగ్గాయని జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదికలే చెబుతున్నాయి. జాతీయ స్థాయిలో 36 అవార్డులు సాధించడం రాష్ట్ర పోలీసుల సమర్థ పనితీరుకు నిదర్శనం.

వ్యవస్థాగతంగా బలోపేతం

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని వ్యవస్థాగతంగా బలోపేతం చేసింది. జిల్లాల పునర్విభజనతో 13 జిల్లా పోలీసు కార్యాలయాలు 26కు పెరిగాయి. క్షేత్ర స్థాయిలో పోలీసు వ్యవస్థ బలోపేతానికి కొత్తగా 16 సబ్ డివిజన్లు, 19 పోలీసు సర్కిళ్లను ఏర్పాటు చేసింది. 2019కు ముందు 98 సబ్ డివిజన్లు ఉండగా ఇప్పుడు 114కు పెరిగాయి. 2019కు ముందు 197 పోలీస్ సర్కిళ్లు ఉండగా ప్రస్తుతం 216కు చేరాయి.

ఇక ఏడాదికి 6,500 పోలీసు పోస్టుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది 6,511 పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టింది. దేశంలోనే విప్లవాత్మక రీతిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో 15 వేల మంది మహిళా పోలీసులను నియమించి క్షేత్ర స్థాయిలో శాంతి భద్రతల పరిరక్షణకు కొత్త వ్యవస్థను సృష్టించింది. రాష్ట్రంలో నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేసి గస్తీ విధులు కేటాయిస్తోంది. అసాంఘిక శక్తులను ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించడం, రౌడీషీట్లు తెరవడం మొదలైన చర్యలతో నేరాలకు ఆస్కారం లేకుండా చేస్తోంది.

సైబర్ నేరాల కట్టడి

యావత్ ప్రపంచానికే సవాల్‌గా మారిన సైబర్ నేరాల కట్టడిలోనూ రాష్ట్ర పోలీసు శాఖ ముందుంది. సైబర్ నేరాల కట్టడికి పోలిసు శాఖ ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది. రాష్ట్ర, జిల్లా స్థాయిలో సైబర్ సెల్స్, సోషల్ మీడియా సెల్స్ ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా సైబర్ మిత్ర యాప్, 1930 రిపోర్టింగ్ సెల్ సెంటర్లను నెలకొల్పింది. సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. లోన్ యాప్‌ల వేధింపుల కట్టడికి ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసి పకడ్బందీగా పర్యవేక్షిస్తోంది. సైబర్ నేరాల బాధితులు గతంలో ఫిర్యాదు చేసేందుకు సరైన వ్యవస్థ ఉండేది కాదు. ఇప్పుడు బాధితులు ఫిర్యాదు చేసేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పింది.

ఎస్సీ, ఎస్టీలకు మెరుగైన భద్రత

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. వారిపై దాడులు, వేధింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దాడులు, వేధింపుల కేసుల్లో తక్షణం ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయి. దర్యాప్తు వేగంగా చేస్తూ త్వరితగతిన చార్జిషీట్లు దాఖలు చేస్తోంది. దాంతో గతంతో పోలిస్తే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వేధింపుల కేసులు గణనీయంగా తగ్గాయి. 2019లో 2,382 కేసులు నమోదు కాగా 2022లో 2,229 కేసులకు తగ్గాయి. 2022 మొదటి త్రైమాసికంతో పోలిస్తే 2023 మొదటి త్రైమాసికంలో 15 శాతం కేసులు తగ్గాయి.

గంజాయి, నాటు సారాపై ఉక్కుపాదం

గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా కట్టడిని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకోసం కొత్తగా 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో'(ఎస్ఈబీ)ని ఏర్పాటు చేసి మరీ పటిష్ట కార్యాచరణకు ఉపక్రమించింది. ఆంధ్ర – ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లో దశాబ్దాలుగా వేళ్లూనుకున్న గంజాయి దందాను కూకటివేళ్లతోసహా పెకలించి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ పరివర్తన్ దేశంలోనే రికార్డు సృష్టించింది. ముందుగా గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. గంజాయి సాగు ప్రాంతాలను శాటిలైట్ మ్యాపింగ్ చేసి ప్రత్యేక బృందాలను నియమించి మరీ కట్టడి చేసింది. మొత్తం 384 గ్రామాల్లో మూడు దశల్లో ఆపరేషన్ పరివర్తన్ నిర్వహించింది. మొత్తం 9,093 ఎకరాల్లో ఏకంగా రూ.11,659 కోట్ల విలువైన గంజాయి సాగును ధ్వంసం చేసింది. స్మగ్లింగ్‌ను అడ్డుకుని భారీగా స్వాధీనం చేసుకున్న గంజాయిని కాల్చివేసింది. 2022లో 2 లక్షల కేజీలు, 2023లో ఇప్పటివరకు 3.32 లక్షల కేజీల గంజాయి నిల్వలను కాల్చి బూడిద చేసింది.

➤ దశాబ్దాలుగా గంజాయి సాగే జీవనాధారంగా చేసుకున్న గిరిజనుల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకొచ్చింది. ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా వారిని ప్రోత్సహిస్తోంది. గతంలో గంజాయి సాగు చేసిన 7,328 ఎకరాల్లో కాఫీ, నిమ్మ, జీడీ, కొబ్బరి, రాజ్మా, బత్తాయి వంటి పంటలు సాగు చేస్తుండటం ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పునకు నిదర్శనం.

➤ అదే రీతిలో నాటుసారా దందాపై కూడా ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. నాటుసారా తయారీ కేంద్రాలుగా గుర్తింపు పొందిన మొత్తం 2,202 గ్రామాల్లో ఏకంగా 2,184 గ్రామాల్లో సారా బట్టీలన్నవే లేకుండా చేసింది. నాటు సారా కాచే వారిని ప్రత్యామ్నాయాల వైపు మళ్లిస్తోంది. మిగతా కొద్ది గ్రామాల్లోనూ త్వరలోనే నాటు సారా రూపుమాపడానికి చర్యలు చేపట్టింది. ఈ నాలుగేళ్లలో నాటు సారా, అక్రమ మద్యం దందాపై విస్తృతంగా దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున కేసులు నమోదు చేసింది. 2019లో 527 కేసులు, 2020లో 922 కేసులు, 2021లో 1,691 కేసులు, 2022లో 1,379 కేసులు నమోదు చేయడం విశేషం. దాంతో రాష్ట్రంలో నాటుసారా, అక్రమ మద్యం దందా గణనీయంగా తగ్గింది. 2023లో ఇప్పటివరకు 497 కేసులే నమోదు కావడమే దీనికి నిదర్శనం. పదే పదే అక్రమ రవాణాకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ కింద ఇప్పటివరకు 705 కేసులు నమోదు చేయడం గమనార్హం.

రహదారి భద్రతకు ప్రాధాన్యం

ఎక్కువమందిని బలిగొంటున్న రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పోలీస్, రవాణా, ఆర్ అండ్ బి, వైద్య – ఆరోగ్య శాఖలతో సంయుక్త కార్యాచరణ చేపట్టింది. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా రహదారులపై బ్లాక్ స్పాట్‌లను జియో ట్యాగింగ్ చేసి ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తోంది. ఆ ప్రదేశాల్లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రత్యేకంగా అంబులెన్స్‌ల ఏర్పాటు మొదలైన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్రంలో 2019లో 20,575 రోడ్డు ప్రమాదాలు నమోదు కాగా 2022నాటికి 19వేలకు తగ్గాయి.

హత్యలు, ఘర్షణలు కట్టడి

ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో నాలుగేళ్లుగా హత్యలు, ఘర్షణలు గణనీయంగా తగ్గాయి. 2018తో పోలిస్తే 2022కి రాష్ట్రంలో హత్యలు 6 శాతం తగ్గగా, అల్లర్లు 36 శాతం తగ్గాయి. 2022 మొదటి త్రైమాసికంతో 2023 మొదటి త్రైమాసికాన్ని పోలిస్తే హత్యలు 15 శాతం తగ్గాయి.

ఏడాది	హత్యలు	అల్లర్లు
2019	846	475
2020	845	433
2021	929	458
2022	872	294
2023 (ఇప్పటివరకు)	183	73

శాంతిభద్రతల పరిరక్షణకు అగ్ర ప్రాధాన్యం



రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. ఘర్షణలు, అల్లర్లు, హత్యలను సమర్థంగా కట్టడి చేస్తున్నాం. సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. గంజాయి, నాటు సారా కట్టడికి విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ పరివర్తన్ దేశంలోనే రికార్డు సృష్టించింది.
– డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజల భద్రతకు భరోసానిస్తున్నారు



రాష్ట్రంలో నాలుగేళ్లుగా శాంతి భద్రతలు గణనీయంగా మెరుగయ్యాయి. ఘర్షణలు, అల్లర్లకు అవకాశం లేకుండా పోలీసు వ్యవస్థ సమర్థంగా పని చేస్తోంది. బాధితుల ఫిర్యాదులపట్ల సానుకూలంగా స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అవసరానికి మేమున్నాం అనే నమ్మకాన్ని పోలీసు యంత్రాంగం కల్పిస్తోంది.
– డా.ర్యాలీ శ్రీనివాస్, గోదావరి కవి, తెలుగు అధ్యాపకుడు, రామచంద్రాపురం, కోనసీమ జిల్లా

ప్రశాంత పరిస్థితులు నెలకొల్పారు



ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగించే సానుకూల పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసుల ద్వారా పోలీసు వ్యవస్థను ప్రజల ముంగిటకు తీసుకురావడం గొప్ప విప్లవాత్మకమైన మార్పు. దాంతో ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే విధానం ఆచరణలోకి వచ్చింది. ఇది ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది.
–సి. స్వరాజ్యలక్ష్మి, రిటైర్డ్ ప్రిన్సిపల్, శ్రీ పద్మావతి డిగ్రీ–పీజీ కళాశాల, తిరుపతి

మారుమూల పల్లెల్లోనూ బ్యాంకులు!

- స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సిఫార్సు
- ఇందుకోసం రాష్ట్రంలో 186 గ్రామాల గుర్తింపు
- వీటిలో అధికంగా అల్లూరి, మన్యం, కాకినాడ, పల్నాడు జిల్లాల్లోనే



సాక్షి, విశాఖపట్నం: మారుమూల పల్లెల్లోనూ బ్యాంకుల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఐదు కిలోమీటర్లకు మించి బ్యాంకు సేవలు అందుబాటులో లేని గ్రామాలు 186 ఉన్నట్టు రాష్ట్ర ఆర్థిక శాఖ గుర్తించింది. ఆ జాబితాను స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ)కి సమర్పించింది. దీనిపై తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి ఎస్ఎల్‌బీసీ సన్నద్ధమవుతోంది. మూడు వేల లోపు, ఆ పైన జనాభా కలిగిన గ్రామాల్లో బ్యాంకు శాఖల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని సంబంధిత జిల్లాల లీడ్ బ్యాంకు మేనేజర్ల (ఎల్‌డీఎం)కు సూచించింది. దీనికి అనుగుణంగా ఎంపిక చేసిన గ్రామాల వారీగా ఆయా లీడ్ బ్యాంకులు సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదించారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, పల్నాడు, చిత్తూరు, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో ఈ 186 గ్రామాలున్నాయి. వీటిలో ఎక్కువ గ్రామాలు అల్లూరి, మన్యం, కాకినాడ, పల్నాడు జిల్లాల పరిధిలోనే ఉన్నాయి.

తొలి దశలో 11 పల్లెల్లో..

తొలి దశలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11 మారుమూల పల్లెల్లో కొత్తగా బ్యాంకు శాఖలు (ఏపీజీవీబీ-2, బ్యాంక్ ఆఫ్ బరోడా-1, కెనరా బ్యాంకు-1, డీసీసీబీ-1, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-3, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-3 చొప్పున) ఏర్పాటు చేయాలని ఎస్ఎల్‌బీసీ సూచించింది. అయితే వీటిలో ఇప్పటివరకు ఏపీజీవీబీ (రాజవొమ్మంగి/లబ్బర్తి), బ్యాంక్ ఆఫ్ బరోడా (మారేడుమిల్లి), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎటపాక), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కొయ్యూరు)ల్లో శాఖలను ప్రారంభించడానికి ముందుకొచ్చాయి. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలో జనాభా ఆధారంగా బ్యాంకు సేవలు అందని ఆరు గ్రామాల్లో బ్యాంకు శాఖలు తెరవాలని ఆ జిల్లా కలెక్టర్ సిఫార్సు చేశారు. వీటిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (జియ్యమ్మవలస-బొమ్మిక), బ్యాంక్ ఆఫ్ బరోడా (కొమరాడ-గంగిరేగులవలస), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కురుపాం-మొండెంకల్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (పాచిపెంట-మత్తుమూరు), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (పాచిపెంట-పి.కోనవలస), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భామిని-గురండి) ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సత్వరమే కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని ఎస్ఎల్‌బీసీ సంబంధిత బ్యాంకు యాజమాన్యాలను కోరింది.

మూడు వేలకు పైగా జనాభా..

మరోవైపు మూడు వేలకు పైగా జనాభా కలిగి ఉన్నప్పటికీ ఐదు కిలోమీటర్ల పరిధిలో బ్యాంకు సేవలకు నోచుకోని గ్రామాల్లోనూ కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డీఎఫ్ఎస్) ఎస్ఎల్‌బీసీకి సిఫార్సు చేసింది. దీంతో రాష్ట్రంలో అలాంటి గ్రామాలు 21 వరకు ఉన్నాయని 26 మంది ఎల్‌డీఎంలు ఎస్ఎల్‌బీసీకి నివేదించారు.

మూడు వేలకు పైగా జనాభా ఉన్నా.. బ్యాంకులు లేని గ్రామాలివీ

జిల్లా	మండలం	గ్రామం	జనాభా
ఏఎస్ఆర్	కొయ్యూరు	ఆడాకుల	3,946
ఏఎస్ఆర్	గంగవరం	నెల్లిపూడి	3,636
ఏఎస్ఆర్	వీఆర్‌పురం	వడ్డేగూడెం	5,058
కాకినాడ	తుని	కేవో మల్లవరం	4,394
కాకినాడ	తుని	వల్లూరు	3,488
కాకినాడ	రౌతులపూడి	లచ్చిరెడ్డిపాలెం	3,078
కాకినాడ	రౌతులపూడి	శృంగవరం	3,774
కాకినాడ	ఏలేశ్వరం	సిరిపురం	3,997
కాకినాడ	జగ్గంపేట	మామిడాడ	3,105
కాకినాడ	కిర్లంపూడి	ఎస్ఆర్‌పాలెం	3,088
కాకినాడ	ప్రత్తిపాడు	పెద్దిపాలెం	4,011
కాకినాడ	పెద్దాపురం	జె.తిమ్మాపురం	3,672
కాకినాడ	గండేపల్లి	ఎల్లమిల్లి	3,311
కాకినాడ	పిఠాపురం	వెల్దుర్తి	3,285
కాకినాడ	తాళ్లరేవు	చొల్లంగి	3,282
కాకినాడ	తాళ్లరేవు	జి.వేమవరం	5,069
చిత్తూరు	పెద్దపంజాని	పెద్దక్కపల్లి	3,466
పల్నాడు	పిడుగురాళ్ల	కామేపల్లి	8,049
పల్నాడు	నూజెండ్ల	పుచ్చనూతల	5,971
అంబేడ్కర్ కోనసీమ	పి.గన్నవరం	ఏనుగుపల్లె	3,210
ఏలూరు	ఏలూరు	తాళ్లమూడి	7,084

సీఎం జగన్ స్ఫూర్తితో పర్వతారోహణ

- 24 ఏళ్లకే 25 శిఖరాలను అధిరోహించిన సురేష్‌బాబు
- అభినందనలు తెలిపిన సీఎం జగన్


మంచుకొండలపై నవరత్న పథకాలు ప్రదర్శిస్తున్న సురేష్‌బాబు

సాక్షి, అమరావతి/గోనెగండ్ల(కర్నూలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితోనే తాను పర్వతారోహణ చేస్తున్నట్లు కర్నూలు జిల్లా గోనెగండ్లకు చెందిన జి.సురేష్‌బాబు తెలిపారు. ఆయన కేవలం 24 ఏళ్ల వయసులోనే 25 శిఖరాలను అధిరోహించిన మొదటి దక్షిణ భారతీయుడిగా నిలిచాడు. శనివారం కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి గోనెగండ్లలోని సురేష్‌బాబు ఇంటికి వెళ్లి సన్మానించారు. ఆర్థిక సాయం అందించి అభినందించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో 3,648 కిలో మీటర్లు నడిచారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఆరేళ్లలో ఆసియా ఖండంలోని 25 పర్వతాలను అధిరోహించానని చెప్పారు. హిమాలయ పర్వతాలపై నవరత్నాలు సంక్షేమ పథకాల పోస్టర్లను ప్రదర్శించినట్లు తెలిపారు. సురేష్‌బాబు సాధించిన విజయాలకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు లభించేలా చూస్తానని ఎంపీ సంజీవ్‌కుమార్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు సిఫారసు చేస్తామన్నారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్మించిన సురేష్‌బాబు నూతన ఇంటిని ప్రారంభించారు.

సురేష్ అంకితభావం స్ఫూర్తిదాయకం :సీఎం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'నవరత్నాలు' పథకాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన పర్వతారోహకుడు జి.సురేష్‌బాబును అభినందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. గోనెగండ్లకు చెందిన పర్వతారోహకుడు సురేష్‌బాబు హిమాలయ పర్వతాలపై నవరత్నాలులోని పథకాలకు చెందిన పోస్టర్లను ప్రదర్శించారు.'నవరత్నాలు పథకాలకు ప్రపంచ ఖ్యాతిని తీసుకువచ్చే విధంగా ప్రచారం చేసిన సురేష్‌బాబుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నా..' అని సీఎం వైఎస్ జగన్ శనివారం ట్వీట్ చేశారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పట్ల సురేష్ కనబరిచిన అంకితభావం, ప్రేమ స్ఫూర్తిదాయకం. మీ మద్దతుకు కృతజ్ఞతలు' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

జూలైలో చంద్రయాన్–3

- ఆరు నెలలకొకసారి నావిగేషన్ శాటిలైట్ ప్రయోగం
- ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి
- జీఎస్ఎల్‌వీ ఎఫ్12 ప్రయోగం విజయవంతం కావాలని చెంగాళమ్మకు పూజలు


మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్–3 ప్రయోగాన్ని జూలై మొదటి వారంలో నిర్వహించనున్నట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. శుక్రవారం రాత్రి చంద్రయాన్–3 ఉపగ్రహం బెంగళూరు నుంచి షార్ కేంద్రానికి చేరుకుందని చెప్పారు. సోమవారం నిర్వహించే జీఎస్ఎల్‌వీ ఎఫ్12 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుంటూ శనివారం సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈవో శ్రీనివాసులురెడ్డి, సభ్యులు ఇస్రో చైర్మన్‌కు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయన్ని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆ తర్వాత సోమనాథ్ మీడియాతో మాట్లాడారు. జీఎస్ఎల్‌వీ ఎఫ్12 ప్రయోగానికి ఆదివారం ఉదయం 7.12 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సేవలందిస్తున్న ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(ఐఆర్ఎన్ఎస్ఎస్) సిరీస్‌లోని 7 ఉపగ్రహాల శ్రేణిలో 4 ఉపగ్రహాల కాలపరిమితి పూర్తి కానుండటంతో.. వాటి స్థానంలో నావిక్ ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నామని తెలిపారు. ఇకపై ఆరు నెలలకొకసారి నావిగేషన్ శాటిలైట్‌ను ప్రయోగిస్తామని చెప్పారు. ప్రస్తుతం ఐఆర్ఎన్ఎస్ఎస్–1జీ స్థానంలో నావిక్–01 ఉపగ్రహాన్ని రోదసీలోకి ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. గగన్‌యాన్ ప్రయోగానికి సంబంధించి ఇంకా పలు పరీక్షలు నిర్వహించాల్సి ఉందన్నారు. 2024 చివరికల్లా మానవ రహిత ప్రయోగానికి సిద్ధమయ్యేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షార్ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంక్షేమంపైనా ప్రత్యేక దృష్టి

- ఏపీ బాలల సంక్షేమ, సంస్కరణల శాఖకు డైరెక్టర్ పోస్టు మంజూరు

సాక్షి, అమరావతి: బాలల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం బాలల సంస్కరణపైనా ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం బాలల సంక్షేమ, సంస్కరణల శాఖకు ప్రాధాన్యత కల్పించింది. సమాజంలో దాదాపు 40 శాతంగా ఉన్న బాలలను గత టీడీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన అనంతరం బాలల సంక్షేమ, సంస్కరణల శాఖ డైరెక్టర్ పోస్టు తెలంగాణకు పరిమితం కాగా.. ఏపీలో పూర్తిస్థాయి డైరెక్టర్ పోస్టు కల్పించకుండా 2014 నుంచి ఇన్‌చార్జిలతోనే కాలయాపన చేసింది. దీంతో ఆ శాఖ పనితీరులో ఆశించిన ఫలితాలు రాలేదు. ఇటీవల ఈ శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దానిని చక్కదిద్దే చర్యలు చేపట్టారు. సీఎం ఆదేశాల మేరకు డైరెక్టర్ పోస్టును మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ తొలి డైరెక్టర్‌గా బీడీవీ ప్రసాదమూర్తి కొద్దిరోజుల క్రితం బాధ్యతలు చేపట్టారు.

దారి తప్పిన బాలలపై ఫోకస్

వివిధ కారణాలతో అనాథలుగా మారిన, నిరాదరణకు గురైన 18 ఏళ్లలోపు బాలలతోపాటు బాల నేరస్తులను సంరక్షించి సంస్కరించేందుకు బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ కృషి చేస్తుంది. తగిన కుటుంబ నేపథ్యం లేని బాలలు, తల్లిదండ్రుల నిరాదరణకు గురైన వారు, దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్న పిల్లలు, వీధి బాలలు, లైంగిక దోపిడీలకు, దుర్వినియోగాలకు గురవుతున్న వారు, భిక్షాటన చేస్తున్న వారు, ఇతర అసాంఘిక కార్యకలాపాల కోసం వాడుకోబడుతున్న పిల్లలు, మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న పిల్లలు, నేరాలకు పాల్పడుతున్న పిల్లలపై ఈ శాఖ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. కాగా, ప్రస్తుతం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న బాలల సంరక్షణ విభాగాలను, మిషన్ వాత్సల్య పథకాన్ని బాలల సంక్షేమం, సంస్కరణ సేవల శాఖకు బదిలీ చేస్తే మరింత ప్రయోజనం ఉంటుందనే ప్రతిపాదన ఉంది. దీంతోపాటు ఈ శాఖలో పనిచేస్తున్న సీనియర్ అధికారుల సేవలను జిల్లాస్థాయి అధికారులుగా వాడుకోవడం ద్వారా బాలల న్యాయ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయవచ్చనే మరో ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943